


ప్రాచీన కవిత

(ప్రాచీన కావ్యసంకలనము)



ప్రచురణ

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, హైదరాబాదు.

ప్రథమ ముద్రణ, 1980, ఫిబ్రవరి

ప్రతులు. *2000*

మూల్యము. రూ. 5-00

ముద్రణ :

పద్మావతీ ఆర్ట్ పింటర్స్

హైదర్‌గూడ, హైదరాబాదు-500001.

1.

2.

3.

4.

సూచన :

ఈ సంఖ్యలు గల పాఠములు మాత్రమే విశారద పూర్వభాగ అభ్యర్థులు అభ్యసింపవలెను.

పాఠ సంఖ్య : 1, 3, 5, 8, 16 మరియు 18.

13

14

15

16

17

18

19

20

21

విషయసూచిక

కవి పరిచయాలు

1. నన్నయభట్టు

తెలుగులో ఆదికవిగా ప్రసిద్ధి చెందినవాడు నన్నయభట్టు. అతడు పదకొండవ శతాబ్దిలో రాజమహేంద్రవరం రాజధానిగా వేంగీ రాజ్యాన్ని పరిపాలించిన తూర్పు చాళుక్య రాజు రాజ రాజనరేంద్రుని ఆస్థానంలో ఉండేవాడు. రాజ రాజనరేంద్రుని కోరికతో నన్నయ సంస్కృత మహాభారతాన్ని తెలుగులో వ్రాసినాడు. ఆది, సభాపర్వాలు అరణ్యపర్వంలో మూడు ఆశ్వాసాలపైన నాలుగవ ఆశ్వాసంలో 142 పద్యాల వరకు రచించినాడు. మహాభారతంలోని తక్కిన పదిహేను పర్వాలను తిక్కన రచించగా, అరణ్యపర్వంలో తక్కిన భాగాన్ని ఎఱ్ఱన పూర్తిచేసినాడు. అందుకే ఈ ముగ్గురికీ కవిత్రయం అని పేరు. మహాభారత రచనలో నారాయణభట్టు అనే కవి, పండితమిత్రుడు తనకు సహాయపడినట్లు నన్నయ స్వయంగా చెప్పుకొన్నాడు. 'ఆంధ్రశబ్దచిన్తామణి' అనే వ్యాకరణ గ్రంథాన్ని నన్నయ వ్రాసినాడని కొందరి అభిప్రాయం. నన్నయను వాగనుశాసనుడు అని అంటారు. ఇతని కవిత్వం చక్కని ధారాశుద్ధి కలిగి ఉంటుంది. ప్రసన్నకథా కలితార్థయుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థ సూక్తినిధిత్వం నన్నయ కవితాలక్షణాలు.

2. నన్నిచోడదేవ

నన్నిచోడుడి కాలము విషయంలో అనేకమైన వాదోపవాదాలున్నాయి. ఇతడు నన్నయకంటే ముందువాడని కొందరు భావించినారు.

కాని పన్నెండవ శతాబ్దిపూర్వార్థంలో ఇతడు నివసించినాడని చాలామంది అభిప్రాయం. 1910 వ సంవత్సరంలో కీ. శే. మానవల్లి రామకృష్ణకవి గారు, నన్నిచోడుడు వ్రాసిన 'కుమారసంభవాన్ని' వెలికితీసి ప్రకటించే వరకు నన్నిచోడుని గురించిగాని, అతని కావ్యాన్ని గురించిగాని లోకానికి తెలియదు. ఈయన కావ్యకర్తలైన రాజులలో తొలివాడు. నెల్లూరు ప్రాంతంలోని చోడవంశపు రాజులలో ఈయన ఒకడై ఉంటాడని పలువురి అభిప్రాయం. కవిరాజ శిఖామణి 'టెంకణాదిత్యుడు' అని ఇతని బిరుదాలు. ఈతని తండ్రి చోడబల్లి, తల్లి శ్రీసతి. శ్రీశైల మఠాచార్యులలో ఒకడైన జంగమ మల్లికార్జునుడు ఈయనకు గురువు. కుమార సంభవము పన్నెండుఆశ్వాసాల చక్కని కావ్యం. భాషలో ఈయన కొంత స్వాతంత్ర్యం అవలంబించినాడు. కవిత్వం చాలా గొప్పగా ఉంటుంది. మొదటి సారిగా తెలుగు 'మార్గ-దేశి' భేదాన్ని గురించి, 'జాను తెనుఁగు'నుగురించి పేర్కొన్నవాడు నన్నిచోడుడు.

3. పాల్కురికి సోమనాథుడు

నన్నయనుండి కనిపిస్తున్న తెలుగు సాహిత్యంలో గొప్పమార్పును తీసికొని వచ్చినవాడు పాల్కురికి సోమనాథుడు. సంస్కృత పద్ధతిలో పండితులు మాత్రం ఆమోదించే నన్నయమార్గానికి మార్గపద్ధతి అని పేరు. సోమనాథుడు దానికి భిన్నంగా దేశిమార్గాన్ని నిలబెట్టినాడు. సంస్కరణ ప్రధానంగా కన్నడ దేశంలో బసవనితో ప్రారంభమైన వీరశైవ మత సిద్ధాంతాలను నమ్మినవాడాయన. పాల్కురికి సోమనాథునికి ముందే మల్లికార్జున పండితారాధ్యుడు వీరశైవ మతప్రచారాన్ని గావించినాడు. సోమనాథుడు తెలంగాణా ప్రాంతంలోని జనగామ తాలూకాలోని పాల్కురికి గ్రామంలో జన్మించినాడు. కర్ణాటక రాష్ట్రంలోని

'కలికెం'లో మరణించినాడు. క్రీ. శ. 1170-1222 మధ్య ఈయన అనేక గ్రంథాలను రచించినాడు. ద్విపద, శతకం, ఉదాహరణ మొదలైన కావ్యప్రక్రియలలో మొదటి గ్రంథాలను రచించినవాడు సోమనాథుడు. 'బసవపురాణము' 'పండితారాధ్య చరిత్ర' ఇతని ద్విపదకావ్యాలు; 'వృషాధిపశతకము' శతకము. 'బసవోదాహరణా'న్ని తెలుగులోను, సంస్కృతంలోను రచించినాడు. ఇవికాక అనేకలఘుకృతులను కూడా సోమనాథుడు రచించినాడు.

4. తిక్కనసోమయాజి

కవిత్రయంలో రెండవవాడు తిక్కన. తిక్కన వంశం కవిపండితుల వంశం. రాజకీయాలలో దండనాథాది పదవులను నధిష్టించిన వంశం. ఇతని తాత మంత్రిభాస్కరుడు. 'సారకవితాభిరాముడు' 'గుంటూరివిభుడు'. ఇతని పెదనాయనలలో ఒకడైన కొట్టరువు కేతన 'ఆంధ్రపద్యకాదంబరి' వ్రాసినాడు. తిక్కన తండ్రి కొమ్మన దండనాథుడు. తిక్కన జీవితం క్రీ.శ. 13వ శతాబ్ది మొదటినుంచి చివరివరకు విస్తరించింది. ఆయనను 'సహస్రమాసజీవి' అంటారు. 12వ శతాబ్ది ఉత్తరార్థంలో మత, రాజకీయ, భాషా, సాహిత్య రంగాలలో తలెత్తిన అనైక్యతను పోగొట్టి సమన్వయాన్ని సాధించిన అవతార పురుషుడుగా తిక్కనను చాలామంది భావిస్తారు. నెల్లూరు రాజు మనుమసిద్ధికి ఈయన మంత్రిగా ఉండేవాడు. తన మొదటి రచన 'నిర్వచనోత్తరరామాయణాన్ని' తిక్కన మనుమసిద్ధికి అంకితం చేసినాడు. హరిహరనాథాంకితంగా మహాభారతంలో విరాటపర్వం మొదలుకొని పదిహేను పర్వాలను స్వతంత్రమైనమార్గంలో తిక్కన రచించినాడు. 'కవిబ్రహ్మ', 'ఉభయకవిమిత్రుడు' తిక్కనకు గల బిరుదాలు. అల్పాక్షరాలలో అనల్పార్థ రచన, తెలుగు పలుకు నుడికారం తిక్కన కవిత్వంలోని ప్రత్యేకతలు.

5. ఎఱ్ఱాప్రగ్గడ

కవిత్రయంలో మూడవవాడు ఎఱ్ఱాప్రగడ. ఎఱ్ఱాప్రగ్గడ తాత ఎర పోతసూరి;తండ్రి సూరన గొప్పకవి;తల్లి పోతాంబ.ఇతనికాలం సుమారుగా క్రీ.శ. 1280–1360 మధ్యకాలం. నెల్లూరు జిల్లా, కందుకూరి తాలూకా లోని గుడ్లూరు ఎఱ్ఱన మొదటి నివాసస్థలం. తరువాత అద్దంకి రాజధానిగా రాజ్యంచేసిన ప్రోలయ వేమారెడ్డి ఆశ్రయాన్ని పొందినాడు. ఎఱ్ఱన, 'శంభు దాసు', ప్రబంధ పరమేశ్వరుడు'. ఈయన వ్రాసిన గ్రంథాలు ప్రధానంగా నాలుగు : రామాయణము, ఆరణ్యపర్వశేషము, శ్రీ నృసింహపురాణము, హరివంశము. రామాయణాన్ని వేమారెడ్డి సోదరుడు మల్లారెడ్డికి అంకితం చేసినాడు. ఆ గ్రంథం ఇప్పుడు లభ్యంకాదు. మహాభారతం అరణ్య పర్వంలో నన్నయ వదలిపెట్టిన భాగాన్ని ఎఱ్ఱన పూరించినాడు. నన్నయ కవితారీతిని అనుసరించి, నన్నయ పేరుతోనే ఈ రచనను చేపట్టినాడు. నృసింహ పురాణము నరసింహావతార కథ వస్తువుగా ప్రబంధశైలిలో రచించబడిన గ్రంథం. ఇందులోని వర్ణనలు తరువాతి ప్రబంధ కవులకు ఒరవడి అయినవి. రెడ్డిరాజ్యస్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డికి అంకితం ఇచ్చిన గ్రంథం 'హరివంశము'. ఇది మహాభారత కథానంతర కథ. ఎఱ్ఱన కవిత్వం 'హరివంశము'లో పరాకాష్ఠను పొందింది.

6. శ్రీనాథుడు

భారత కవుల తరువాత చెప్పుకోదగిన ప్రాచీనాంధ్ర కవులలో శ్రీనాథుడు ముఖ్యుడు. ఆంధ్రకవితా ప్రపంచాన్ని ప్రోచినవాడుగా ప్రశం సలను పొందినవాడు. క్రీ. శ. 14వ శతాబ్ది తుదిభాగంలో జన్మించిన శ్రీనాథుడు తెలుగుదేశం అంతా పర్యటించి తెలుగువారి జీవన విధానాన్ని చక్కగా గుర్తెరిగిన చాలాకొద్దిమంది కవులలో ఒకడు. 'సరస సాహిత్య

సామ్రాజ్య చక్రవర్తి' కమలనాభుడు ఈయన తాత; 'విద్యార్థాజీవభవుడు' మారయ తండ్రి; భీమాంబ తల్లి; వారిధీతటీ క్రాల్పపట్టణం ఈయన జన్మ స్థలం. శ్రీనాథుడు కవిమాత్రమేకాదు, న్యాయవైశేషికాది శాస్త్రాలలో పండితుడు; ప్రాకృతం మొదలైన అనేక భాషలు తెలిసినవాడు కొండ వీటి రాజు పెదకోమటి వేమారెడ్డి దగ్గర విద్యాధికారిగాకూడా ఉన్నాడు. చిన్నారి పొన్నారి చిరుతకూకటినాడే 'మరుత్తరాట్చరిత్ర'ను రచించినాడు. నూనూగు మీసాల నూత్న యౌవనంలో 'శాలివాహనగాథాసప్తశతి'ని తెలుగులో నుడివినాడు. నిండు యౌవనంలో శ్రీహర్షుని 'నైషధకావ్యా'న్ని 'శృంగారనైషధము' పేరిట ఆంధ్రీకరించినాడు. భీమఖండము, కాశీ ఖండము, హరవిలాసము, శివరాత్రి మహాత్మ్యము శ్రీనాథుని ఇతర కృతులు 'పల్నాటి వీరచరిత్ర' ద్విపద వీరగాథనుకూడా ఇతడే రచించినాడని పలువురి అభిప్రాయం. 'క్రీడాభిరామా'న్ని కూడా ఇతడే వ్రాసినాడని కొందరు అంటారు. శ్రీనాథుడికి 'కవి సార్వభౌముడు' అనే బిరుదం ఉంది.

7. బమ్మెర పోతన

పోతన క్రీ. శ. 1420 ప్రాంతంలో జన్మించినాడు. తెలంగాణం లోని ఓరుగల్లు ఈయన నివాస స్థలం. తండ్రి కేసన, తల్లి లక్కమాంబ. పోతన వ్యవసాయం వృత్తిగా జీవించినాడని జనశ్రుతి. గురువులవద్ద క్రమపద్ధతిలో విద్యను అభ్యసించకుండానే ఈతనికి కవితాశక్తి అలవడింది కాబట్టి ఈయన 'సహజపాండిత్యమండితు'డైనాడని కూడా పలువురిభావం. ప్రాచీన తెలుగు కవులలో పోతనకు ఉండే ప్రచారం, ఆయన కవిత్వానికి ఉండే ప్రాచుర్యం మరేకవికి లేదు. దానికి ఆధారమైన ఏకైక రచన ఆయన 'శ్రీమదాంధ్ర భాగవతము.' పోతన నిరాడంబర జీవి అని సూచించే

అనేక కథలు లోకవ్యాప్తిలో ఉండటంకూడా ఆయనకు ప్రచారం ఎక్కు వగా ఉండటానికి గల కారణాలలో ఒకటి. భాగవతాన్ని నరాంకితంచేయ నని ప్రతిజ్ఞచేసి ఇష్టదైవమైన రాముడికే అంకితంచేసినాడు పోతన. భాగవ తంలోని ఏ ప్రత్యేకఘట్టాన్ని తీసుకున్నా దానికి ప్రత్యేకమైన కావ్యంగా గుర్తించదగిన విలువ ఉంటుంది. రుక్మిణీకల్యాణం, గజేంద్రమోక్షం, వామనచరిత్ర, ప్రహ్లాదచరిత్ర మొదలైన ఘట్టాలు ఇట్లాంటివే. భాగవతం కాక 'భోగినీ దండకము' 'వీరభద్ర విజయము' గ్రంథాలనుకూడా పోతన రచించినాడు.

8. అనంతామాత్యుడు

శ్రీనాథయుగంలో వెలసిన కథాకావ్యాలలో 'భోజరాజీయము' ఒకటి. దీనిని రచించినవాడు అనంతామాత్యుడు. శ్రీనాథునికి కొంచెం ఇంచుమించు సమకాలీనుడైన అనంతామాత్యుని తాత బయ్యన తిక్కనతో భవ్యభారతి అనిపించుకొన్న కవి. తండ్రి తిక్కన శ్రీకాకుళాంధ్ర మహా విష్ణుభక్తుడు. కవి పండిత పోషకుడు, స్వయంగా కవి అయిన ధారానగ రాధిపతి భోజుని పేరిట వెలసిన గ్రంథమే "భోజరాజీయము' కాని భోజుని అసలైన చరిత్రకాక భోజుని పూర్వజన్మవృత్తాంతం పేరిట అనేక కల్పిత కథలు ఇందులో ప్రధానవస్తువు. అనంతుని భావనాపటిమ, వర్ణనా కౌశలం ఈ గ్రంథంలో అడుగడుగునా దర్శనమిస్తుంది. 'భోజరాజీయము' కాక 'ఛందో దర్పణము' అనే పేరిట తెలుగు ఛందోగ్రంథాన్ని 'రసా భరణము' పేరిట సాహిత్య శాస్త్రగ్రంథాన్ని అనంతామాత్యుడు రచించి నాడు.

9. తాళ్ళపాక అన్నమాచార్యులు

క్రీ. శ. 1408 లో జన్మించిన అన్నమాచార్యులు తాళ్ళపాక కవు లలో మొదటివాడు. తండ్రి నారాయణసూరి, తల్లి లక్కమాంబ. 'ఆడిన

మాటెల్ల అమృతకావ్యంగా, పాడిన పాటెల్ల పరమగానం'గా పదహారవ ఏటనుండే సంకీర్తనలు వ్రాయటం ప్రారంభించినాడు అన్నమాచార్యులు. తన జీవితంలో తన దగ్గరిచుట్టాలవల్ల పడ్డకష్టాలవల్ల ఇల్లువదలి తిరుపతి చేరి వేంకటేశ్వర భక్తుడై సంకీర్తనలు వ్రాసినాడు. సంస్కృతంలో 'సంకీర్తనలక్షణము' అనే గ్రంథాన్ని రచించి, 'పదకవితా పితామహుడు', 'సంకీర్తనాచార్యుడు' అని అన్నమాచార్యుడు పేరుపొందినాడు. పదాలన్నా సంకీర్తనలన్నా ఒకటే. తరువాత కాలంలో ఆధ్యాత్మిక కీర్తనలకు సంకీర్తనలని, శృంగార కీర్తనలకు పదాలని పేరు నిలచింది. అన్నమాచార్యుడు యోగ, వైరాగ్య, శృంగార మార్గాలలో మొత్తం ముప్పైరెండు వేల సంకీర్తనలను రచించినాడు. సంస్కృతంలో 'వేంకటాచల మహాత్త్యం' అనే గ్రంథాన్ని వ్రాసినాడాయన. తెలుగులో 'ద్విపదరామాయణా'న్ని 'శృంగారమంజరి'నికూడా అన్నమాచార్యుడు రచించినాడు. తెలుగులో పన్నెండు శతకాలనుకూడా ఆయన రచించినట్లు తెలుస్తున్నది. కాని ఒక 'వేంకటేశ్వర శతకము' మాత్రమే లభించినది.

10. వేమన

తెలుగు శతకవాఙ్మయంలో వేమనకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. వేమన దేశ, కాలాలు, కులం ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉన్నాయి. ఈయన కొండవీటిసీమలో రెడ్డికులంలో జన్మించి యోగియై తత్త్వజ్ఞానాన్ని పొందినాడని చాలామంది ఊహ. వేమన తెలుగుదేశం నాలుగు మూలలా సంచారం చేసినాడు. దానివల్ల గడించిన అనుభవంతో శతకాన్ని రచించినాడు. ప్రాచీన కవులలో సంఘ సంస్కర్తగా, మూఢాచారాలను ఖండించినవాడుగా వేమనను పేర్కొనవచ్చును. వేమన పేరిట నాలుగు వేలకుపైగా పద్యాలు ప్రసిద్ధి పొందినాయి. వీటిలో కొన్ని ప్రక్షిప్తాలు కావచ్చును. ఏమైనా వేమన కవిత్వంలో

సంఘవిమర్శనం, మూఢమతాచారఖండనం, సామాన్య నీతి కనిపిస్తాయి. జాతి, మత, సాంఘిక భేదాలను తీవ్రంగా ఖండించినాడు. మోసాన్ని, అన్యాయాన్ని సహించని చిత్తవృత్తి వేమనది. శ్రోత లేక పాఠకుని మనస్సుకి హత్తుకొనేటట్లుగా చెప్పటం వేమన ప్రత్యేకత.

11. అల్లసాని పెద్దన

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ప్రధానుడు; రాయలకు ఆప్తుడు. 'ఆంధ్రకవితాపితామహ' బిరుదాంకితుడు. ఈతని తండ్రి చొక్కనామాత్యుడు. క్రీ. శ. 15వ శతాబ్ది ఉత్తరార్థంలో జన్మించిన పెద్దన రాయలనుండి కోకట మొదలైన గ్రామాలను అగ్రహారాలుగా పొందినాడు. ఇంచుమించు క్రీ. శ. 1519 ప్రాంతంలో పెద్దన రచించిన 'మనుచరిత్ర' ప్రబంధవాఙ్మయానికి వేగుచుక్క. ప్రాచీన సాహిత్యంలో తెలుగుకవులు తమ సొంతమార్గానికి సంబంధించినవిగా గర్వించదగిన రచనలు ప్రబంధాలు. 'మార్కండేయపురాణము' లోని స్వారోచిషమనువు జన్మవృత్తాంతం వస్తువుగా రచించిన ప్రబంధం 'మనుచరిత్ర'. పేరులోను, కాలంలోను మాత్రమే కాదు కావ్యగుణాలలోకూడా పెద్దన ప్రబంధ కవులలో పెద్ద. పెద్దన చిత్రించిన వరూధినీ, ప్రవరాఖ్యులు తెలుగు సాహిత్యం ఉన్నంతవరకు జ్ఞాపకం ఉంచుకోవలసిన పాత్రలు. పెద్దన రచించిన మరొక గ్రంథం 'హరికథాసారము' నేడు లభ్యంకాదు.

12. నంది తిమ్మన

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానాన్ని అలంకరించిన అష్టదిగ్గజ కవులలో నందితిమ్మన ఒకడు. ఈయనకే ముక్కుతిమ్మన అనికూడ పేరు. తండ్రి సింగయామాత్యుడు, తల్లి తిమ్మాంబ. 'పారిజాతాపహరణము' అయిదు ఆశ్వాసాల శృంగార ప్రబంధాన్ని రచించి శ్రీకృష్ణదేవరాయలకు

అంకిత మిచ్చినాడు. రచన మృదు, మధుర పదగుంఫనవల్ల 'ముక్కు తిమ్మనార్యుని ముద్దుపలుకు' అని ఈయనకు పేరు కలిగింది. తెలుగు వారికి పరిచితమైన సత్యభామ తిమ్మన సృష్టించినదే. కవిత్వము కసరత్తు కాదని నిరూపించిన చాలాకొద్దిమంది ప్రాచీన కవులలో తిమ్మన ఒకడు.

13. ధూర్జటి

ధూర్జటి కూడా శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజ కవులలో ఒకడు. ఈయన తండ్రి నారాయణామాత్యుడు, తల్లి సింగమ. కాళహస్తిక్షేత్రం ఈయన జన్మస్థానం. 'స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గెనో ఈ యతులిత మాధురీ మహిమ' అని తన కవితా మాధుర్యం ద్వారా పేరుగొన్నవాడు ధూర్జటి. 'శ్రీకాళహస్తీశ్వరశతకము', 'శ్రీకాళహస్తి మాహాత్మ్యము' ఈయన కృతులు. వైష్ణవ మతానికి రాజాదరణ ఉండిన రాయల కాలంలో శైవుడిగా నిలచినవాడు ధూర్జటి. 'శ్రీకాళహస్తీశ్వరశతకము' తెలుగు శతకాలకు తలమానికము వంటిది. ధూర్జటి జీవితం, ఆయన అభిప్రాయాలు ఈ శతకం వలన మనకు తెలుస్తాయి.

14. శ్రీకృష్ణదేవరాయలు

క్రీ. శ. 1510-1530 విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించి స్వయంగా కవి, పండితుడు అయి కవి, పండిత పోషకుడుగా ప్రఖ్యాతి గాంచినవాడు శ్రీకృష్ణదేవరాయలు. తల్లి నాగలాంబ; తండ్రి నరసానాయకుడు. ఈయన కాలంతోనే తెలుగు సాహిత్యంలో ప్రబంధయుగం ప్రారంభం అవుతుంది. పెద్దనాది మహాకవులు ఈయన ఆస్థానంలో వెలసినారు. మదాలసా చరిత్ర, సత్యావధూ ప్రీణనము, సకల కథా సార సంగ్రహము, రసమంజరి, జ్ఞానచింతామణి, ఉషాపరిణయము, జాంబ

వతీ కల్యాణము, అముక్తమాల్యద శ్రీకృష్ణదేవరాయల రచనలు. వీటిలో సంస్కృతంలో రచించిన 'జాంబవతీ కల్యాణము' తెలుగులో రచించిన 'ఆముక్తమాల్యద' మాత్రమే నేడు లభ్యం అవుతున్నాయి. కృష్ణదేవ రాయల కీర్తికి ప్రధానాధారం 'ఆముక్తమాల్యద'. ఈయన కవిత్వం నారికేళపాకం అని ప్రసిద్ధి పొందింది. వర్ణనాశక్తికి కృష్ణదేవరాయల కవిత్వం పరాకాష్ఠ. శ్రీరంగనికి తాను ధరించిన మాల్యమిచ్చిన పిన్నది గోదాదేవి కథ ఆముక్తమాల్యద ప్రధాన ఇతివృత్తం.

15. రామరాజ భూషణుడు

ఇతనికే భట్టుమూర్తి, మూర్తికవి అని పేర్లు అళియ రామ రాజు ఆస్థానంలో ఉండి తన కవితాశక్తితో అతనిని మెప్పించటం వల్ల రామరాజ భూషణుడనే పేరు ఈయన పొంది ఉంటాడు. ప్రబంధాంకం ఈయన ఇంటిపేరు. అష్టకపత్వ శతలేఖినీ పద్యాది కవితా విశేషాలు తన కున్నట్లుగా రామరాజ భూషణుడు చెప్పుకున్నాడు. ఈయన అల్లసాని పెద్దనకు శిష్యుడని తెలుస్తున్నది. 'కావ్యాలంకార సంగ్రహము' అనే నామాంతరంగల 'నరసభూపాలీయము' అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని ఓముల నరసరాజుకు అంకితం చేసినాడు. 'హరిశ్చంద్ర నలోపాఖ్యానము' అనే ద్వ్యర్థి కావ్యాన్ని కూడా ఈయన రచించినాడు. రామరాజ భూషణుని కీర్తికి పట్టుకొమ్మ అయినది 'వసుచరిత్రము'. తిరుమల రాయలకిది అంకితం. ప్రబంధ లక్షణాలన్నీ పూర్తిగా సరిపోయే గ్రంథం 'వసుచరిత్ర'. తరువాత వచ్చిన చాల ప్రబంధాలకు 'వసుచరిత్ర'యే ఆదర్శమయింది. భారతంలోని 'గిరికా, వసురాజు'ల చిన్న కథను వస్తువుగా తీసుకొని స్వకపోల కల్పనలతో విస్తరించి రచించిన ప్రబంధం వసుచరిత్ర.

16. పింగళి సూరన

పదహారవ శతాబ్ది ఉత్తరార్థంలో జీవించిన పింగళి సూరనకు మధ్యయుగీన కవులలో ఒక ప్రత్యేకస్థానం ఉన్నది. సూరన రచించిన మూడు గ్రంథాలూ మూడు కోవలకు చెందినవి. 'రాఘవ పాండవీయము' లభించిన ద్వ్యర్థి కావ్యాలలో మొదటిది. ఇది పంపావిరూపాక్షదేవునికి అంకితం. రామ, భారత కథలను జోడించి స్వతంత్రంగా వ్రాసిన రెండర్థాల కావ్యం ఇది. మిశ్రఇతివృత్తంతో ఇతర సమకాలీన ప్రబంధాల కోవలో రచించిన గ్రంథం 'ప్రభావతీ ప్రద్యుమ్నము'. దీనిని తన తండ్రికే అంకితం చేసినాడు. సూరన కీర్తి ప్రతిష్ఠలు ఎక్కువగా అధారపడిన ప్రబంధం 'కళాపూర్ణోదయము'. కల్పనాకథతో రమణీయమైన పద్ధతిలో ఉత్కంఠ కలిగింపజేస్తూ ఆధునిక కాలంలో విమర్శకులను ముగ్ధులను చేసేటట్లు ఈ గ్రంథాన్ని రచించినాడు సూరన. ''కళాపూర్ణోదయ మనగా కవిత్వకళ యొక్క పరిపూర్ణమైన ఉదయము'' అని దీనిని ప్రశంసించినారు విమర్శకులు. ఈ ప్రబంధంలోని కలభాషిణీ మణికంధరులు, సుగాత్రీ శాలీనులు తెలుగు దేశంలో ప్రసిద్ధి పొందిన పాత్రలు. ఇది నంద్యాల కృష్ణమరాజుకు అంకితం.

17. తెనాలి రామకృష్ణుడు

తెనాలి రామకృష్ణుడి పేరు వినని చదువుకున్నవారు తెలుగు దేశంలో ఉండరు. ఆయన పేరిట అనేక హాస్య కథలు ప్రచారంలో ఉన్నాయి. నిజానికి తెనాలి రామకృష్ణుడు తెలుగులో ప్రౌఢ కవులలో ఒకడు. ఈయన వ్రాసిన ముఖ్యమైన గ్రంథాలు 'ఘటికాచల మాహాత్మ్యము', 'ఉద్భటారాధ్య చరిత్రము', 'పాండురంగ మహాత్మ్యము'. 'ఉద్భటారాధ్య చరిత్రము' వ్రాసిన కవిపేరు రామలింగ కవి అని, 'పాండురంగ మాహాత్మ్యము'ను వ్రాసిన కవి రామకృష్ణ కవి అని ఉంది.

దీనినిబట్టి ఇద్దరూ వేరని కొందరు ఊహించినారు. రెండు గ్రంథాల శైలులను పరిశీలించి చూచిన విమర్శకులు ఇద్దరూ ఒకరే అని నిర్ణయించినారు. ఈయన మొదట శైవుడై తరువాత వైష్ణవమతాన్ని అవలంబించినాడేమో అని పలువురి ఊహ. 'ఉద్భటారాధ్య చరిత్రము' దేచమంత్రికి అంకితం. 'పాండురంగ మహాత్మ్యము' విరూరి వేదాద్రి మంత్రికి అంకితం. తెనాలి రామకృష్ణుడు పదగుంఫనకు, ఉక్తివైచిత్రికి పేరుపొందినవాడు.

18. ఆతుకూరి మొల్ల

'మొల్ల రామాయణ'మని ప్రసిద్ధి పొందిన ఆరు కాండల పద్య కావ్యాన్ని రచించినది ఆతుకూరి మొల్ల. ఈమె కుమ్మరి కులంలో జన్మించిందని చాలామంది అభిప్రాయం. తండ్రి పేరు కేసయ. ఇతర వివరాలు తెలియవు. కాల, దేశం నేటికీ వివాదాస్పదంగానే ఉంది. శ్రీనాథుని తన గ్రంథంలో తలచినందున ఈమె శ్రీనాథుని తరువాత కాలానికి సంబంధించిందై ఉంటుంది. మొల్లది జాతీయమైన కవిత్వమని, కావ్యంలో ప్రౌఢత ఉన్నదని విమర్శకుల అభిప్రాయం.

19. చేమకూర వేంకటకవి

క్రీ. శ. 17వ శతాబ్దం ప్రారంభంలో తంజావూరును పరిపాలించిన రఘునాథ నాయకుని ఆస్థానంలో ఉండేవాడు చేమకూర వేంకటకవి. ఈయన 'సారంగధర చరిత్ర', 'విజయ విలాసము' అనే కావ్యాలను రచించినాడు. 'విజయ విలాసా'నికే 'సుభద్రాపరిణయము' అని నామాంతరం. తన కావ్యాలను వేంకటకవి రఘునాథ నాయకునికి అంకితం చేసినాడు. 'విజయ విలాసము' చక్కని సరసమైన కావ్యం. శబ్దసౌకుమార్యానికి వేంకటకవి కవిత్వం పెట్టినది పేరు. శబ్దాలంకారాలను వాడినా అర్థసౌందర్యం చెడదు. శ్లేషలు వాడినా అవి పువ్వులవలె విడిపోతాయి. విజయ విలాస కావ్యంవలననే, 'ఇంటి పేరు నసగా ఉన్నా కవిత్వం మాత్రం పసగా ఉంటుం'దనే పేరు పొందినాడు. ఉలూపి, చిత్రాంగద, సుభద్రలతో అర్జునుని మూడు వలపుల కథ ఈ కావ్యంలో ఇతివృత్తం.

20. క్షేత్రయ్య

క్రీ. శ. 17వ శతాబ్దం పూర్వార్ధానికి చెందిన క్షేత్రయ్య కృష్ణా జిల్లాలోని మొవ్వ గ్రామవాసి. మొవ్వలోని గోపాలస్వామి కంకితంగా శృంగార రసభరితాలైన పదాలను ఈయన తెలుగులో వ్రాసినాడు. వీటినే మువ్వగోపాల పదాలని అంటారు. అన్నమాచార్యుడి శృంగార సంకీర్తనలు క్షేత్రయ్య పదాలకు మాతృకలని చెప్పవచ్చును. క్షేత్రయ్య కాలానికి శృంగార సంకీర్తనలకు పదాలనే పేరు స్థిరపడింది. క్షేత్రయ్య తంజావూరు రాజు రఘునాథ నాయకుని కొలువులో కూడా కొంతకాలం ఉన్నాడు. ఆయన కుమారుడు విజయ రాఘవ నాయకుని కాలంలోకూడా క్షేత్రయ్య కొంతకాలం ఆస్థాన గౌరవాన్ని పొందినాడు. భావానికి అనుకూలంగా సంగీత రచన చేసిన వారిలో క్షేత్రయ్య ముఖ్యుడు. ఆయన పదాలు అభినయానుకూలంగా ఉంటాయి.

21. త్యాగరాజు

క్రీ. శ. 1767–1847 మధ్య నివసించిన త్యాగరాజు జన్మస్థానం తంజావూరి దగ్గర తిరువారూరు. తండ్రి కాకర్ల రామబ్రహ్మం; తల్లి సీతమ్మ. ఈయన తాత గిరిరాజ కవి యక్షగానాలను రచించినాడు. త్యాగరాజు 'త్యాగరాజనుత' అనే మకుటంతో శ్రీరామాంకితంగా ఇరవై నాలుగువేల కృతులను రచించినాడు. నేడు వెయ్యి కృతులు మాత్రమే లభ్యం అవుతున్నాయి. త్యాగరాజు సంగీతబ్రహ్మ. సాహిత్య పరంగా, సంగీత పరంగా కూడా త్యాగరాజు కీర్తనలు ఎన్నదగ్గవి. దక్షిణ దేశంలో అన్ని భాషలకు చెందిన శాస్త్రీయ సంగీత విద్వాంసులూ పాడే పాటలు త్యాగరాజకృతులే.

కుమారాస్త్ర విద్యా సందర్శనము

నన్నయ భట్టు

ఒకనాఁడు ద్రోణుఁడు ధృతరాష్ట్రున కిట్లనియె :

ఘోరాస్త్రశస్త్రవిద్యల
నారూఢములందు నిపుణులైరి కుమారుల్ ;
వీరల యవిరలవిద్యా
పారము సను టెఱుఁగవలయు భవదీయసభన్.

అనిన నట్లు చేయుదునని ధృతరాష్ట్రుండు నతిమనోహరంబైన శాతకుంభమయప్రేక్షాగారంబున నున్న.

అందుఁ గర మొప్పి సుందరీబృంద మఖిల
రత్నరాజితకనకధరాధరేంద్ర
కందరాంతరమున నున్న సుందరామృ
తాశనాంగనాబృందంబు ననుకరించె.

సుతుల విద్యాప్రవీణతఁ జూచువేడ్క-
నెంతయును సంతసమ్మునఁ గుంతిదేవి
రాజసన్నిధి గాంధార రాజపుత్రి
కెలన నుండె నున్మీలితనలిననేత్ర,

వ్యాసపురస్కృతావనిదేవనివహంబుఁ,
గృపశల్యశకునిగాంగేయవిదుర

సోమదత్తాదిభూసుర గురుబాంధవ
మిత్త్రవర్గంబు, నమేయమంత్రి
సామంతమండలేశ్వరసమూహంబును,
గాయకవైతాళికప్రవరులుఁ
దమతమ నియమితస్థానంబులం దోలి
నుండిరి, బోరన నులిసె భేరు,

లస్త్రదర్శనాగతాఖిలక్షత్రియ
వైశ్యశూద్రవివిధవర్ణజనుల
కలకలంబుఁ బ్రళయకాలసంక్షోభితాం
భోనిధిస్వనంబుఁబోలెఁ జెలఁగె.

అట్టి యవసరంబున నాచార్యుండు శుక్లాంబరాభరణ మాల్యాను లేపనయజ్ఞోపవీతపలితకేశశ్మశ్రుశోభితదేహుండై, రంగమధ్యంబున నశ్వత్థామసహితుండైన, వినుక్తజలదజాలవియన్మధ్యంబున నంగారక సహితుండైన యాదిత్యుండునుంబోలె నున్న ; నగణ్యభూసుర వరేణ్యపుణ్యాహవాచనానంతరంబున.

ద్రోణాచార్యు పిఱుంద నొప్పి కృతహస్తుల్, బద్ధగోధాంగుళి
త్రాణుల్, మార్గణపూర్ణతూణులు, మహాధన్వుల్, కుమారుల్ తను
త్రాణోపేతులు రంగమధ్యమున నంతన్ నిల్చి రుద్యద్గుణ
శ్రేణీరమ్యులు ధర్మజప్రముఖులై జ్యేష్ఠానుపూర్వంబుగాన్,

అసిచర్మకౌశలం బమరంగఁ జూపెడు
వారును, దృఢసౌష్ఠవంబు లొప్పఁ
దమతమ నామాంకితములైన శరముల
నేర్పడ లక్ష్యంబు లేయువారు,

హయమదద్విరదరథారూఢదక్షతఁ
ప్రకటించువారును, ప్రాసశక్తి
కుంతతోమరగదాకుశలత్వ మెఱిఁగించు
వారునుగా నిట్లు వసుధలోన

రాజసుతులతోడ రమణఁ బాండవధృత
రాష్ట్రిసుతులు వృద్ధరాజులొద్దఁ
దద్దయును ముదమునఁ దమతమ విద్యలు
మెఱసి రెల్లజనులు మెచ్చి పొగడ.

అంత ననంతబలపరాక్రములగు భీమదుర్యోధను లుద్యద్గదా హస్తు లయి మహామత్సరంబుతో నేకశృంగసముత్తుంగ శైల ద్వయంబు నను కరించుచు, వశానిమిత్తక్రుద్ధగంధసింధురంబులుంబోలె నొండొరులం దాఁకి, సవ్యాపసవ్యమండలమార్గంబుల గదా కౌశలంబు మెఱయునెడ.

అవనీచక్రము పాదఘాతహతి నల్లాడంగ, నత్యుచ్చభై
రవహుంకారరవంబునన్ వియదగారంబెల్ల భేదిల్లఁ, బాం
డవకౌరవ్యగదావిఘట్టన మకాండప్రోత్థమై, భావిపాం
డవకౌరవ్యరణాభిసూచనపటిష్ఠంబయ్యె ఘోరాకృతిన్.

ఆ రాజసుతుల విద్యా
పారగపటుచేష్టితములఁ బరువడి నగ్గాం
ధారీధృతరాష్ట్రిల కతి
ధీరుఁడు విదురుండు సెప్పి తెలుపుచునుండెన్.

అంత భీమదుర్యోధనుల గదాకౌశలంబు సూచుజనుల పక్షపాత జనితపరస్పరక్రోధవచనంబులు విని ద్రోణుండు రంగభంగభయం

బున నశ్వత్థామం బంచి, వారి నిద్దఱ వారించి, వారాశియుంబోలె బోరన మ్రోయుచున్న వాదిత్రశబ్దంబు లుడిపి, "నా ప్రియశిష్యుం డయిన యర్జును ధనుఃకౌశలంబు జూడుం" డనిన; నయ్యాచార్యు వచనానంతరంబున.

హారివిచిత్ర హేమకవచావృతుఁ, డున్నతచాప చారుదీ
ర్ఘోరుభుజుండు, భాస్వదసితోత్పలవర్ణుఁడు, సేంద్రచాపశం
పారుచిమేఘమో యనఁగఁ బాండవమధ్యముఁ డొప్పి బద్ధతూ
ణీరుఁడు రంగమధ్యమున నిల్చె జనంబులు దన్నె చూడఁగన్.

"వీఁడె కృతహస్తుఁ డఖిలాస్త్రవిద్యలందు
వీఁడె యగ్రగణ్యుఁడు ధర్మవిదులలోన
వీఁడె భరతవంశంబెల్ల వెలుఁగఁ గుంతి
కడుపు చల్లగాఁ బుట్టిన ఘనభుజుండు."

అని పలుకు జనుల పలుకులు
విని గొంతి యనంతహర్ష విస్తారితలో
చనయై నందను నృపనం
దనసంఘములోనఁ జూచి తద్దయుఁ బొంగెన్.

చారుమనస్సమ్మదరస
పూరము వెలివేర్చునట్లు పొలఁతికి విగళ
ద్భూరి స్తనజనితపయో
ధారలు, నానంద బాష్పధారలు నొప్పెన్.

అయ్యర్జును స్తుతివచనంబు లొక్కటఁ జనసంఘంబువలన నెగసి, వియత్తలవిదళనం బయిన; నమ్మహాధ్వని విని యడలిపడి ధృత రాష్ట్రుఁ "డిదియేమి రభసం"బని విదురు నడిగిన నాతం డిట్లనియె :

''భూరిభుజుం డర్జునుఁ డతి
శూరుఁడు దనయస్త్రవిద్యఁ జూపఁగ రంగ
ప్రారంభుఁ డయిన నతని న
వారితముగఁ బొగడు జనరవం బిది యధిపా!''

అనవుడు ధృతరాష్ట్రుఁడు దన
మనమున సంతోషమంది ''మానుగ వీనుల్
గనిన ఫలమునకు నిప్పుడు
వినఁగంటిని బాండుసుతుల విద్యాశక్తుల్.''
అని పొగడుచుండ నర్జునుం డాచార్య ననుమతంబున.
ఆగ్నేయశరమున నతిభీకరాగ్నియు
వారుణాస్త్రమున దుర్వారజలము
ననిలబాణంబున నధికానిలంబును
మేఘాస్త్రమున మహామేఘచయముఁ
బుట్టించు, మఱియును భూమిబాణంబున
భూప్రవిష్టుండగు, భూరిఘోర
శైలబాణంబున శైలరూపము దాల్చు,
వీరుఁ డదృశ్యాస్త్రవిద్య పేర్మిఁ
దా నదృశ్యదేహుండగుఁ దత్క్షణంబ
హ్రస్వుం డగు, దీర్ఘుఁ డగు, సూక్ష్ముఁ డగు, రయంబు
తోడ రథమధ్యగతుఁ డగు, ధూర్గతుండు
నగు, మహితలగతుఁ డగు నద్భుతముగ.

ఇట్లస్త్రవిద్యా వైచిత్ర్యంబు మెఱసి యర్జునుండు జనుల కాశ్చర్యంబు సేయుచున్నంతఁ గర్ణుఁడు నిజవిద్యాకౌశలంబు మెఱయ సమకట్టి రంగద్వారమున నిలిచి, భుజాస్ఫాలనంబు సేసిన.

జనులెల్లం గడు సంభ్రమింపఁగ నజస్రంబై భుజాస్ఫాలన
ధ్వని శైలప్రకరంబుపైఁ బడు మహాదంభోళిశబ్దంబయో
యన వీతెంచినఁ బాండవుల్ సనిరి ద్రోణాచార్యుఁడాయన్ సుయో
ధను వేష్టించిరి తమ్ములందఱును దద్ద్వారంబు వీక్షించుచున్.

సాలప్రాంశు, నిజోజ్జ్వలత్కవచు, శశ్వత్కుండలోద్భాసితున్,
బాలార్కప్రతిమున్, శరాసనధరున్, బద్ధోగ్రనిస్త్రింశు, శౌ
ర్యాలంకారు, సువర్ణవర్ణు, ఘనుఁ, గర్ణాఖ్యున్, జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణుఁ జూచి చూపఱు ప్రభూతాశ్చర్యులై రచ్చటన్.

కర్ణుండును జనుల నందఱ నదల్చి, చొత్తెంచి, రంగమధ్యంబున నిలిచి, కలయంజూచి కృపద్రోణాచార్యులకు నమస్కరించి సజల జలధరధ్వానగంభీరరవంబున నర్జును నాక్షేపించి యిట్లనియె:

''నీవ కడునేర్పుకాఁడవు
గా వలవదు, వీనిఁ గొన్ని గఱచితి మేమున్,
నీ విద్యలెల్లఁ జూపుదు
మే ? వీరలు సూచి మేలుమేలని పొగడన్.''

అనిన వినతనయు పలుకులు
జనులకు విస్మయము, సవ్యసాచికిఁ గోపం
బును సిగ్గును, మఱి దుర్యో
ధనునకుఁ బ్రీతియును జేసెఁ దత్క్షణమాత్రన్.

అంత ద్రోణుచేత ననుజ్ఞాతుండయి కర్ణం డర్జునుచూపిన యస్త్ర విద్యావిశేషంబులెల్ల నశ్రమంబున జూపినఁ, జూచి దుర్యోధనుండు దానుం దమ్ములును గర్ణునిం గౌఁగిలించుకొని, ''నాతో బద్ధ సఖ్యం

డవయి నాకును బాంధవులకును హితంబుసేసి, నన్నుం గురు రాజ్యంబు నుపయోగింపు'' మనిన, ''నట్లచేయుదు''నని కర్ణుం డొడంబడి, ''యిమ్మొఁగిన రాజలోకంబును. నీవును జూడఁ బార్థుతో ద్వంద్వ యుద్ధంబుసేయవలయు''ననిన, ధార్తరాష్ట్రి మధ్యంబున నున్న యక్కర్ణుం జూచి పార్థుం డిట్లనియె;

''పిలువంగఁ బడక సభలకు
బలిమిం జని పలుకు పాపభాగుల లోకం
బులకుఁ జన వేఁడి పలికెదు
పలువ ! యెఱుంగవు పరాత్మపరిమాణంబుల్.''

అనిన విని పార్థునకు ని
ట్లనియె నినాత్మజుఁడు ''దుర్బలాయాసక్షే
పనిబంధమ్ములు పలుకక
ఘననిశితాస్త్రములఁ బలుక గడఁగుము నాతోన్.

ఈరంగభూమి యస్త్ర వి
శారదులగువారి కెల్ల సామాన్యముగా,
కారయ వీరికిఁ జొరనగు,
వీరికిఁ గాదను విచారవిషయము గలదే !''

అని గర్వించి దుర్యోధనానుమతంబునఁ బార్థుతో ద్వంద్వ యుద్ధంబు సేయంబూని రణసన్నద్ధుండయి రవితనయుండు రంగ మధ్యంబున నున్నంత, నర్జునుండును నాచార్యభ్రాతృచోదితుండై యుగాంతకాలానలుండునుంబోలెఁ బ్రతిఘటించి నిలిచిన.

జనితామర్షణుఁ డంతఁ బార్థుపయిఁ బర్జన్యాస్త్ర మక్కర్ణుఁ డే
సె నపారంబయి భూనభోంతరముఁ దజ్జీమూతయూథంబు గ

ప్పనఁ దద్ధ్వాంతతిరోహితాపఘనుఁడై బీభత్సుఁ డుండెన్, విరో
చనుఁ డాత్మద్యుతి విస్తరించె సుతుపై సంప్రీతచేతస్కుఁడై.

అయ్యవసరంబున దుర్యోధనుం దొట్టి ధృతరాష్ట్రనందను లందఱుఁ గర్ణువలన నుండిరి, భీష్మద్రోణకృపపాండవులు పార్థువలననుండి, రంత—

రవిసుతపార్థుల ఘోరా
హవమునకును వెఱచుచున్నయది కుంతి తదు
ద్భవఘనతరశరతిమిరా
ఘవృతాంగుఁ దనూజుఁ జూడఁగానక వంతన్.

ధృతి దఱఁగి మోహమూర్ఛా
న్విత యైనను సంభ్రమించి విదురుఁడు ప్రత్యా
గతజీవఁ జేసె నప్పుడ
యతిశీతలచందనోదకాసేకమునన్.

అంత నర్జునుం డనిలబాణంబున నమ్మేఘపటలంబు పఱవ నేసి యాదిత్యసమతేజుం డయియున్న, విదురదర్శితు లైన యక్కర్ణార్జునులం జూచి కుంతి సంతసిల్లె; నపుడు ధర్మవిదుం డఖిలద్వంద్వయుద్ధసమాచారనిపుణుండు కృపాచార్యుం డయ్యిద్దఱ నడుమ నిలిచి, కర్ణున కిట్లనియె:

''కురుకులజుండు, పాండునకుఁ గుంతికిఁ బుత్త్రుఁడు, రాజధర్మబం
ధురచరితుండు, నీ వితనితోడ రణం బొనరించెదేని వి
స్తరముగ నీదు వంశమును దల్లిని దండ్రిని జెప్పు, చెప్పినన్
దొర యగుదేని నీ కెదిరి దోర్బలశక్తి నితండు సూపెడున్.''

అనిన విని కర్ణుండు దన కులంబును, దల్లిదండ్రులను జెప్ప సిగ్గు పడి, తల వాంచియున్నం జూచి దుర్యోధనుఁడు గృపున కిట్లనియె:

"కులము గలవాఁడు, శౌర్యము
గలవాఁడును, నధిక సేన గలవాఁడును, భూ
తలమున రా జను నామము
విలసిల్లఁగఁ దాల్చు మూఁడువిధముల పేర్మిన్.

రాజవరుఁడైన పార్థుతో రాజుగాని
యీతఁ డని సేయఁగాఁ దగఁదేని వీని
నెల్లవారును జూడంగ నీక్షణంబ
రాజుఁ జేసెద నే నంగరాజ్య మిచ్చి."

అని యప్పుడ భీష్మధృతరాష్ట్రులకుం జెప్పి, వారి యనుమతంబున మహామహీసురసహస్రంబునకు గోసహస్రాయుతంబు దానంబు సేసి, 'యంగరాజ్యంబునకు వీఁ డర్హుండయ్యెడు' మను బ్రాహ్మణ వచనంబు వడసి, కర్ణుం గాంచనపీఠంబున సునిచి, యంగ రాజ్యమున కభిషిక్తుం జేసినఁ గర్ణుండు మణిమకుటకేయూరహారాది భూషణ భూషితుండై, సకలరాజచిహ్నముల నొప్పి, పరమ హర్షంబుతోడం గురుపతి కిట్లనియె:

"బృహదబ్ధిమేఖలాఖిల
మహీతలక్షత్త్రివరసమక్షమున మహా
మహిమాన్వితుఁగా నన్నును
మహీశుఁగా జేసి తతిసమర్థత వెలయన్.

దీనికి సదృశముగా మఱి
యేనేమి యొనర్తు నీకు నిష్టం?'' బనినన్,

"మానుగ నాతోఁ జెలిమి మ
హీనుతముగఁ జేయు, మిదియె యిష్టము నాకున్."

అనిన విని దుర్యోధనున కెంతయు సంతోషంబుగాఁ గర్ణుండతని తోడి యిష్టసఖత్వంబున కొడంబడియె; నంతఁ గొడుకు రాజ్యాభి షేకోత్సవంబు సూచి హర్ష పరవశుండయి సూతుండు కర్ణునొద్దకుం బఱతెంచినఁ గర్ణుండును వినయవినమితోత్తమాంగుఁడైన.

కడఁగి సూతుండు పుత్రకుఁ గౌఁగిలించి
కొని, తదీయ మూర్ధాఘ్రాణ మొనరఁజేసి,
అంగరాజ్యాభిషేకార్ద్రమైన శిరముఁ
దడిపె వెండియు హర్షాశ్రుతతులఁజేసి.

దానిం జూచి భీముఁడు కర్ణుని సూతకులసంభవునిగా నెఱింగి నగుచు నిట్లనియె:

"నీదు కులమునకుఁ దగఁగఁ బ్ర
తోదముగొని రథము గడపఁదొడఁగుము, నృపధ
ర్మోదయుఁడగు నర్జునుతోఁ
గాదనక రణంబుసేయఁగా నీకగునే?...

ఉత్తమక్షత్రియప్రవరోపభోగ్య
మైన యంగరాజ్యంబు నీ కర్హమగునె?
మంత్రపూతమై, గురుయజమానభక్ష్య
మగు పురోడాశ మది గుక్క కర్హమగునె?"

అనిన, గర్ణుండు వెల్లనై..., దీర్ఘోష్ణనిశ్వాసవ్యాకులితవదనుండై ఆకాశంబువలననున్న యాదిత్యుం జూచుచు మిన్నకుండె; నంత,

నంతర్వ్యాలులితుండైన కర్ణుంజూచి భ్రాతృపద్మవనమధ్యంబునుండి దుర్యోధనమదాంధగంధసింధురంబు వెలువడివచ్చి, యలిగి, భీమున కిట్లనియె:

''అనిలజ! నీ కిట్లని ప
ల్కను దలఁపను నగునె? లేడికడుపునఁ బులి పు
ట్టునె? యిట్టి దివ్యతేజం
బునవాఁ డధమాన్వయమునఁ బుట్టునె చెపుమా?

శూరుల జన్మంబు, సురల జన్మంబును,
నేఱుల జన్మంబు నెఱుఁగ నగునె?
మొగిని దధీచి యెమ్మునఁ బుట్టదయ్యెనే
వాసవాయుధమైన వజ్రమదియు?
గాంగేయుఁడన, మఱి కార్తికేయుండన,
నాగ్నేయుఁడన రౌద్రుఁడనఁగ, శరవ
ణోద్భవుండన, గుహుం డుద్భవిల్లఁడె? శర
స్తంబజన్ముడుగాఁడె ధర్మవిదుఁడు

కృపుఁడు? ఘటసంభవుఁడుగాఁడె కీర్తిపరుఁడు,
వరుఁడు ద్రోణుఁడు? విప్రులవలనఁ బుట్టి
రైరె సత్ క్షత్రియ ప్రభు లవనిఁ గావఁ
గడఁగి? మీ జన్మములు నిట్లకావె వినఁగ?

వానితోడిదేమి? సహజకవచకుండల మండితుం డితఁడు ప్రకృతి పురుషుండుగాఁడు; తన బాహుబలంబున నీయంగరాజ్యంబునక కాదు, సకలమహీరాజ్యంబున కర్హుండగు'' ననుచుఁ ... గర్ణుందోడ్కొని నిజమందిరంబున కరిగె.

కుంతి యంత సహజకుండలకవచాభి
రాముఁ గర్ణుఁ జూచి, రవిసమానుఁ
బ్రత్యభిజ్ఞ నెఱిఁగి, ప్రథమపుత్రస్నేహ
మెఱుకపడకయుండ నింతి యుండె.

వినుతధనుర్విద్యావిదు,
ఘనుఁ, గర్ణు సహాయుఁ బడసి, కౌరవవిభుఁ డ
ర్జునువలని భయము సెడి, తొ
మ్మనఁజేయిడి నిద్రవోయె ముదితాత్మండై.

(ఆంధ్రమహాభారతము—ఆదిపర్వమునుండి)



మన్మథ దహనము

నన్నిచోడదేవ

అంత రతిసమేతుండు, పుష్పాయుధుండు పుష్పరథారూఢుండై, హిమవంతంబున కరిగి పరమేశ్వరు తపోవనంబు సొత్తెంచి,

వలరా జామనిఁ బిల్చి ''వేగమెయి నీ వాసంతికానందదో
హల మీకాననలక్ష్మికి''మ్మనుడు, నాహ్లాదంబుతో నెయ్య మ
గ్గలమైయుండ వసంతకుండుఁ దమపైఁ గన్నిడ్డఁ గారాకు గెం
దలిరా కయ్యెనొనాఁదలిర్చె వడిఁ గాంతారాంతరోర్వీజముల్...

మలయసమీరణాభిహతి మ్రాఁకుల నాకులు డుల్లి డుల్లి, క్రొ
మ్మొలకలు సాగిసాగి, విరిమోసులఁ గెందలిరొత్తియొత్తి, కు
ట్మలములు గ్రమ్మిగ్రమ్మి, కుసుమంబులు వాసనకెక్కియెక్కి, గు
త్తులుగొని పండిపండి వినుతుల్ దగ నారములొప్పె నామనిన్...

వేదన విరహులు సేదలుసెడి సంధు
లెడలంగఁ బల్లాకు లెడలెఁ దరుల
రాగిల్లుకవల మేఁదీఁగెలఁ బులకంబు
లంకురింపఁగఁ దరు లంకురించె
సమ్మదంబునఁ గామిజనులచిత్తంబులు
చిగురొత్తఁ దరులందుఁ జిగురులొత్తె

రతిదోహలముల దంపతుల ముఖాబ్జముల్
  విలసిల్ల విలసిల్లె విరులు దరుల

నెలమిఁ జిలుకపిండు దొలుమేనఁ జేసిన
తపము పండఁ బండెఁ దరువనంబు,
లువిద లింపు మిగుల నూయెలపాటలు
వాడ మధుమదమునఁ బాడె నలులు.

మదను తలిరెల్లులోయనఁ
బొదిగొని కెందలిరు లెసఁగు భూరుహములపై
నొదవెడు రాగాంబుధి బు
ద్బుదములునా నెసఁగె ముకుళములు తోరములై.

పొన్నలుపూచెఁ, బొన్నలొగి పూవకముందఱఁబూచె గోఁగు, లా
పొన్నలుఁగొండగోఁగులును బూవకముందఱఁ బూచెబూరువుల్
పొన్నలు గొండగోఁగులును బూరువులున్నొగిఁ బూవకుండఁగా
మున్న వనంబునంగలయ మోఁదుగులొప్పగఁబూచె నామనిన్.

పలఁకెడు కారాకు లలితాస్థిచయముగా
  సోలుకొమ్మలు పలుకేలు గాఁగఁ
బాలపల్లవములు వ్రేలుకెంజడలుగాఁ
  బెనఁగు తీఁగలు దొడ్డఫణులుగాఁగఁ
గలకంఠనికరంబు గళమునకప్పుగాఁ
  బుప్పొడి మేని విభూతిగాఁగ
ఫలములు వరదానఫలములుగా నలి
  మాలికల్ రుద్రాక్షమాలికలుగ

శంభుమూర్తిఁ దాల్చి సహకారభూరుహ
చక్రవర్తి నవవసంతవేళ
నతిశయిల్లుచుండె నక్కడఁ గని, మది
నుదరిపడి మనోజుఁ డోసరింప...

నెలఁతల పరిమళనిశ్వాసపవనంబుఁ
దలపించె దక్షిణానిలవిలాస
మింతుల దరహాసకాంతిసంభావన
గావించెఁ జంద్రప్రభావిభాతి
రమణుల రక్తాధరభ్రాంతి నొదవించె
లాలితాశోకప్రవాళలీల
వనితల మంజులస్వనశంకఁ బుట్టించెఁ
గలకంఠమదకీరకలకలంబు

కామినీవిలోలకర్ణాంతవిశ్రాంత
లోచనప్రశంసలోలబుద్ధిఁ
బడసె దళితపత్రపద్మవిభ్రమము వి
యోగులందు మధుసమాగమున.

సోలుచు, సమ్మదరసమునఁ
గ్రాలుచు వనపాలబాలికలు నవలతికాం
దోలముల వేడ్కఁ సలుపుచు
నాలతు లొగిఁజేసి పాడి రభినవలీలన్...

ఆమనికి నెలమి విపులా
రామంబుల పొల్పు సూచి రాగోత్కటమై

కాముఁడు రతిఁ గని తాను
గామాతురుఁడై మనోవికారము నందెన్.

లత్తుకరసమున జొత్తిల్లఁబదతల
ముల నరచేతుల మోవిఁ బూసి
నవకుసుమంబుల నానావిధంబుల
తొడవులు రచియించి తొడిపి వేడ్క
రాజీవపుష్పపరాగంబుఁ గబళించి
విలసిల్లు సీమంతవీథిఁ బోసి
యరవిరి సురపొన్నయకరువు వరుసతో
నలకల జిన్నిపువ్వలికి కలయ

సలలితంబగు పుప్పొడి డులిచి వీఁగు
జన్నగవమీఁదఁ బోయుచుఁ జెన్నుమిగుల
సుదతి గైసేసి, ప్రీతితోఁ జూచుచుండె
భావజన్ముండు వచ్చిన పనియు మఱచి...

ఇట్లు తత్కాలోచిత క్రీడాపరవశుండై కంతుండు బెదరి,నిజగమన ప్రయోజనంబుఁ దలంచి, యాక్షణంబ... సమరసన్నద్ధుండై, సకల జనంబులు...ననురాగరసపూరిత హృదయులై పరవశులై యున్నం గని, హరగిరిజల కంతకుం దమయంతన సంగమంబగు, నా వచ్చిన తెలసంబు వసంతువలనఁ దీరకున్నె? యని... అనతి దూరంబుగాఁ జనిఁ ముందట.

అమరగ నింద్రియాళి విషయంబులతో, విషయంబు లన్నియుం గ్రమమున గాడ్పునందడఁచి, గాడ్పులఁగూర్చిఁ మనంబునందు, సం యమమతిఁ దన్మనంబొనర నాత్మునియందొడగూర్చి, యాత్మయో గమునఁ జలింపకున్న శివుఁ గాంచె మనోజుఁడు దవ్వుదవ్వులన్,

హరుఁగని, ప్రాణము ఝల్లని
విరిసిన మెయిమఱచి పచ్చవిల్తుఁడు దగఁ జి
త్తరువున వ్రాసిన కాముని
కరణి నచైతన్యవృత్తిఁ గదలక నిల్చెన్,

ఇట్లు నిలిచి, రతిప్రబోధితుండై, త్రిణయను సమాధివైఫల్యంబు సేయ నుపక్రమించి నిజమూలబలంబుల నవలోకించిన,

అలిఝుంకారముఁ, గీచకస్వనముఁ గీరాలాపముల్, మత్తకో
కిలనాదంబులు, శారికారవములుం, గేకినినాదంబులుం
గలియం భోరన మంజుగానములతో గంధర్వగీతంబు ల
గ్గలమైభోరనమ్రోసె నీశ్వరులతాగారంబు ఘూర్ణిల్లగన్!...

శంభుసమాధికి విఘ్నా
రంభములై యులియు వనచరములకు జిహ్వా
స్తంభ గతిస్తంభ మనః
స్తంభములుగ నంది హస్తసంజ్ఞ నదల్చెన్...

మృదుపై ముంగలి సని, తల
పడి మలయానిలుఁడు పోరుభరమై మదనుం
బడలుపడఁ బఱచు క్రియఁ దడఁ
బడ ధూళియు గాడ్పు వీచెఁ బ్రతికూలంబై...

తరు గుల్మాదుల మఱువునఁ
దరతరమ చలించి గడికిఁ దారుచుఁ బురసం

హరు నెయిదఁ జొచ్చెఁ గాముఁడు
గరివైరికిఁ జొచ్చు వేటకాఁడును బోలెన్...

అంత నకాలవసంతలతాంతాపచయ కేళీలాలసయై,...

మెలపారు నెలమావి తలిరుల నొకకొన్ని
రమణీయమగు చంపకములు వొదివి
లాలితాశోకపల్లవముల నొకకొన్ని
కమనీయమగు గుర్వకములు వెట్టి...

చెలువలెల్ల నొందు చిగుళులు పువ్వులు
గలయఁదాల్చి, పొల్చి బలసిరాఁగ
శైలరాజతనయ సనుదెంచె నందన
వనము గాఁపువచ్చు వడువవోలె...

అంతం బరమేశ్వరుండు తుర్యావస్థితంబులైన మనఃప్రాణంబులు జాగ్రదవస్థావ్యవస్థితంబులు సేసి, సుప్రసన్నుండైన కన్నెఱింగి గౌరి ...హరచరణసరసీరుహంబులకుఁ బుష్పాంజలి యిచ్చి, కృతాంజలియైన,

ఆ వనజాస్య హస్తతలజారుణదీప్తులఁ గూడివచ్చు పు
ష్పావలిమీఁద నీశతనుజామలరోచులు గప్పి యొప్పె సం
ధ్యావిరళోద్గతప్రకటితారుణదీప్తులలోనఁ బొల్చు తా
రావళిమీఁదఁ బర్వు నమృతాంశుకరప్రకరాభిరామమై...

అంతం గంతుండు గౌరీహృదయంబు న్మదనాస్త్రంబున భేదించిన నాక్షణంబ

అలికాగ్రంబునఁ గ్రాలి యాడి బొమ లాహ్లాదింపఁ గన్గోనలం
దలఁకెన్ సమ్మదవారి, మోవియదరెన్, దన్వంగిమై నొత్తెము
త్పులకల్, గంపముగూడ నూర్పులెలమింబొండె, న్మనంబాత్మలో
నొలసెన్, రాగము మోమునం బొలసె గండోల్లాసహాసప్రభల్,

ఆలలితస్మితాస్యలలితామలకోమలచంచలాలసా
లోలవిశాలసంస్ఫురితలోచనదృష్టిరసప్రవాహమం
దోలిన పర్వి, వెల్లిగొని, యొక్కటఁ గ్రక్కున ముంచి మీఁదికిం
దేలఁగసెత్తెఁ, జుట్టె, హరుఁద్రిప్పులఁబెట్టె మనోజుఁడుబ్బఁగాన్.

నగరాజతనయ పన్నగ రాజధరుమ్రోల
నిలువుతు మదనుఁ డేటలవి నిలిచె
నెలనాగ గరిబొమల్ పొలయింపనెత్తుడుఁ
జిత్తజుఁ డించువి ల్లెత్తికొనియె
హరిణాక్షి లసదపాంగాలోకనము నాలు
కొలుపుడు న మ్మరిగొలిపె మరుఁడు
పతినెఱ నూరఁ బార్వతి సూచుసుఱుచూడ్కు
లాడుడు నలరమ్ము లాడె నీశుఁ

గంతుఁ డేయఁదొడఁగె, నంత నీశ్వరునకు
నచలవృత్తి జలుపు నాత్మవిమల
యోగభావ మెడపి, రాగోత్కటంబున
గౌరియందు నిలిపెఁ గన్ను, మనము.

గిరిజ లలితాంగములు వొరి
బొరిఁ గనుఁగొని పొగసి యిసుకబొమ్మలు జలముల్

దెరలఁగ విరిసినగతిఁ బొది
విరిసి మహేశ్వరు మనంబు వికలంబయ్యెన్...

ఎలరారు కనుగవ వాలయించుఁ గ్రేవల
నెఱిగొని మెఱుఁగులు దుఱఁగలింపఁ
గ్రొవ్విరి చిఱునవ్వు నవ్వు వాతెఱకాంతి
రంగిల్లి సితరుచుల్ దొంగలింపఁ
గుదుటఁ గ్రక్కడరినఁ గదియించునుడువిల్లు
సుడిసి ముత్తరఁగలు గదలుకొనఁగ
సోలంబు నెఱనూరు సొగియునుంజెమటపై
వదలి మేఁదీఁగ మవ్వంబు మిగుల

నొత్తలించుఁ, దఱమ నూకించుఁ, దాలిమి
కగ్గలించు, నెఱయ నప్పళించు
మదనశరవిభిన్న హృదయాబ్జయై మహా
దేవుఁ జూచి గౌరిదేవి తివుట,

ఇట్లు మదనపరవశయగు పార్వతిం గని సొగిసి,...

పులకాంకురంబులు దలలెత్తి మేను గం
పింపఁ గోమలిఁ గౌఁగిలింపఁ దలఁచు
రాగోత్కటమున సైరణలేక మానినిఁ
గాయ్వునఁ బైపడి కవయఁదలఁచు...
తన మహత్త్వంబు దలఁపక తరుణిపొందు
వడయఁ గీడ్పడి తేఁకువ వాపఁదలఁచు
భావజాస్త్రాభిహతి మహాదేవుఁ డొక్క
వ్రేలిమిడి బెంపుసెడి కడు విరలిగొనియె...

నవతమాలలతాతతి నడుమఁ బుష్ప
చాపమండనహస్తుఁడై, శంబరారి
దనరె నీలాభ్రపటలమధ్యమున నింద్ర
చాపహస్తుఁడై వెలుఁగు పర్జన్యులీల,

అంతకాంతకుండు కంతుఁ గనుంగొని, కోపించి ... దహనాంబకంబు విచ్చిచూచిన.

పొగయగ, రాజకొక్కమొగి భోరన మంటలు విస్ఫులింగముల్
నెగసి, రయంబునం గలయనిండి, ఛటచ్ఛటభుగ్భుగద్ధగ
ద్ధగయని మండి పంచశరు దగ్ధముసేయుచ, యాక్షణంబులో
మగిడి పురాతి నేత్రశిఖి మల్చె మహాశనిపాతభీమమై,

నిటలాక్షవహ్ని గడును
త్కటమై తరతరమ మీఁదఁ గప్పిన మదనుం
డిట యట మెదలఁగ నేరక
పటుతరశిఖిశిఖలఁ గాలి భస్మంబయ్యెన్,

కని కోపించెనొ, గానక
మును గోపించెనొ, మహోగ్రముగ నుగ్రుఁడు సూ
చినఁ గాలెనొ, చూడక యట
మును గాలెనొ, నాఁగ నిమిషమున నఱగాలెన్,

గిరి సుతమైఁ గామాగ్నియు,
హరుమైఁ రోషాగ్నియుం, దదంగజుమైను
ద్ధురకాలాగ్నియు, రతిమై
నురు శోకాగ్నియును దగిలి యొక్కట నెగసెన్,

అనలశిఖాలిగాంచి యభయం బభయంబని దేవతల్ నభం
బునఁ జెల రేగి చీరుటకు మున్న మనోభవు నీఱుచేసి పో
యినఁగని దిక్పతుల్ సురలు నింద్రుఁడు శోకభయార్తులై మఱుం
బనవుచుఁ బాఱిరొండొరుల పట్టులు గానక భీవికారులై,

(కుమారసంభవము-చతుర్థ పంచమాశ్వాసములనుండి)

రుద్రపశుపతి

పాల్కురికి సోమనాథుఁడు

వడిఁబాఱు జలమున కొడలెల్లఁ గాళ్ళు
వడిఁగాలు చిచ్చున కొడలెల్లఁ నోళ్ళు
వడిఁవీచు గాడ్పున కొడలెల్లఁ దలలు
వడిఁజేయు బసవన కొడలెల్ల భక్తి...
వ్యక్తంబెఱుంగ వే యయ్యైళయూర
భక్తుండు మును రుద్రపశుపతినాఁగఁ
ప్రథితమౌ నాదిపురాణమం దబ్ధి
మథనావసర మొక్కకథకుండు సదువఁ,
గమలజ కమలాక్షు లమితదైత్యాదు
లమరులు సెడి పాఱ, నం దుద్భవించి
పొరి నజాండములెల్ల దరికొని కాల్చు
గరళంబు మ్రింగె శ్రీ కఱకంఠుఁ డనిన—
నా రుద్రపశుపతి యాలించి, ''భర్గుఁ
డారగించుట నిక్కమా విషం ?" బనుడు
''ననుమానమా ! త్రావె హరుఁడు విషంబు
బనుగొన నటమీఁదిపను లెఱుంగ'' మన,
విని యుల్కిపడి వీఁపు విఱిగి ''హా ! చెడితి''
నని, నేలఁబడి పొర్లి ''యక్కటా ! నిన్ను

వెఱ్ఱిఁజేసిరిగాక విశ్వేశ ! యెట్టి
వెఱ్ఱివారైనను విషముఁ ద్రావుదురె ?
బ్రతుకుదురె విషమ్ముఁ బాలైన వార ?
లిది యెట్లు వినవచ్చు, నేమిసేయుదును
నిక్క మెవ్విధమున నిన్నెకా తెఱఁగ
ముక్కంటి ! నాకింక దిక్కెవ్వరయ్య ?
నాకొఱకైనఁ బినాకి ! యివ్విషము
చేకొన కుమియ వే నీకు మ్రొక్కెదను
కటకటా ! మేన సగంబున నుండి
యెట వోయి తవ్వె ! నీ వెఱఁగవే గౌరి !
ప్రమథగణములార ! పరమాప్తులార !
సమసిన వెండి మీశక్యమే కావ ?
శతరుద్రులార ! యసంఖ్యాతులార !
క్షితిధరకన్యకాపతిఁ గావరయ్య !
వీరభద్రయ్యరో ! విషముఁ బ్రాణేశుఁ
డారగించె నిఁ కెట్టు లవునోకదయ్య !
ఓ పురాతనులార ! యొడయండు బ్రతుక
నోపునొకో ! విషం బొగి నారగించెఁ
జావు దప్పింపరే సద్గురునాథు
దీవన లీయరే, కావరే శివునిఁ,
దల్లి లేని ప్రజలఁ దలఁతురే యొరులు
తల్లియున్న విషముఁ ద్రావనే లిచ్చు !"...
నని ప్రలాపింపుచుఁ బనవుచు, "నొండు
వినఁజాలఁ, బ్రాణము ల్విడుతు నే" ననుచుఁ
దడయక ఘనజలాంతరమున నుఱుకఁ ;

బడకుండ నా రుద్రపశుపతిఁ బట్టి
పార్వతీసహితుఁడై ప్రమథరుద్రాది
సర్వసురాసురసంఘంబు గొలువ
హరుఁడు ప్రత్యక్షమై ''యడుగుము నీకు
వరమిత్తు నెయ్యది వాంఛితం" బనుడుఁ
గడు సంభ్రమంబున మృడుపదాబ్జములఁ
బడి రుద్రపశుపతి భట్టారకుండు
''ఏమియు నే నొల్లనీ విషసేవ
నేమేమి వుట్టునో యే వినఁజాలఁ
గ్రక్కున నుమియవే కాలకూటంబు,
నిక్కంబు నాకెక్క నీయావి'' యనిన;
దశనకాంతులు దశదిశలఁ బర్వంగఁ
బశుపతి యారుద్రపశుపతి కనియె—
''ఇట లోకములలోన నెన్న నేకాక
యిట మ్రింగ నుమియంగ నది యెంత వెద్ద?
యణుమాత్ర నాకంఠమందుఁ జిక్కనది
గణుతింప నున్న దే కాలకూటంబు?
యింత సంతాపింపనేల నీ'' కనుచు
వింతన వ్వాలయంగ సంతరించుడును,
''నమ్మంగఁ జాలఁ బినాకి! యివ్విషము
గ్రమ్మన నొక్కింత గడుపు సొచ్చినను
బెద్దయుఁ బుట్టునో, పిమ్మటివార్త
దద్దయు విననోపఁ, దా మున్న చత్తు,
సమయని, మ్మొండేనిఁ జావనీవేని
యుమియు మివ్విషమొండె, నొండు సెప్పకుము

తక్కినమాటలు దన కింప'' వనుచు
నిక్కంబు తెగువమై నిష్ఠించి పలుక;
నుమియకుండినఁ జచ్చునో ముగ్ధ యనుచు,
నుమబోటి యాత్మలో నుత్తలపడఁగ,
నుమిసినఁ గొని కాల్చునో తమ్మ ననుచుఁ
గమలాక్షముఖ్యులు గడగడ వడఁకఁ,
బ్రమథు లాతని ముగ్ధభక్తికి మెచ్చి
యమితమహోత్సవులై చూచుచుండ,
నొక్కింత నవ్వుచు నుడురాజధరుఁడు
గ్రక్కున లేనెత్తి, కౌఁగిటఁ జేర్చి,
''ప్రమథులయాన, నీపాదంబులాన
సమయ నివ్విషమున, సత్యమిట్లనిన
నమ్మవే, వలపలి నాతొడ యెక్కి
నెమ్మిఁ జూచుచునుండు నీలకంఠంబు''
నని యూరుపీఠంబునందు ధరించె.
మును గుఱియున్నదే ముగ్ధత్వమునకు?
నదిగాక గుత్తుక హాలాహలంబు
కదలినంతటనె చచ్చెదఁగాక! యనుచుఁ
దన కరవాలు ఱొమ్మున దూసి మోపి
కొని, కుత్తుకయ చూచుచును ఱెప్పలిడక
పశుపతితొడమీఁదఁ బాయక రుద్ర
పశుపతి నేఁడును బాయకున్నాఁడు.

(బసవపురాణమునుండి)



పాంచాలీ భీమసేనులు

తిక్కన సోమయాజి

"నన్నుఁబరాభవించి సదనంబునకున్ జని కీచకుండు ము
న్నున్న తెఱంగు దప్పక సుఖోచితశయ్యను నిద్రసేయ నీ
కన్ను మొగుడ్చు నూఱటకుఁ గారణమెయ్యది భీమసేన! మీ
యన్న పరాక్రమంబు వల దన్ననొకో దయమాలితక్కటా."

అనుచు మందసంభాషణంబుల సంబోధించు పాంచాలిపాణి స్పర్శనంబున మేలుకని, 'యిదియెవ్వ' రనవుడు 'నే'నను నమ్మానిని యెలుంగెఱింగి భీమసేనుండు, యాజ్ఞసేని కీచకుదురాచరణంబు నాకుం బ్రకటించి వాని నిర్జింప నియోగించునదియై యరుగుదెంచెం గావలయు, నత్తెఱం గిత్తెఱవ తాన చెప్ప విందునని తలంచి.

"ఇంతప్రొద్దల యిచ్చోటి కేగుదేరఁ
గారణంబేమి యెవ్వరు గానకుండు
నట్లుగాఁ జనుదెంచితె యంబుజాక్షి!"
యనిన నయ్యింతి యిట్లను నతనితోడ.

"ఎఱిగి యెఱింగి నన్నడుగ నేమిటి? కప్పుడఱింగి యింతకు
న్మఱచుటగల్గెనే నది వినంబనిలే, దటుగాక యున్నరూ
పెఱిఁగియు నేన చెప్ప విన నిష్టముగల్గుట చాలలెస్స, య
త్తెఱఁ గెఱిఁగించెదన్ వినుము తెల్లముగా మొదలింటినుండియున్.
అధిపుమఱంది సింహబలుఁ డప్పకు మ్రొక్కఁగవచ్చి, నన్ను న
త్యధికమనోజరాగమతియై కనుగొంచుఁ గడంగి యెన్నియున్

విధములఁ బల్కి, నాకుఁ దన విన్నను వొప్పగఁ జూపి, చేరి, మా
నధనవిహీనతం జెనకినం గడు నేవమువుట్టి యయ్యెడన్.

విడియంబలుకఁగ, వెండియు
నుడుగక కీచకుఁడు మన్మథోన్మాదము ద
న్నడరిన నన్నడుగుటకుం
దొడరినఁ గోపించి వానితో నిట్లంటిన్.

'దుర్వారోద్యమబాహువిక్రమరసాస్తోకప్రతాపస్ఫుర
ద్గర్వాంధప్రతివీరనిర్మథనవిద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసం గిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా.'

అనిన విని వాఁడు గొన్ని ప్రల్లదంబులు వలికిన, నేనునుం దత్కాలోచితవచనంబులం ద్రోచిపుచ్చినం బోయెఁ; బదంపడి పాపాత్మయైన సుదేష్ణ దనకు మదిరారసంబు దేరం గీచకనివాసంబునకు నన్నుం బనిచినం, బోవుట కొడంబడక, యెన్ని సెప్పిన నన్నింటికి నన్ని సెప్పి, నిర్బంధించినం బెద్దపెనంగ నొల్లక, నామనంబున నన్నెవరికి నేమి సేయవచ్చునని మీలావు నచ్చి, సూతునింటికి సురకుం బోయిన.

కొన్ని వెడమాట లాడుచు
నన్ను నతఁడు సెట్టవట్టినం ద్రోచి, వెసం
జన్న, వెనుకొనుటయును మీ
యున్నెడ కే నపుడు సంభ్రయోపేతగతిన్.

పాఱుతెంచిన, నక్కులపాంసనుండు
గోపమడరంగ వెనుకన కూడముట్టె;

నట యెఱుంగుదు నీవు, మీయన్న పెద్ద
తనముఁ జూచితి, నేమందు ననిలతనయ !

మీసుభటత్వమున్, బలము మిన్నకపోవఁగ దుస్ససేనుఁ డ
ట్లాసభలో ననుంబఱిచె, నంతియ కాక జయద్రథుండు సం
త్రాసభరంబు లే కనుచితంబొనరించినఁ జెల్లిపోయె, నేఁ
డీసభికుల్ గనుంగొనఁగ నిట్లయితిన్ వగ నాకు వింతయే ?

అకట ఆఁడుకూయు, నాలకూయును లాఁతి
వారికైన నరయవలయు ననిన,
నన్నుఁ గీచకుండు దన్నంగ నెట్టులు
సూడనేర్చె ధర్మసూనుఁ డపుడు ?''

అనిన విని యతం డిట్లనియె,

''కీచకుఁ డట్లు మీఁదు పరికింపక నిన్నుఁ బరాభవింపఁగాఁ
జూచి, మహోగ్రకోపవివశుండగునన్నును జూచి, ధైర్యహే
మాచలుఁడైన ధర్మసుతుఁ డమ్మెయి వారణ సేయకున్న నే
నీచత వాని, మత్స్యవిభునిం, బరివారము నుగ్గుసేసినన్,

ఆ సంరంభంబున సమయభంగంబుగా, జనంబులు మనల నెఱింగిరేని.

ముందటిభంగిన కానల
యందు వసింపంగవలదె ? యది నీవును నే
నుం దెచ్చినయాపదకా
నిందింపరె యెల్లవారు నీరజవదనా ?

కావున సత్యవ్రతనిష్ఠుండగు యుధిష్ఠిరుండు పొగడ్తకుం దగువాఁడు గాని దూఱువడ నర్హుండుగాఁ" డని వెండియు నిట్లనియె,

"పరిభవకరుఁడగు కీచకుఁ
బరిమార్చుట కిపుడు గడవఁబడియెనె ? యిమ్మె
దురపిల్ల నేల వ్రేల్మిడిఁ
బొరిగొని నీమనము కలఁకవుత్తు లతాంగీ,

మనల నెవ్వరు నెఱుఁగకుండునట్టి తెఱంగు దలపోయవలయుఁగాక, పగతుని భంజించుట యెంతటిపని" యనిన విని యమ్మానిని యిట్లనియె,

"గొంతికి నంత వెఱవ, మీ
కంత వెఱవ, దైవమునకు నంత వెఱవ, న
త్యంత కలుషాత్మ విరటుని
కాంతకు నే వెఱతుఁ బనులుగావించునెడన్,

కినుకకుఁ జాల కెంతయును గీడ్పడి, నాపడుపాటులెల్ల వ
మ్మునఁ గలయంగ నిట్టు లొకమూర్ఖునిచేఁ దుదివోయి కోలుపో
యిన, నభిమానముం దగవునేడ్తెఱ డెందముగొందలంబు బొం
దిన, ధృతిమాలి యేఁ బలికితిం దగవెల్ల నెఱింగియుండియున్.

ఇట్టిద కాని సమస్తజనస్తవనీయుండగు పాండవాగ్రజు నిక్కంబ నిందించిన దానం గా'' నని పలికి, మఱియును.

"ధర్మతనూభవుసంతత
ధర్మనిరత మనము బ్రదుకఁదలఁచుట యరుదే ?
నిర్మలుఁడగునాతని స
ద్ధర్మంబునఁగాదె బ్రదుకు ధాత్రికినెల్లన్ ?

చనునె వేఱొకని కజాతశత్రుండను
  పేర దిగ్విజయంబు పెంపుఁ దాల్ప
రాజసూయమహాధ్వరము గోరిచేయంగఁ
  దీరునే పెఱధరిత్రీపతులకు
ధర్మైకనిరతుఁ డాతం డొక్కరుఁడ చూవె
  యనఁ జన నొరులకు నలవియగునె
నిత్యవ్రతంబుగా సత్యంబుపాలింప
  వచ్చునె యొరుల కెవ్వరికినైన

నయ్యుధిష్ఠిరుగాంభీర్య, మతనిధైర్య
మరయ నొండెడఁ గలుగునె? యతఁడు కీర్తి
ధరుఁడుఁ గరుణోత్తరుఁడు మహీసురసమృద్ధి
కరుఁడు నిజవంశకరుఁ డుపకారపరుఁడు.

ఎవ్వనివాకిట నిభమదపంకంబు
  రాజభూషణరజోరజి నడఁగు
నెవ్వనిచారిత్ర మెల్ల లోకములకు
  నొజ్జయై వినయంబునొఱపుఁ గఱపు
నెవ్వనికడకంట నివ్వటిల్లెడుచూడ్కి
  మానితసంపద లీనుచుండు
నెవ్వనిగుణలత లేడువారాసుల
  కడపటికొండపైఁ గలయఁబ్రాఁకు

నతఁడు భూరిప్రతాపమహాప్రదీప
దూరవిఘటితగర్వాంధకారవైరి
వీరకోటీరమణిఘృణివేష్టితాంఘ్రి
తలుఁడు గేవలమర్త్యుఁడె ధర్మసుతుఁడు!

అట్టిమహాత్ముఁ డొక్కనికి నాశ్రితుఁడై వెడగూడుఁ జీరయుం
బెట్టఁగ నిల్చి, వానిమదిప్రీతికి నీడగువృత్తిఁబేరునుం
బుట్టునుమాలి, యిప్పుడిటు బ్రుంగుడుపాటునఁ బొందఁజూచి, నా
కెట్టు మనంబు పట్టు, ధృతియెమ్మెయిఁ దూలకనిల్చుఁ జెప్పుమా ?

నీవలమూఁపులావు మును నేలవహించిన నాగకూర్మగో
త్రావనిభృద్దిశాకరుల కారయ నూఁతపట్టుగాదె ? సం
భావన భూజనంబులకుఁ బండువుగాదె ? మహోగ్రకోపరే
ఖావిభవంబు వైరులకుఁ గాలముచేరువగాదె పావనీ !

బకహిడింబకిమ్మీరులబాహుబలము
నాజరాసంధునుగ్రదర్పాతిశయము
లోకభీకరములు విజయాకరములు
నైన నీకరములకు లోనయ్యెఁగాదె,

తొడరినహరునైన దోర్బలంబునఁ దన్ను
మిగులంగనీఁ డనుమేటిమాట
యమరేంద్రునర్ధాసనమునకునైన న
ర్హుండెంతయును నను రూఢిమాట
జమునిల్లుసొచ్చిన జంతువునైనను
గాచు నెమ్మెయి నను రాచమాట
దనుగోరి యూర్వశి దాన వచ్చిననైన
లోలుండుగాఁ డను మేలిమాట

శౌర్యవైభవప్రాభవశౌచములకు
నారులకైనఁ గైవారమై యుల్లసిల్లు

నొక్కనికి నివియెల్లను నిక్కమట్టె !
యెందుఁ గలుగునె యర్జునునీడువాఁడు ?

అరయ నతండు మానధనుఁ డక్కట రంగమునందు నిల్చి, సుం
దరులకు నాటసూపెడువిధం బతిదీనము దానిఁజూచి, యేఁ
బురపురఁబొక్కుదుం, గడుపుఁ బ్రోచికొనన్ లఘువృత్తికిమ్మెయిం
జొరనగువాఁడె దేవపతిసూనుఁడు దైవముచేఁత సూచితే !

మగలకు మేటియైన బలమర్దననందనుఁ బేడిఁజేయఁగాఁ
దగునె విధాత ! నీకు నని దైవము దూఱుదు, నోర్వరానినె
వ్వగ దలకొన్న నెంతయును వందుదు, ని ద్దురవస్థయెన్నఁడో
తెగు టని సంతతంబును మదిం దలపోయుదు నేమిసేయుదున్ ?

తనయొప్పిదముగన్నఁ దగిలి యెవ్వరికైన
మలఁగి క్రమ్మఱఁ జూడవలయువాఁడు
దనవర్తనమువిన్న మునిజనంబులకైన
నలవరించికొనంగవలయువాఁడు,
దనబంటుతన మాజి గనినమార్తురకైనఁ
బలుమాఱు నగ్గింపవలయువాఁడు
దన వితరణకేళి వినినగల్పకతరు
వులకైనఁ దలయూపవలయువాఁడు
నకులుఁ డొరులకు నశ్వశిక్షకుఁడుగాఁగ
నగునె ! యాతని దుస్థితి యనుదినంబుఁ
గాంచి, కన్నీ రడంచుచుఁ గడపరాని
దైవఘటనకు నోర్తుఁజిత్తంబులోన,

ఆరూపం బవికార, మాభుజబలం బత్యంతనిర్గర్వ, మా
శూరత్వంబు దయారసానుగత, మాశుంభత్క్రియాజ్ఞావ మా
ర్యారంభప్రతికూలవాదరహితం, బాయిఁగి సమ్మాన వి
స్తారోదాత్తము మాద్రిపిన్నకొడు కేతన్మాత్రుఁడే చూడఁగన్.

సుకుమారుఁ డతఁడు గోపా
లకవృత్తివహించి యడవులం గ్రుమ్మరుచు
న్కికి నాక కాదు, పగవా
రికినైనను నకట మన మురియదే వగలన్.

ఏనును మీరు గానలకు నేగునెడన్ నను జేరి యెంతయున్
దీనతదోపఁ గుంతి సహదేవుని నిల్లడవెట్టె నాకు, 'న
మ్మా! నినునమ్మి, చాలవిషమంబగు నివ్వనవాస మీతఁడుం
బూనఁగ నియ్యకొంటి'నని బోరన నశ్రులుగ్రమ్మచుండఁగన్.

'కడుఁ బసిబిడ్డవీఁ డొకటి గా, దవునా నెఱుగండు, ముంద రె
య్యెడ నొకపాలెఱుంగఁ, డెద యెంతయుఁగోమల, మెప్పుడైననే
గుడువఁగఁ బిల్తుఁగాని తనకుంగల యాఁకటిప్రొ ద్దెఱుంగఁ, డీ
కొడుకిటు వోకకున్ మనము గుందెడు నిన్ గని యూఱడిల్లెడున్.'

అని యప్పగించె; నింక నాతెఱంగు వినుము:

''ద్రుపదభూవిభుఁడు పుత్రులకంటె నెంతయుఁ
బెంపుసేయుచు గారవింపఁ బెరిఁగి
కుంతీమహాదేవి కోడండ్రలోపల
నగ్గలంబుగఁ గొనియాడఁ బరఁగి
ప్రాణంబులకు నెల్లఁ బ్రాణంబుగా మీరు

నెయ్యంబుతియ్యంబు నెఱప నడచి
మదిఁ దల్లి దండ్రుల మాఱుగాఁగొని జను
లనిశంబు భక్తిసేయంగ నెగడి

రూపగుణవిక్రమంబుల రూఢికెక్కు
నట్టికొడుకులఁ గని, భరతాన్వయంబు
నందు నాయిల్లు యిల్లుగా నతిశయిల్లి
తగవుమై బాంధవులచేతఁ బొగడువడసి,

వినుతింపందగు రాజసూయమునఁ బృథ్వీదేవతాకోటికె
ల్లను సంతృప్తియొనర్చి, వారిదయఁ గల్యాణాత్మనై, పుణ్యవ
ర్తన పాండుక్షితిపాలుకోడ లనఁగా రాజన్యమాన్యప్రియాం
గనలం దెల్లఁ బొగడ్తగంటి నతిలోకంబైన మీమన్ననన్.

ఏను మనంబు పెంపుసెడి, యిప్పుడు నీచతరప్రచారముం
బూని నికృష్టనై యుదరపోషణకై తగవేది, యెంతయున్
దీనతబొంది, యిమ్మెయి సుదేష్ణపనుల్ గనుసన్నఁ జేయుచున్
హీనతనున్కి మీకు వగ పేమియుఁ జేయద, యేమి సేయుదున్,

పనివంపఁగాని, యొకతకుఁ
బనిసేయ నెఱుంగ, నన్ను బనిగొనునెడఁ బాం
డునియగ్రమహిషి గొంకుచుఁ
బనిగఱపెడుచందమునన పనుచు టెఱుఁగవే.

ఒల్లరు రాజు, దేవులును నొడ్డులురాచిన చందనంబు, మే
నెల్లఁ జెమర్పఁగా నకట యేను శ్రమంపడి నిల్చినిల్చి, య
ల్లల్లన మార్దవం బొనరునట్లుగా నెట్టకునేని రాచి, మీ
తల్లికి భక్తివెట్టెడి విధంబునఁ బెట్టుదు బ్రహ్మ దిట్టుదున్.

నున్నదనంబుగా నలుఁగు నూఱియుఁ జందన మట్లు రాచియుం
బన్నుగఁ గ్రొత్తలైన కలపంబులు గూర్చియు నాసుదేష్ణకుం
గన్నులసన్నలం బనులు గైకొని, వారకచేయుచుండుటన్
ము న్నటులున్న పాణితలముల్ బలుగాయలుగాచెఁ జూచితే.''

అనుచుం దొరఁగెడునశ్రుల
మునిఁగినమో మతనివక్షమునఁ జేర్చిన, న
వ్వనితయవస్థయ తాల్పుచు
ననిలసుతుం డడలె దేహ మలమటబొందన్.

అట్టియెడఁ దన్ను దాన యూరార్చికొనుచు
నంబుజానన నెమ్మొగ మల్లఁ దుడిచి
యనునయించి, తత్కరములు దనమొగంబు
గదియఁ జేర్చుచు నిట్టూర్పుగాడ్పు నిగుడ.

చింతాక్రాంతుండైన కౌంతేయున కయ్యింతి యిట్లనియె:

''ఇందఱును నిన్నిభంగుల నిడుమగుడువ
వలసె ధర్మతనూభవువ లనఁజేసి
దాయ లొడ్డిన మాయజూదంపుటురులఁ
బడి కులంబున కాతఁ డిప్పాటు దెచ్చె.

అక్కట మోసపోయి యడియాసలఁ జావకయున్నదాన, ము
న్నొక్కెడనే దురంతదురితోత్కటబాధలఁ బెట్టియున్న నా
కెక్కడి దుఃఖశాంతి గర మేదుట యెమ్మెయిఁ గల్గనేర్చు? మీ
ముక్కన నూర్పుగల్గ నొక మూర్ఖునిచేఁ బడితిన్ సభాస్థలిన్.

మీ రేమిసేయుదురు, దై
వారంభముగాక శుభము నశుభంబును సం

సారులఁ దనతనతటి నని
వారణఁ బొందంగ మాన్పవచ్చునె దానిన్ ?

కావున మీర లభ్యుదయగౌరవ మొందుట యాత్మఁగోరి యే
నేవిధినైన నాపదల కెల్లను నోర్చెద దాని కేమి, యీ
కావలుఁడైన కీచకుఁడు గామనిపీడితుఁడై యలంతులం
బోవక వేచి, పట్టుకొనఁబోయిన దూఱెదఁగాక యిమ్మెయిన్.


వానిఁ దెగఁజూడవైతేని వాయుపుత్ర !
నీవు గనుగొన నురినైన నీరనైన
నగ్నినైన విషంబుననైన నేను
మేను దొఱఁగుదు నెట్టు నీయానసుమ్ము."
అనిన వృకోదరుండు చిఱునవ్వు నవ్వుచు నిట్లనియె:

"జలజదళాక్షి ! కీచకుని జంపుట కిమ్మెయి ముట్టఁబల్కఁగా
వలయునె ? యేను జూడ ననివారణ నిన్ను బరాభవించె వాఁ;
డిల మగలింక నాంధ్రకును నెవ్వరు ? భంగము నీఁగఁజాలువా
రళఘుమదీయ బాహుబల మప్పుడు సూవనితప్పు సాలదే.

ఎల్లి యెల్లవిధంబుల నెందుఁ జొచ్చె
నేని, నాధర్మతనయుండు దాన వచ్చి
యడ్డపడెనేని, నీవ పెంపారుకరుణ
గాచితేని నాచేఁ బడుఁ గీచకుండు.

వానిదెసం జింతవలవ, దమ్మాటలు విడువు" మని యూఱడిల్లం బలికె.

(భారతము – విరాటపర్వమునుండి)



శైశవము

ఎఱ్ఱా ప్రగడ

నోరంజేతులు రెండు గ్రుక్కికొనుచు, నోమెల్ల బాష్పాంజన
స్మేరంబై తిలకింపనేడ్చుచుఁ, బొరిన్ మీఁజేతులం గన్నులిం
పారం దోముచు, లేవఁజూచి పిఱుఁదొయ్య నేమ్రఁది కల్లార్చుచున్
శ్రీరమ్యాంఘ్రియుగంబు గింజుకొనుచుం జెల్వంబు రెట్టింపఁగన్

హొలుపారఁగా బోరగిలి పాన్పు నాల్గుమూ
    లలకును వచ్చుచు మెలఁగి మెలఁగి
లలిఁ గపోలంబులు గిలిగిలింతలు వుచ్చి
    నవ్వింపఁ గలకల నవ్వినవ్వి
ముద్దులు దొలకాడ మ్రోఁకాలఁ గేలను
    దడవుచు నెందును దారితారి
నిలుచుండఁబెట్టి యంగుళు లూఁత సూపఁగాఁ
    బ్రీతి దప్పడుగులు వెట్టిపెట్టి

అన్నఁగంటి దండ్రినిఁ గంటి నయ్యఁ గంటి,
నిందు రావయ్య ! విందుల విందవనుచు
నర్థిఁ దను బిలువఁగ నడయాడి యాడి
ఉల్లసిల్లె గృష్ణుఁడు శైశవోత్సవముల.

ఎవ్వరుగన్న నెత్తికొని యెంతయు వేడుక ముద్దులాడఁగా
నెవ్వలఁ బాటిపాటి, తరళేక్షణ దీధితులొప్ప నొప్పమై

మువ్వలు గంటలు న్మ్రోరయ, ముందటి కూఁకటిరావిరేకతో
నవ్వనజాక్షుఁ డాడుచెలు వర్మిలిఁ బెంచు జనంబుచూడ్కికిన్.

మన్ను రొంపియుఁ, బెండయు, మసటువట్టి
పాంసుసంక్రీడఁ దనమేను భాసురముగ
హరి యనేకధాతుచ్ఛటావ్యక్తమైన
శైలకుంజరకలభంబువోలె నొప్పె.

"ఏలా యిందును నందుబాఱెదవు ? నీకే బ్రాఁతియే వెన్నలుం
బాలుం బాలక ! చాలఁ జేఁపె నిదె నాపాలిండ్లు పెన్సోనతై
పా లొక్కుమ్మడిఁ గ్రమ్మచున్నయవి నీభావంబునం దృప్తిగాఁ
గ్రోలంజాలవె యింతవట్టకట యీగోసేల చుట్టాలలోన్ ?"

అని యెత్తుకొని, యురంబునఁ
దనియఁగ నదిమికొని, చన్ను తన్ముఖమునకున్
ఘనదుగ్ధపిచ్ఛిలంబుగ
మన మలరఁగ నిచ్చుటయుఁ గుమారుఁడు ప్రీతిన్.

స్తనదుగ్ధామృత మారగించుచుఁ బొరిం జారుస్మితోల్లాస మా
ననబింబంబు నలంకరింప విలసన్నాళీకపత్రాభలో
చనదీప్తుల్ జననీముఖేందువుపయిన్ సంప్రీతిఁ బర్వంగ నొ
ప్పు నిజాభీప్సితకల్పశాఖి గనియెం బుత్రుం బవిత్రోదయున్.

బృందావనమునకు వలసపోవుట

పెద్దకాలంబు నొక్కచో నునికి ప్రశస్తంబుకాదు;

ఎరువు తిప్పలుగొని యెల్లమందలు గొను
    జెక్కి మేపుడుచోటు ద్రొక్కువడియెఁ

దరు లోలి నఱుక మొదళులు సిక్కంగ జొం
పములేది జాడలువడియెఁ బొదలు
మధువులు పసులకాల్మడిఁ బ్రుచ్చెఁ, దొరుగండి
స్రవంతలు పెనురొంపి స్రవంతలయ్యెఁ
బూరిపంటలు చెడిపోయె రాయిడిఁ గ్రంప
లోనుగా దవ్వులఁగాని లేదు
పులుఁగు పూ రెడు పోపడి పొలములందు
మెలఁగి వెదకినఁ బుట్టదు, మెకము లడఁగెఁ,
గూరగాయ కట్టియ విల్చికొనఁగ వలసి
యునికి వ్రేపల్లె వీటిపట్టునకుఁ దొఱఁగె.

కావున నిచ్చో వసియింప దుఃఖావహంబు, బృందావనంబు బృందారకవనసుందరంబైన కాననం, బయ్యరణ్యంబునడుమ నమర నదియునుంబోలె గాళింది యొప్పారు, అవధూతసారంబైన యిక్కాంతారంబు విడిచిపోయి, యన్నెలవున సుఖింతము. మన పల్లెలోని ముదుసళ్ళు మచ్చిగ పేర్మి నిచ్చోటు విడువంజాలకున్నవారు ... మన మీ ప్రొద్ద కదలవలయు ... వల్లవముఖ్యపనుపున సర్వజనంబులు పయనంబు సమకట్టుటయు వ్రేపల్లె నెల్లకడల—

"బండ్ల మెట్టింపుపై బరువులెక్కింపుమీ
దళ్ళను బూన్చి కావళ్ళనునుపు
పదిలంబుగా నేఁతిపనఁటులు, క్రొత్తగో
నియల బియ్యము వడ్లు నెమిలి వడ్లు
నొడివిరి ప్రాలును నొనరంగఁ బోసి, చా
పలు మంచములుమీఁద బలియఁగట్టు

దామెనలును, వల్లెత్రాళ్ళును దలుగులు
కవ్వము ల్గొడవలి కత్తి సూడు

గొడుపు వాఁదోళ్ళు మొదలుగాఁ జెడకయుండ
వలయు ముట్లెల్లఁదెమ్ము, కంటలపు పెడ్ల
నాయితము సేయు, ముదుసళ్ళ నాడువారి
గంపమోపులు ముందరఁ గదలు మనుము.''

అని పెక్కుభంగుల యెలుంగుల గోలాహలం బెసఁగ, మంద యంతయు నొక్కపెట్టఁగదలి, లావుమానుసులు కదుపులంగొని ముందరంబోవ, పిఱుంద బండ్లును, బండ్లజాడల దక్కిన ప్రజయు నడువం, దరుణతరుణీజనంబు లొండొరులతోడి మేలంపు టాలాపంబుల వినోదంబులఁ గడచిచనం, బంగ్వంధజరఠప్రముఖులు గ్రుస్సి యోలాకుపడం గావలియై తగువారు నడపింప బృందావనంబు బ్రవేశించి,

ఒక యామడ పఱపిదియని
సకలజనము చూడ నర్ధచంద్రాకృతియై
శకటావళి విడియఁగఁ గడు
వికటస్థితి నెల్లవారు విడిసిరి గలయన్

గుడిసెలు వన్నియున్ ఘననికుంజము లిండులుగాఁగ సొచ్చియున్
బెడఁగగు జొంపముల్గలిగి పేర్చిన మ్రాఁకులక్రింద నుండియుం,
గడక యెలర్చ దొడ్లకును గ్రంపలవైచియు నొక్కనాఁటిలో
నడరఁగఁ బ్రాఁతకాపులయి రక్కడ గోపకుటుంబు లందఱున్

శృంగారంబులు సేసి గోపికలు భాసిల్లంగ, గోపాలు రు
త్తుంగాంగంబులతోడ నెల్లకడలం ద్రుళ్ళంగ, గోబృందముల్
మాంగల్యాకృతిఁ గ్రాల, నెంతయును సామగ్ర్యంబునన్ బంధు లు
ప్పొంగం బల్లె సముజ్జ్వలోత్సవములం బొంగారె నానాఁటికిన్.

(హరివంశమునుండి)

వింధ్యగర్వభంగము

శ్రీనాథుఁడు

రేవాతరంగశీకర
సేవాహేవాకపాకశిశిరమరుత్ప్ర
స్తావపరికంప్యమానజ
టావలియగు చతఁడు వింధ్యమల్లనఁజేరెన్.

తాపసకులాగ్రగణ్యు
శ్రీపాదాంభోజయుగళచిహ్నశ్రేణీ
స్థైపద్యపరమపుణ్యశి
లాపట్టంబగుచు నయ్యిలాధర మొప్పెన్.

కర్పూరకదళికాకాంతారపవనంబు
లధ్వనీనులశ్రాంతి నపనయింప
మదురంగఁబండిన మాలూరఫలములు
చెంచుకన్యలకుచశ్రీలఁ జెనయ
నురగవల్లీగాఢపరిరంభణంబులఁ
బోఁకమ్రాఁకుల కెంపు పొదలుకొనఁగఁ
బాటలీవకుళచంపకసౌరభముతోడ
విచికిలామోదంబు వియ్యమంద

గమియ నామూలచూడంబుగా ఫలించి
యంబరముమోచియున్న యుదుంబరములు

లీల బ్రహ్మాండభాండమాలికల భూష
లవధరించిన వృషభాంకు ననుకరించె..................

నలినప్రోద్భవసూతి కన్గొనియె వింధ్యక్షోణిభృత్కందరా
బలవద్గండశిలాభిఘాతవిలుఠత్పాథ స్తరంగచ్ఛటా
స్ఖలనారంభవిజృంభమాణపటుఝుంకారస్ఫుటాంతర్మదన్
గలనాతత్పరభక్తలోకపరిరక్షాశర్మదన్ నర్మదన్.

దివిజముని నర్మదానదిఁ దీర్థమాడి
విమలభస్మంబు నిఖిలాంగకముల నలఁది
యమిత రుద్రాక్షమాల్యంబు లనువుపఱచి
భవుని నోంకారనాథుని బ్రస్తుతించె.

స్థావరంబైన రూపంబు జలదవీధి
నావరించుచు మొదల నున్నట్లయుండ
జంగమంబైన రూపంబు నవదరించి
యెదురుగా వచ్చె వింధ్యమహీధరంబు.

అతిథి కడునల్పుఁడైన, నత్యధికుఁడైన
నింటి కేతేరఁ బ్రియమందు నెవ్వఁడేని
వాని గౌరవ మది గౌరవంబుకాని
కాదు గౌరవ మాకారగౌరవంబు.

మొగులు ముట్టిన మహామూర్ధంబు ధరమోవఁ
బాదాంబుజములకుఁ బ్రణతిజేసి
అంతరంగముకంటె నత్యున్నతంబైన
పృథుహేమపీఠంబు వెట్టఁబంచి

దధ్యాజ్య మధుపుష్పదర్భాదికములైన
యష్టాంగములతోడి యర్ఘ్యమిచ్చి
యాత్రాసముత్థితాయాసఖేదము వాయ
నంఘ్రిసంవాహనం బాచరించి

శ్రాంతిదీఱుట యెఱిఁగి, హస్తములు మొగిచి
వినయవినమితగాత్రుఁడై వింధ్యశిఖరి
తన గుహారంధ్రములు ప్రతిధ్వనుల నీన
వేల్పుదపసికి నిట్లని విన్నవించె:

"మహానుభావా! భవదీయ కటాక్షవీక్షారసప్రసారంబున... ప్రాగ్జన్మకృత పుణ్యంబులు ఫలించె. విశ్వంభరాభరణ దీక్షా ధురంధరంబులగు నాకులంబువారిలో మాన్యుండనైతి, ధన్యుండ; నొక్క విన్నపం బవధరింపుము. నీకు సేవాంజలీపుటంబు. నీ చూడని మహీధరంబులు లేవు. కొండలు లెక్కకుఁ బెక్కు కలుగుం గాకేమి, దిక్కుంజరంబులకు దిక్కై, కూర్మంబున కర్మిలియై, క్రీడాక్రోడంబునకుఁ దోడై, పాపఱేనికిం బ్రాపై యేనుబోలె నీ సర్వంసహాచక్రంబు భరింపఁగలయదియే? ఇప్పాట నాతోడం బ్రతిఘటింపఁగలది సురగరుడాశ్రయంబును, విబుధవేదండశుండాదండ చుళుకితోద్గీర్ణ స్వర్ణదీకాండ గండూషితబ్రహ్మాండగోళంబగు సుమేరుశైలంబ; మా యిద్దఱ తారతమ్యం బెఱుంగుదు. నాకు నగ్గిరికి నిప్పు డీరసంబు వెరుగం గఱకఱి నెట్టుకొని సాగుచున్న, దింక నెట్టుండు భట్టారాకా! పక్షపాతంబుడిగి యానతిమ్ము."

అని యవష్టంభసంరంభ మతిశయిల్లఁ
బలుకుటయు నాత్మ గర్హించి నలువపట్టి

యొం డనాక, యొక్కింత సే పూరకుండి
యుస్సురనుచును వేడి నిట్టూర్పుపుచ్చె.

పదంపడి ఆ కలహప్రియుండు త్రిభువనోపద్రవకారణంబైన మహీధరసంఘర్షణమునకు సమ్మతించి యిట్లనియె:

"నాతో నీ విపు డెట్టులాడితి ప్రధానత్వం బపేక్షించి ప్ర
స్ఫీతాటోపమహాప్రతాపగుణగంభీరార్థయుక్తంబుగా
నాతో నిట్లని యాడె మేరువు ప్రధానత్వం బపేక్షించి ప్ర
స్ఫీతాటోపమహాప్రతాపగుణగంభీరార్థయుక్తంబుగాన్.

నీ వెఱుంగుదు నీలావు నిక్కువముగ
నెఱుఁగుఁ దనలావు తా నమ్మహీధరంబు
తప్పకుండ మీయిద్దఱతారతమ్య
మెంతవారును దెలియంగ నెంతవారు!

శ్రీశైలవేంకటాహోబిలాదిపర్వతంబులు మహానుభావంబున మీ యిద్దఱకంటె నధికంబులు. మీ గర్వాలాపంబు లేర్వవచ్చునే? మాబోఁటి తీర్థయాత్రాపారీణుల కిది యేటి చింత? మీకు మే లయ్యెడు పోయివచ్చెద"నని నారదుం డరుగుటయు,

విబుధ మునిమాట చెవికిఁ గ్రొవ్వేడిం పగు, డ
వంధ్యగర్వోదయుండైన వింధ్యశిఖరి
చాల నుద్వేగమంది విచారపరత
నాత్మగతమునఁ దాను నిట్లనుచునుండె,

శాస్త్ర మాచార్యసన్నిధి జదువఁదేని
ఇద్ధబోధంబు మది సంగ్రహింపఁదేని

దెగువమీఱి ప్రతిజ్ఞ సాధింపఁడేని
జ్ఞాతిజగా మందఁడేని తజ్జనుఁడు జనుఁడె?

కంటికి నిద్రవచ్చునె? సుఖంబగునే రతికేళి? జిహ్వకున్
వంటక మిందునే? యితరవైభవముల్ పదివేలు మానసం
బంటునె? మానుషంబుగలయట్టి మనుష్యన కెన్నఁడేనియున్
గంటకుఁడైన శాత్రవుఁడొకండు తనంతటివాఁడు కల్గినన్.

ఎవ్వనితో నెచ్చోటం
జివ్వకుఁ జేసాచవలదు, చే సాచినచో
నివ్వల నవ్వల నెవ్వరు
నవ్వక యుండంగఁ బగ సనన్ దీర్పఁదగున్.

ఉప్పరమెగసి యజాండము
చిప్పలురాలంగ మేరుశిఖరమ్ములపై
గుప్పించి దాఁటుకొందునొ
తప్పక నామనసులోని తహతహ దీఱన్.

ఒక్కఁడు మాకొలంబున సముద్ధతి జూపిన జాతరోషుఁడై
ఱెక్కలుద్రెంచి వేలుపులతేఁ డటు పాపముచేసెఁగాక, యా
ఱెక్కలు నేఁడుగల్గిన నెఱింగి జవంబునఁ బాఱుతెంచి బి
ట్టెక్కనె కూటకోటితటులెల్లను నుగ్గులుగాఁగ మేరువున్.

అడుసులోపలఁ దాటిపం దదిమినట్టు
లదుముదునెగాక పాతాళమంటికొనఁగ
వేల్పులెల్లను విభ్రాంతి విహ్వలింపఁ
బాదములు మెట్టి నాదాయ బసిడికొండ.

ఈయైశ్వర్యము జూడఁజాలుదునె నేనిప్పాట నానాఁటికిన్
రే యిందుగ్రహతారకంబులు, పగల్ నీ రేరుహాప్తుండు సే
వాయోగంబుమెయిం బ్రదక్షిణముగా వర్తిల్లఁగా నిర్భరా
సూయామానపరీతచేతసుఁడనై శూన్యోద్యమప్రక్రియన్.

అడ్డపెట్టెదఁగాక తీవ్రాంశురథము
ప్రహరి దిరుగకయుండఁగ భర్మగిరికిఁ
దరతరమ్మీ యజాండకర్పరముదాఁక
ఘనశిరశ్శృంగశృంగాటకములు పెంచి.

అవరోధించెను వింధ్యభూధరము ప్రధ్యాధ్వంబు దర్వోద్ధుర
వ్యవసాయోద్భటరౌద్రభంగి నురులింగాకారుఁడై యీశ్వరుం
డవరోధించిన గర్వరేఖ, బలిదైత్యధ్వంసినారాయణుం
డవరోధించినఠేవ మూర్ధమొగి నూర్ధ్వాండంబుతో రాయఁగన్

విస్ఫురద్ధ్వాంతౌఘవిధ్వంసనక్రియా
పరమదీక్షారంభగురుమయూఖ
దశశతపరిషదాధారమండలుఁడైన
చండభానుని కధిష్ఠానమగుట
భారంబు భరియింప బరువు షడ్డదివోలె
మూఁపుమూఁపుననుండి మొక్కలమున
ననిలంబు లేడును నంచెలంచెలు గట్టి
యాకాశవీథి నందంద నడవ

నడచు రవితేరు మింటినెన్నడిమిచక్క
బ్రగ్గనఁగఁదాఁకె వింధ్యపర్వతము చఱులఁ

గతిననిర్ఘోషనిర్ఘాతఘట్టనమునఁ
బంకజాతభవాండకర్పరము వగుల.

తగులువడి యపుడు వడిసెడి
గగనమణి రథంబు దోరగలువడి నిలిచెన్
బొగరుమొగకడలి యక్కలి
దగిలి నిలువఁబడిన ఘనవితతియుంబోలెన్.

ఒక్కనిమేషము రాహువు
పుక్కిటిలోఁ దగులువడక పోయెడు భానుం
డిక్కొండప్రక్కఁ జిక్కం
బెక్కేఁడులు విధివశంబు పెంపెట్టిదియో!

పూచినకొరవిపూఁబొదరింటిచందానఁ
గత్తెర యొక్కచోఁ గదలకుండె
నొకచోఁ దగుల్పడె నుపకారికొఱటికిఁ
దరమైన రోహిణీతారకంబు
నొకచోఁ బునర్వసు వూఁగె వృక్షముకొమ్మ
సుడివడ్డ ముత్యాలసోఁగువోలె
శయనించె నొకచోట శ్రవణనక్షత్రంబు
గుంటిమీఁదటి ప్రత్తికొడుపువోలె

స్వాతిచిత్తలు తోరణస్తంభయుగము
ననుకరించుచు నొక్కచో నత్తమిల్లెఁ
జిఱుతవోయిన మూఁకుడిచెలువుదాల్చి
హత్తె నొకచో విశాఖ వింధ్యాద్రియందు.

4)

నేత్రంబు లున్మేషనిస్పృహత్వమునొంద
 శ్రుతిపుటంబులశక్తి చొక్కుమడఁగ
ఘ్రాణేంద్రియజ్ఞానకళ యారుసొరుగా
 జిహ్వ వివేకంబు చిఱుతవోవ
నంతరంగమున మోహాంధకారముగ్రమ్మఁ
 దనువు చేష్టాదరిద్రతవహింపఁ
బ్రాణముల్ శ్వాసమాత్రమునఁ బర్యవసింపఁ
 దలచీర యెఱుఁగని దశఘటిల్లఁ

బాముగఱచిన మూర్ఛిల్లిపడినయట్లు
పడిరి పాశ్చాత్యదేశంబుపంచ జనులు
తరణిదీధితిలేమిఁ జైతన్యమెడలి
వితతనిద్రాసమావేశవిహతులగుచు.

ఇవ్విధంబున నకాండప్రళయంబు సంభవింప మునులును దేవతలును బ్రహ్మనిర్దేశంబున కాశీనగరవాసియగు నగస్త్యమహామునిం బ్రార్థింప, నాతండు కాశీవిరహాసహిష్ణు వయ్యు లోకహితార్థం బియ్యకొని, ఆ నగరంబు వెడలి ప్రతిదినప్రయాణంబుల వింధ్యాచలంబు డాయం జనుదెంచి విషమదృషత్ఖండవిలసనస్థలంబును, జరత్తరుకోటరజఠరలుఠదజగరగళగుహానిష్ఠ్యూతనిష్ఠురపవన సంధుక్షమాణదవదహనశిఖాకలాపంబును, క్రీడచ్ఛిక్రోడశిశుచరణనఖ శిఖర విశీర్యమాణశిఖరశేఫాలికాకుసుమ కేసరరజః ప్రసరధూసర వాసర కరకరవ్రాతంబును, పరుషతరుపవనబిలపతితపచేళిమదధిఫల భక్షణ పుల్లగల్లభల్లూకప్రకరంబునగు గహనంబు జొచ్చి,

నలి వింధ్యాచలకాననాంతరమున న్వారాణసీత్యాగవి
హ్వలభావంబున నిల్చినిల్చి హర ! నీహారాంశుమూర్ధన్య ! ని

ర్మల! కాశీశ్వర ! నీలకంఠ! యనుచున్ బ్రామాఁగన్ను వాటిల్లఁ ద
త్కలశీసూనుఁడు మూర్ఛగై కొనుఁ గ్రమత్క్షామాక్షరోల్లాసియై.

అల్లనల్లన వచ్చు కుంభసంభవు దవుదవ్వులంగాంచి కాంచనశిర శ్శృంగశృంగాటకంబులం గమలభవాండకటాహంబు లుద్ఘాటించు తన మేనిపొడవు నేల సపాటంబుగా వంచి వింధ్యం బమ్మహామునుభావు నెదుర్కొనె. అపు డర్కునిరథంబు చక్కఁ జాయ నడచె. కాలంబు లేర్పడియె. ఆ జగతీధరంబు కొన్ని యజ్జలం బ్రత్యుద్గమించి,

ప్రణవపంచాక్షరోపనిషత్ప్రపంచంబుఁ
గడదాఁక నెఱిఁగిన కఱదలాని
వాతాపిదైత్యు నిల్వలునితోఁగూడంగ
జఠరాగ్ని వేల్చిన సవనకర్త
గోపించి నహుషుని కుంభీనసంబుగా
హుంకారమిచ్చిన యుగ్రతేజు
వానకాలమునాఁడు వండువట్టిన నీటి
కాలుష్య ముడిపెడు కతకఫలము

పాండుభసితత్రిపుండ్రాంకఫాలభాగు
భద్రరుద్రాక్షమాలికాభరితవక్షు
భార్యయును దాను నేతెంచు పరమశైవుఁ
గాంచె వింధ్యాచలేంద్రంబు కలశభవుని.

కాశీనగరవియోగ
క్లేశభవక్రోధవహ్నికీలల నాశా
కాశధరిత్రీవలయము
లాశుగతిం గాల్పఁగడఁగునట్టి మహోగ్రున్.

కాంచి, అతిథిసత్కారసంభావనావిశేషంబులఁ బరితోషంబు సంపాదించి, కరాంబురుహంబులు మోడ్చి "మహానుభావా! నీ యాజ్ఞాప్రసాద భావంబున నను గృతార్థుం జేయు" మనిన,

"వింధ్యాచలేంద్ర ! పృథ్వీభృత్కులశ్రేష్ఠ !
దక్షిణాపథము తీర్థంబులాడఁ
బోవుచున్నార మీపువ్వఁబోడియు నేను
బెద్దకాలమునాఁటి పెరువఁగాన
లావు చాలదు, జరాక్లైబ్యంబు కతమునఁ
బొడవెక్కినప్పుడు డిగెడునపుడు
అభ్రంకషములైన యానీశిరశ్శృంగ
శృంగాటకములిట్లు చిఱుతపఱచి
అనఘ ! నే గ్రమ్మఱఁగ వచ్చునంతదాఁక
నుండవలయు ధరిత్రిలో నొదిఁగి నీవు
చేయు నా యాజ్ఞ లెస్సయౌఁ, జేయకున్న
నెఱిఁగెదవుగాక రజ్జాడనేల యిపుడు"

అనిన వింధ్యంబు "మహాత్మా ! చరాచరంబైన జగంబునందు నీయాజ్ఞ జేయనివారునుంగలరె ? నీవు మరలి విచ్చేయునంత దాఁకను నిట్ల యుండెద" ననినఁ గుంభసంభవుం డతని దీవించి, నిజపాదాంభోరుహవిన్యాసంబుల విశ్వంభరాభాగంబు భాగ్యవంతంబు గావించుచు దక్షిణదిశాభిముఖుండై చనియె.

(కాశీఖండమునుండి)



గోపికాగీత
బమ్మెర పోతన

ఇట్లు హరి కనుమఱంగి చనినం గానక, కరిణ్బాసి తిరుగు కరే ణుల పెల్లున నుల్లంబు తల్లడిల్ల వల్లవకాంతలు తదీయగమనహాస లీలా విలాసవీక్షణవిహారవచనరచనానురాగంబులఁ జిత్తంబులు గోల్పడి ...కృష్ణగుణావేశంబులఁ జరియించుచు,

భూతములలోన వెలి బ్ర
ఖ్యాతుండగు నట్టివానిఁ గాంతలు కాళిం
దీతీరవనాంతరముల
భ్రాంతి న్వెదకంగఁ జనిరి పాడుచ నధిపా !

"నల్లనివాఁడు, పద్మనయనంబులవాఁడు, కృపారసంబు పైఁ
జల్లెడివాఁడు, మౌళిపరిసర్పితపింఛమువాఁడు, నవ్వు రా
జిల్లెడు మోమువాఁ డొకఁడు చెల్వల మానధనంబుఁదెచ్చె నో
మల్లియలార ! మీపొదలమాటున లేఁడుగదమ్మ చెప్పరే !

అంగజునైనఁ జూడ హృదయంగముఁడై గరగించువాఁడు శ్రీ
రంగదురంబువాఁడు, మధురంబగు వేణురవంబువాఁడు మ
మ్మంగజు పువ్వుదూపులకు నగ్గముసేసి లవంగలుంగనా
రంగములార ! మీకడకు రాఁడుగదా, కృపనున్నఁ జూపరే."

ఇట్లు తరులతాదుల నడుగుచు విపినమార్గంబుల హలకులిశ కల శాంకుశాది శుభలక్షణలక్షితంబులయిన హరిచరణంబుల చొప్పు గని...తమలో నిట్లనిరి:

''కొమ్మకుఁ బువ్వులుకోసినాఁ డిక్కడ
మొనసి పాదాగ్రంబు మోపినాఁడు
సతి నెత్తికొని వేడక్క జరగినాఁ డిక్కడఁ
దృణములోఁ దోపదు తెలవజాడ
ప్రియకు ధమ్మిల్లంబు వెట్టినా డిక్కడఁ
గూర్చున్నచోటిదె కొమరుమిగులు
నింతికిఁ గెమ్మోవి యిచ్చినాఁ డిక్కడ
వెలఁది నిక్కిన గతి విశదమయ్యె

సుదతితోడ నీరు సొచ్చినాఁ డిక్కడఁ
జొచ్చి తా వెడలిన చోటు లమరెఁ
దరుణిఁ గాముకేళిఁ దనిపినాఁ డిక్కడ
ననఁగిపెనఁగియున్నయంద మొప్పె.

ఒక యెలనాఁగచే యూఁదినాఁ డిక్కడ
సరస నున్నవి నాల్గుచరణములును
నొక నీలవేణితో నొదిఁగినాఁ డిక్కడ
మగజాడలో నిదె మగువజాడ
యొక లేమ ప్రొక్కిన నురివినాఁ డిక్కడ
రమణిప్రొక్కినచొప్పు రమ్యమయ్యె
నొకయింతి కెదురుగా నొలసినాఁ డిక్కడ
నన్యోన్యముఖములై యంఘ్రులొప్పె

నొకతె వెంటఁ దగుల నుండక యేఁగినాఁ
డడుగుమీఁదఁ దరుణియడుగు లమరె
నబల లిరుగెలంకులందు రాఁ దిరిగినాఁ
డాఱుపదము లున్నవమ్మ! యిచట.

ఈ చరణంబులే యిందునిభానన !
సనకాదిమునియోగసరణి నొప్పు
నీ పాదతలములే యెలనాఁగ ! శ్రుతివధూ
సీమంతవీధులఁ జెన్నుమిగులు
నీ పదాబ్జంబులే యిభకులోత్తమయాన!
పాలేటిరాచూలి పట్టుగొమ్మ
లీ సుందరాంఘ్రులే యిందీవరేక్షణ!
ముక్తికాంతామనోమోహనంబు

లీ యడుగుల రజమె యింతి! బ్రహ్మేశాది
దివిజవరులు మౌళిదిశలఁ దాల్తు"
రనుచుఁ గొంద అబల లబ్జాక్షుఁ డేఁగిన
క్రమముఁ గనియు నతనిఁ గానరైరి......

అని యిబ్భంగి లతాంగులందఱును బృందారణ్యమం దీశ్వరున్
వనజాక్షుం బరికించి కానక, విభున్ వర్ణించుచుం బాడుచున్
మనముల్ మాటలుఁ జేష్టలుం గ్రియలు నమ్మానాథుపైఁ జేర్చివే
చని రయ్యామునసైకతాగ్రమునకున్ సంత్యక్తగేహేచ్ఛలై

చని గోపికలు హరి నుద్దేశించి యిట్లనిరి:

నీవు జనించిన కతమున
నో వల్లభ! లక్ష్మి మందనొప్పె నధికమై
నీవెంటనె ప్రాణము లిడి
నీవా రరసెదరు చూపు నీ రూపంబున్.

శారదకమలోదరరుచి
చోరక మగు చూపువలన సుందర! మిమ్ముం

గోరి వెల యీని దాసుల
ధీరత నొప్పించు టిది వధించుటగాదే.

గోవులవెంటఁ ద్రిమ్మరుచుఁ గొల్చినవారల పాపసంఘముల్
ద్రోవఁగఁజాలి శ్రీఁ దనరి దుష్టభుజంగఫణాలతాగ్రసం
భావితమైన నీ చరణపద్మము చన్నులమీఁద మోపి, త
ద్భావజపుష్పభల్లభవబాధ హరింపు వరింపు మాధవా!

నీ నగవులు నీ చూడ్కులు
నీ నానావిహరణములు నీ ధ్యానంబుల్
నీ నర్మాలాపంబులు
మానసముల నాఁటి నేఁడు మగుడవు కృష్ణా!

ఘోషభూమి వెడలి గోవుల మేపంగ
నీరజాభమైన నీ పదములు
గసవు శిలలుఁ దాఁకి కడు నొచ్చునో యని
కలఁగు మా మనములు కమలనయన!

మాపటివేళ నీవు వనమధ్యము వెల్వడి వచ్చి, గోష్పద
ప్రాపితధూళిధూసరితభాసితకుంతలమై, సరోరుహో
ద్దీపితమైన నీ మొగము ధీరజనోత్తమ! మాకు వేడ్కతోఁ
జూపి మనంబులన్ మరునిఁ జూపుదుగాదె క్రమక్రమంబునన్.

నీ వదవిం బగల్ దిరుగ నీ కుటిలాలకలాలితాస్య మి
చ్ఛావిధిఁ జూడకున్న నిమిషంబులు మాకు యుగంబులై చనుం
గావున రాత్రులైన నినుఁ గన్నుల నెప్పుడుఁ జూడకుండ ల
క్ష్మీవర! ఱెప్ప లడ్డముగఁ జేసె నిదేల విధాత క్రూరుఁడై.

అరవిందంబులకంటెఁ గోమలములై, యందంబులై యున్న నీ
చరణంబుల్ కఠినంబులై మొనయు మాచన్నుంగవల్ మోపఁగా

నెరియంబోలునటంచుఁ బొక్కెదము నీ యీ కర్కశారణ్యభూ
పరిసంచారము కృష్ణ! నీప్రియలకుం బ్రాణవ్యథంజేయదే.''

అని యిట్లంగన లంచితస్వరముతో నంకించుచుం, బాడుచుం
దను రావే యని చీరి యేడువ జగత్త్రాణుండు త్రైలోక్యమో
హనుఁడై మన్మథమన్మథుండయి మనోజ్ఞాకారియై, హారియై
ఘనపీతాంబరధారియై పొడమెఁ దత్కాంతాసమీపంబునన్.

అబల యొక్కతె భక్తినంజలి గావించి
ప్రాణేశు కెంగేలు వట్టికొనియె
నింతియొక్కతె జీవితేశ్వరు బాహువు
మూఁపున నిడికొని ముదమునొందె
వనిత యొక్కతె తనవల్లభు తాంబూల
చర్వితమాత్మహస్తమునఁ దాల్చెఁ
బడఁతియొక్కతె ప్రియపదములు విరహాగ్ని
తప్తకుచంబుల దాఁపుకొనియె

భామయొకతె భ్రుకుటిబంధంబు గావించి
ప్రణయభంగరోషభాషణమున
దష్టదశన యగుచు దండించుకైవడి
వాఁడిచూడ్కిగముల వరునిఁ జూచె.

ఒక్కలతాంగి మాధవుని యుజ్వలరూపము సూడ్కితీవలం
జిక్కగఁబట్టి, హృద్గతముజేసి వెలింజనకుండ నేత్రముల్
గ్రక్కనమూసి, మేనఁ బులకంబులుగ్రమ్మగఁగౌఁగిలించుచున్
జొక్కములైనలోచవులఁ జొక్కుచునుండెను యోగికైవడిన్.

ఆ సమయంబునన్ విభుఁ డనంతుఁడు, కృష్ణుఁడు చిత్రమూర్తియై
చేసెను మండలభ్రమణశీలపరస్పరబద్ధబాహుకాం
తాసువిలాసమున్, బహువిధస్ఫురితాననహస్తపాదవి
న్యాసము, రాసముం, గృతివియచ్చరనేత్రమనోవికాసమున్.

(భాగవతము దశమస్కంధమునుండి)



గోవ్యాఘ్రసంవాదము

అనంతామాత్యుడు

ఒక విప్రవర్యుని హోమధేనువు నిత్య
సత్యవర్తిని సదాచారమూర్తి
కలహంబునకుఁబోదు, కలిగినంతనె తుష్టి
నొందు, సందడికోర్చు, నుఱ్ఱువేయ
వలవదు, పిదుకుచో వరవృష్టిధారల
చెలువునఁ జన్నులుచేఁపి కురియుఁ,
దెవులెఱుంగదు, ఱొమ్ముతీండ్ర సొలగఁగల్గి
కుఱుమట్టమై చాలఁ గూడియుండు

నిట్టి గోరత్న మొక్కనాఁ డేకతంబ
పోఁకుమేయుచునుండ, ఒెబ్బులియొకండు
దాని గని పొంచి, యొడలెల్ల దాఁచి, వాల
మవనిఁ దాటించుచును వ్రేయనడరుటయును.

కళవళములేక, 'యోహో,
నిలు నిలు'మని సురభి యుట్లనియెఁ జయ్యన న
ప్పులితో "నా కొకచన వీ
వలయు వివేకించి నాదువాక్యము వినుమా."

అనినఁ బులి గోవుపై నె
త్తినకేలును, భీషణాకృతియుఁ బటమునవ్రా

సినచిత్తరురూపువిధం
బున ఖచరుల కద్భుతంబు వొదలగనుండెన్.

పులియచె ! దీపనానలము పొంగున్రమోగుచునున్కియట్టె! యి
మ్ముల నొకపాఁడిగో వపుడు ముందటికిం జనుదెంచునట్టె! హో
నిలుమనినం బయిఁబడక నిల్చి కనుంగొనునట్టె ! బాపురే
కలఁగక యాడుమాట లయకాలునినైన శమింపఁజేయదే.

ఇట్లు నిల్చి యప్పుండరీకం "బామిషార్థినై వచ్చు నన్నిట్లు వారింపఁ గారణంబేమి ? నీవేమి చెప్పుదువు ? చెప్పు" మనిన గోవిట్లనియె:

మునుమునుబుట్టె నాకు నొకముద్దులపట్టి, యతండు పుట్టి యే
డెనిమిదినాళ్ల పాటిగలఁ, డింతియ పూరియు మేయనేరఁ, డేఁ
జని కడుపార జన్ గుడిపి చయ్యన వచ్చెద, నన్నుఁ బోయిర
మ్మని సుకృతంబుగట్టికొనవన్న ! దయాగుణ ముల్లసిల్లఁగన్.

అని వల్కుచుఁ దనలో నిట్లని విచారించుచు-

రేపు చనుగుడిపివచ్చితి
నేపున నందద పరువులిడి యంతటిలో
నాపుడిసెఁడు నఱిగినఁ గొడు
కేపాటులఁ బడునొ, వాని కెయ్యది గతియో.

ఏ న్నఱు నాకుచుండఁగఁ
దా నను నండగొని చెవులుఁ దాలవయిచుచున్
మేనెఱుఁగకయుండెడు నా
కూనకు నెవ్వారు దిక్కొకో యిటమీఁదన్.

అంతఁ, దనయంతరంగం బెఱింగిన నప్పులి సంశయించునోయని చిత్తంబొక్కింతచేసికొని, వైవర్ణ్యంబు దోఁపనీక యమ్మొదవిట్లనియె:

''గుమ్మెడుపాల నాసుతునకుం బరితృప్తి జనించుఁగాని మాం
సమ్ము సమస్తముం గొనకచాలదు నీయుదరాగ్ని, కైన ని
క్కమ్ముగనిందులోఁ బ్రథమకార్యనినిర్గతి నీ వెఱుంగవే
పొమ్మనవన్న ! వ్యాఘ్రకులభూషణ ! చయ్యనఁబోయివచ్చెదన్.''

అనవుడుఁ బుండరీక మపహాస్యముచేసి ''యిదేమిగోవ ! యి
ట్లనియెదు, నన్ను బేల్పఱచి, యాత్మజుఁడున్నెడకేగి, సత్వరం
బునఁ జనుదెంతునంటి, విడిపోలునె ! చెప్పెడువారు చెప్పినన్
వినియెడువారి కించుక వివేకముపుట్టదె, యింతయేటికిన్.

ఎట్టికష్టజంతు వేనియు దేహంబు
విడుచుచోటఁ బెనఁగఁబడునకాదె
సమ్మతించి చావఁజాలదు ......

అటుగాన సురభి ! విను నీ
వటుపోయి, 'యుపాయయుక్తి నడకించితిఁబో
కుటిలనఖచటులదంష్ట్రో
త్కటశార్దూలంబు' ననుచుఁ గౌతుకమెసఁగన్.

గుండె నిమురుకొనుచుఁ గొడుకుపాలికినేగి
కడుపునిండఁ జన్నుగుడిపి నీవు
నెమరువెట్టుకొనుచు నెమ్మదినుందుగా
కిచటి కేల వచ్చె దెఱిఁగి యెఱిఁగి.

ఆఁకొని యఱచెడిఁ బ్రేవులు
నేఁకటవో నమలవలయు నీమాంసము న

జ్ఞాఁకయిడి యివ్విధంబునఁ
దేఁకువచెడి పల్లఁదగునె ధేనువ నాతోన్.''

అనిన నప్పుండరీకంబునకు వివేకంబులేదుగదే యని శోకంబు నొందుచు నాగోరత్నంబు ... ...''నే నిన్ను బ్రమోషించిపోయి క్రమ్మఱ రాకుందునని నమ్మనేర, విది సాధులక్షణంబె ? యే నసత్య వచనురాలనె ?

అచ్చటికేగి మత్సుతుని నర్థి గనుంగొని కుక్షినిండఁ జ
న్నిచ్చి, మనంబునంబొదలు నేఁకటిఁ బాపి, శరీరమంతయున్
ముచ్చటవోవ దువ్వి, తగుబుద్ధులుచెప్పి, కృతార్థనై వెసన్
వచ్చెదఁ, గాదుగూడదనిన న్మఱి యడ్డముచెప్పనేర్తునే.

అతిథిసత్కారమునకంటె నధికమైన
ఫలము లే దంద్రుపెద్ద లీపట్టునందు
నీవ యతిథివి నాకు, నిన్నిచట డించి
పోయి రాకున్నఁ బాపంబు వొరయకున్నె ?

కన్నకడుపుగానఁ, గడుబిన్నగాన, నే
నతనిఁ బాసి దూరమరుగునట్టి
వేళగాన, వాని వీక్షించిరాకున్న
వగపుమాన దనిన వదలవైతి.

నీకిష్టమైనఁ జాలుం
గా కట్టులుసేయు''మనినఁ గారుణ్యరసో
త్సేకంబై తనచిత్తము
వే కరఁగుడుఁ బుండరీకవిభుఁ డిట్లనియెన్:

''కొడుకుఁ దలంచి నీవు గడు గొందలమందఁగఁజూచి గోవ ! ని న్విడిచిన నాఁకటం దనువు నిల్వదు నాకు, గృహంబుఁజేరి యే తడవుకుఁగాని రావొ ? శపథంబులు పల్కక నమ్మఁజాల'' నా వుడుఁ బులిజూచి గోవు ''వినవో మదిలో ననుమాన మేటికిన్,

అపరాహ్ణవేళ యం దతిథి యాఁకొనివచ్చి
యడిగినఁ బెట్టక కడపువాని
గతికి, నర్థాపేక్షఁ గన్నియఁ గొనిపోయి
ముసలికి నిచ్చు తామసునిగతికిఁ,
బాపంబులేకయె పత్నిఁ బరిత్యజిం
చినవానిగతికి, నాశ్రితచయంబు
గ్రాసంబులేక దుఃఖముల నొందఁగ నస
ద్వ్యయమాచరించినవానిగతికి

ధారవోసినధన మీక తత్ప్రతిగ్ర
హీత బలుమాఱు నడిగించుదాతగతికిఁ
బోవుదాన నింటికిని నే బోయి మరలి
రాకతక్కితినేఁ బుండరీకవర్య!''

అని శపథంబులుపలికిన
విని వ్యాఘ్రము ''నీవు ధర్మవిదురాలవు నీ
కెన యెవ్వరు ధేనువ ! యే
నిను నమ్మితిఁ బోయిర''మ్మనినఁ బటుబుద్ధిన్.

పులికిఁ బ్రదక్షిణించి, తలపుంబలుకున్ సదృశంబుగాఁగ న స్ఖలితవిలాసయాన మెసగం బురి కేగెఁ, జతుస్స్తనంబులుం

బలసి పొదుంగు ప్రేఁగుపఱుపంగ గభీరరవంబుతోడ వీ
థుల నడయాడు బాలకులు దోరపుభీతిఁ దొలంగిపాఱఁగన్.

ఆయతరీతిఁ దద్ధ్వని రసాయనమై చెవిసోఁక, నప్పు డం
బేయనుచుం బ్రతిస్వనము పెల్లుగఁ జూపుచుఁ బాఱి, ధేనువున్
డాయఁగఁబోయి, వేడుక నొడల్గదలింపుచు, వాలమార్చుచుం
దాయక గుప్పుచుంగుడిచె బాలవృషంబు నిజాంశదుగ్ధముల్.

కొడుకు చనుగ్రోలుచున్నంతదడవు దల్లి
యడుగుదిరుగక, కదలక, యన్యచిత్త
గాక, పై నీఁగసోఁకినఁ గదలకుండె
నెమ్మిఁ బాషాణధేనువు నిలిపినట్లు,

పొట్టపొంగునఁ దల్లిపొది వాసి, వీథికిఁ
బాఱి క్రమ్మఱుఁ బెద్దపరువుతోడఁ
దలయెత్తి చూచుచుఁ బలుమాఱుఁ దను దల్లి
పిలువంగ నిటనటఁ బొలసియాడు
నిలమీఁద మోమిడి యేమేని మూర్కొనుఁ
బసివెట్టికొనుచుఁ దత్ప్రాంతమందు
నంతంతఁ బసిబిడ్డ లడ్డంబుసుడిసిన
జంకెచి మిన్నంటఁ జౌకళించు

నిట్లు శైశవక్రీడల నెసఁగుచున్న
కొడుకుదెసఁజూచి, కన్నీరు గ్రుక్కుకొనుచుఁ
గటకటా ! యిట్టి నెత్తురుగందు నిచట
వైచిపోవంగవలసె నే నీచగతికి.

తల్లు లరుగుదేఱఁ దనయాడు కోడెలు
సదమలానురక్తి నెదురువాఱఁ
దానుగూడఁ బాఱి, తనమాతృహీనత
దెలిసి బిడ్డఁ డంతఁ దలఁగకున్నె ?

ఏఁ దను బాసిపోవు తెఱఁగెద్దియుఁ గానఁడు వీఁడు నెమ్మదిం
దాఁ దిరుగందొడంగెఁ, బులి తద్దయునాఁకొని యోర్వలేక నా
మీఁద నసత్యదోష మిడి మిన్నకపోవునొ యింక నాకు ని
చ్చోఁ దడయంగ రాదనుచు సూనుని డగ్గఱి ధేను విట్లనున్:

"నిన్ను గని యిన్ని దినములు
చన్నిచ్చితి నేను ఋణవశంబున నిఁక నీ
వెన్నఁడు నన్నుఁ దలంపకు
మన్న ! మమత్వంబు విడువు మన్న! మనమునన్.

ఒంటిఁ జరింపకు పొలమున
నింటికిఁ గడు ప్రొద్దుగలుగ నేతెంచుచురా
వెంటఁబడి పొడుచుగోవుల
జంటఁ జనకు క్రయ్యఁబడకు సందడియగుచో.

నూఁతుల దరులను, లోఁతగు
పాఁతటి కసవులను నెట్టిపచ్చిక యున్నన్
బ్రాఁతిపడి మేయఁబోకుము
మూఁతి నిడకు ముగ్రసత్త్వములుగల నీటన్.

చులుకన జలరుహతంతువు
చులుకన తృణకణము దూది చుల్కనసుమ్మీ

యిల నెగయుధూళి చుల్కన
చులుకన మఱి తల్లిలేనిసుతుఁడు కుమారా!''......

అని తగ బుద్ధిచెప్పెడు నిజాంబ గనుంగొని తత్తనూజుఁడి
ట్లను ''నిది యేమి తల్లి! యిటులాడెదు విప్రుఁడు నిన్ను నర్థకాం
క్ష నొకని కమ్మెనో? తనదు గాదిలిపుత్రికి నీఁదలంచెనో?'
యెనయఁగ బుణ్యకాలమున నెవ్వరికేనియు ధారవోసెనో?''

అనినఁ గ్రేపుమాటలకు...నగ్గో విట్లనియె:

''ఇవ్విప్రవరేణ్యుఁడు నను
నెవ్వరికిని నొసఁగఁ డేన యేగెద విను''మం
చవ్వివరము సర్వంబును
నవ్వత్సముతోడఁ జెప్ప నది కడు భీతిన్,

పిడుగడిచినక్రియ, నీటెం
బొడిచిన గతి గుండె పగిలి భూస్థలిమీఁదన్
బడి పొరలుఁ దన్నుకొను ను
గ్గడువుగఁ గన్నీరునించుఁ గడగడ వడఁకున్.

'బే' యనుఁ, 'దల్లి! నీవెట
పోయెద?' వను, 'నన్నుడించి పులివాఁతబడన్
బోయెదవే?' యనుఁ, 'జెల్లం,
బో?' యను 'నింకేటిబ్రతుకు పో నాకు' ననున్.

ఇవ్విధమున శోకింపఁగ
నవ్వత్సశిరంబుమీఁద నానన మిడి, ''నీ
వెవ్వరికిఁగాఁగ వగచెద
వివ్వలవని జాలిపడగ నేటికిఁ బుత్రా!

అరుదుగ సత్యవాక్యము సహాయముగాఁ బులితేనివక్త్రగ
హ్వావరమను పెద్దత్రోవను రయంబున స్వర్గసుఖంబుఁ జూడఁకో
నరుగుచునున్నదాన నిది హర్షమునొందెడివేళగాక దు
స్తరమగుశోకముం బొరయుదానికిఁ గారణ మేమి చెప్పుమా.

పుట్టిన పిమ్మటఁ జావును
గట్టి; వృథామరణ మొందుకంటె బుధులకున్
దట్టమగుకీర్తి సుకృతము
లిట్టలముగఁ గల్గుచావు లింపు లుగావే...

ఇంకఁ బెనఁగవలవ దిచటనేఁ దడసిన
నచట నన్ృతదోష మావహిల్లు
దానఁజేసి యగు నధమలోక ; మంత సే
యంగనేల పనుపవయ్య ! నన్ను.''

అని యిటు లెట్టకేలకు నిజాత్మజు శోకదవాగ్నికీల లో
య్యన వచనాంబువర్షమున నాఱఁగఁజేయుచు దాని నచ్చటం
గొనకొనియుండఁగా నిలిపి, కూరిమితోఁ బులియున్నయట్టియ
వ్వనమునకున్ రయంబెసఁగ వచ్చుచునుండఁగ నంతనక్కడన్.

అప్పులి యిట్లని వితర్కించు:

పాటిగలదె పసరమునకు
వేటలవిం గదిసినపుడె విఱువక నే న
మ్మాటల బేలుపడితి మొగ
మోట దరిద్రత్వమునకు నొగిఁ బొత్తయ్యెన్......

పులిచేతఁ జిక్కి, యొక యి
మ్ముల విడివడిపోయి, దానిముందటి కేగో

వులు మరలివచ్చు ? నేలా
తలపోఁతలు, నోరికండ తప్పెందప్పెన్.

ఏ దానితోడి చలమున
నేదినముననైన నొక్కయెడ నడరి గళ
చ్ఛేదము సేయక యూరక
పోదునె యిటుగాకయున్నఁ బులినే నేనున్.

అని యుదరాగ్నిచేఁ బరవశాత్మకయై, ధృతిమాలి, నెమ్మనం
బునఁ దలపోయుచున్న పులిముందటి కప్పుడు వచ్చినిల్చెనో
యనఁగ మహాద్భుతంబగురయంబునఁ దాఁ బఱతెంచి ధేను వి
ట్లను "నిది ప్రొద్దుదాఁకఁ గడు నాఁకొని యేక్రియనుండితో కదే.

ఇంత తాల్మి లేక యిల నిట్టి సుకృతంబు
లెట్లు సంభవించు నేరికైన
నీని మిత్త్రమైకదా నా తనూజుని
బుజ్జగింపఁగంటిఁ బురికి నేగి.

నా మన సొక్కటి యయ్యెను
నీ మనసారఁగ భుజింపు, నీ కే నధిక
ప్రేమమున సమర్పించితి
నా మేనిదె పుణ్యగతికి ననుఁ బుచ్చవనా !"

అనినదాని తెగువ కద్భుతస్వాంతుఁడై
పుండరీక "మేను బుట్టి పెరిగి
యింతవాఁడ నైతి, నింత నిష్కపటుల
నిట్టి ధీరమతుల నెఱుఁగ నేను.

ఇట్టి మహానుభావులకు హింసయొనర్చి దురంతదోషముల్
గట్టికొనంగఁజాల, మఱికల్గవె మాంసము లొండుచోట ? నీ
పుట్టువునందు నన్ను మును పుట్టఁగఁ జేసిన యట్టిదైవ మీ
పట్టునఁ బూరిమేపెడినె ? ప్రాణము లింతనె పోవుచున్నవే ?''

అని, యాధేనువుఁ జూచి ''నీ విమలసత్యప్రౌఢికిన్ మెచ్చువ
చ్చె, నినుంజంపఁగఁజాల, నీదుతలఁగాచెన్ ధర్మ మీప్రొద్దు పొ
మ్ము నిజావాసము చేర, నీ సఖులు సమ్మోదంబునుంబొంద నీ
తనయుం డత్యనురాగముంబొరయఁ జిత్తప్రీతి మైనొందఁగన్''

ఆనిన నప్పులికి నమ్మొద విట్లనియె:

''మెత్తనిమనసే నాయది
యొత్తి యిటులఁ జూడనేల యోపుణ్యుఁడ ? నే
నిత్తనువు నీకు మును వా
గ్దత్తముచేసినదికాదె కథ లేమిటికిన్ ?

ఉదరాగ్ని పెల్లున నొడలెల్ల శుష్కమై
వాతెఱ వఱువట్లు వట్టఁదొడఁగె
సకలేంద్రియంబులు వికలభావంబు చే
కొనియె, వీఁపున నంటుకొనియెఁ గడుపు
ప్రాణంబు లాతురపడఁజొచ్చె, నిట్లూర
కుండుదే ప్రొద్దు ఖానుండు గ్రుంకఁ
బగలింటి యుపవాసభారంబు దీఱ మ
ద్రక్తమాంసముల నక్తమ్ము సేయు

మంతఁ బుణ్యురాలనై యేను దివ్యవి
మానయానమున ననూనమహిమ

దనర నిన్నుఁ దలఁచుకొనుచు నెమ్మదిఁబోదు
నూర్ధ్వలోకమునకు నో మృగేంద్ర!''

అని గంగడోలు బిగియఁగఁ
దనమెడ యెత్తుకొని కపిల దగ్గఱఁ జనుదెం
చినఁ జూచి పుండరీకము
వెనువెనుకకె పోవుఁగాని విఱువదు దానిన్.

కుడువంగరమ్మని తొడరి చుట్టము బిల్వ
నాఁకలిగా, దొల్ల ననుచుఁ బెనఁగు
నతఁడునుబోలె, నాతతశోభనాంగియై
తనరు నా ధేనురత్నంబు దన్ను
భక్షింపుమని పట్టుపఱుప సద్యోజ్ఞాన
శాలియై పరగుశార్దూలవిభుఁడు
దా నొల్లనని పల్కఁ, దమలోన నొకకొంత
దడవు సుహృద్భాషితంబు లిట్లు

జరుగుచుండ గోవుసత్యవాక్శుద్ధికిఁ
బులి కృపాసమగ్రబుద్ధికిని బ్ర
సన్నులైరి సురలు, సాధువాదము లుల్ల
సిల్లె గగనవీధి నెల్లయెడల.

(భోజరాజీయము 4, 6 ఆశ్వాసములనుండి)



వైరాగ్య కీర్తనలు

తాళ్ళపాక అన్నమాచార్యులు

ఎవ్వరి గాదన్న నది నిన్ను గాదంట
ఎవ్వరి గొలిచిన నది నీకొలువు ॥పల్లవి॥

అవయవములలో నదిగా దిదిగా
దవిమే లివిమే లననేలా
భువియుఁ బాతాళము దివియు నందలిజంతు
నివహ మింతయును నీ దేహమేకాన ॥ఎవ్వరి॥

నీవులేనిచోటు నిజముగఁ తెలిసిన
ఆవల నది గాదనవచ్చును
శ్రీవేంకటగిరిశ్రీనాథ! సకలము
భావింప నీవె పరిపూర్ణుఁడవుగాన ॥ఎవ్వరి॥

దేవ! యీ తగవు తీర్చవయ్యా
వేవేలకు నిది విన్నపమయ్యా ॥పల్లవి॥

తనువునఁ బొడమిన తతి నింద్రియములు
పొనిఁగి యెక్కడికిఁ బోవునయా
పెనఁగి తల్లికడ బిడ్డలు భువిలో
యెనగొని యెక్కడి కేగుదురయ్యా? ॥దేవ॥

పొదుగుచు మనమునఁ బొడమిన యాసలు
ఆదన నెక్కడికి నరుగునయా
పొదుగుచు జలములనుండు మత్స్యములు
పదపడి యేగతి బాసీనయ్యా? ॥దేవ॥
లలి నొకటొకటికి లంకెలు నీవే
అలరుచు నేమని యందునయా
బలుశ్రీవేంకటపతి నాయాత్మను
గలిగితి వెక్కడి కలుషములయ్యా! ॥దేవ! యీ తగవు॥

(వైరాగ్య కీర్తనలనుండి)

—: o :—

వినుర వేమ!

వేమన

గంగిగోవుపాలు గంటెడైనను జాలు
కడవెడైననేమి ఖరముపాలు
భక్తిగలుగుకూడు పట్టెడే చాలురా
విశ్వదాభిరామ, వినుర వేమ!

ఆత్మశుద్ధిలేని యాచర మదిమేల
భాండశుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజలేలరా? ...విశ్వదాభిరామ

నీళ్ళలోన మొసలి నిగిడి యేనుఁగు దీయు
బైట కుక్కచేత భంగపడును
స్థానబల్మి గాని తనబల్మికాదయా...విశ్వదాభిరామ

పెట్టిపోయలేని వట్టినరులు భూమి
బుట్టనేమి వారు గిట్టనేమి
పుట్టలోనఁ జెదలు పుట్టవా గిట్టవా...విశ్వదాభిరామ

ఆశచేత మనుజు లాయువుగలనాళ్ల
తిరుగుచుంద్రు భ్రమను ద్రిప్పలేక
ముఱికిభాండమందు ముసురు నీఁగలభంగి...విశ్వదాభిరామ

చంపఁదగిన యట్టి శత్రువు తనచేతఁ
జిక్కెనేని కీడు సేయరాదు
పొసఁగ మేలుచేసి పొమ్మనుటేచాలు...విశ్వదాభిరామ

అనువుగానివేళ నధికుల మనరాదు
కొంచెమైన నదియుఁ గొదవకాదు
కొండ యద్దమందుఁ గొంచెమైయుండదా...విశ్వదాభిరామ

విత్తము గలవాని వీపు పుండైనను
వసుధలోనఁ జాల వార్తకెక్కు
పేదవానియింటఁ బెండ్లైన నెఱుఁగరు...విశ్వదాభిరామ

చెప్పులోనిఱాయి చెవిలోనిజోరీఁగ
కంటిలోని నలుసు కాలిముల్లు
ఇంటిలోనిపోరు ఇంతింతగాదయా...విశ్వదాభిరామ

వేషభాషలెఱిగి కాషాయవస్త్రముల్
కట్టగానె ముక్తి కలుగఁబోదు
తలలు బోడులైనఁ దలఁపులుబోడులా...విశ్వదాభిరామ

వ్రాఁతకంటె హెచ్చు వరమీదు దైవంబు
చేఁతకంటె హెచ్చు వ్రాఁతకాదు
వ్రాఁత కజుఁడు కర్త చేఁతకుఁ దాఁగర్త...విశ్వదాభిరామ

బొందెలు గనవేఱు భువిప్రాణమొక్కటే
అన్నము లిలవేఱు అఁకలొకటె
దర్శనములె వేఱు దైవంబునొక్కటే...విశ్వదాభిరామ

(వేమన పద్యాములనుండి)

—: o :—

వరూథినీ ప్రవరులు

అల్లసాని పెద్దన

మృగమదసౌరభవిభవ
ద్విగుణితఘనసారసాంద్రవీటీగంధ
స్థగితేతరపరిమళమై
మగువపొలుపుఁ దెలుపు నొక్క మారుత మొలసెన్.

అతఁ డావాతపరంపరాపరిమళవ్యాపారలీలన్ జనా
న్వితమిచ్చోటని చేరఁబోయి కనియెన్ విద్యుల్లతావిగ్రహన్
శతపత్రేక్షణఁ, జంచరీకచికురం, జంద్రాస్యఁ, జక్రస్తనిన్
నతనాభిన్, నవలా, నొకానొక మరున్నారీశిరోరత్నమున్.

అమలమణిమయనిజమందిరాంగణస్థ
తరుణసహకారమూలవితర్దిమీఁద
శీతలానిల మొలయ నాసీనయైన
యన్నిలింపాబ్జముఖియు నయ్యవసరమున

తతనితంబాభోగధవళాంశుకములోని
యంగదట్టపుఁ గావిరంగువలన
శశికాంతమణిపీఠి జాజువాఱఁగఁ గాయ
లుత్తుంగకుచపాళి నత్తమిల్లఁ
దరుణాంగుళీధూతతంత్రీస్వనంబుతో
జిలిబిలిపాట ముద్దులు నటింప

నాలాపగతిఁ జొక్కి యరమోడ్పుఁ గనుదోయి
రతిపారవశ్యవిభ్రమముఁ దెలుపఁ

ప్రౌఢిఁ బలికించు గీతప్రబంధములకుఁ
గ్రమకరపంకరుహరత్నకటకఝుణఝు
ణధ్వనిస్ఫూర్తి తాళమానములు గొలుప
నింపు దళుకొత్త వీణ వాయింపుచుండి,

అబ్బురపాటుతోడ నయనాంబుజముల్ వికసింపఁ, గాంతి పె
ల్లుబ్బి కనీనికల్ వికసితోత్పలపంక్తులఁ గ్రుమ్మరింపఁగా
గుబ్బ మెఱుంగుఁ జన్గవ గగుర్పొడువన్, మదిలోనఁ గోరికల్
గుబ్బటిలంగఁ జూచె నలకూబరసన్నిభు, నద్ధరామరున్,

చూచి,ఝళంఝళత్కటకసూచితవేగపదారవిందయై
లేచి, కుచంబులుం దుఱుము లేనడు మల్లలనాడ నయ్యెడం
బూచిన యొక్క పోఁకనునుబోదియఁ జేరి, విలోకనప్రభా
వీచికలం దదీయపదవీకలశాంబుధి వెల్లిగొల్పుచున్.

మునుమున్ బుట్టెడుకొంకులౌల్యమునిడన్, మోదంబు విస్తీర్ణతం
జొనుపం, గోర్కులు గ్రేళ్లుద్రిప్ప, మదిమెచ్చుల్ ఱెప్పలల్లార్ప, న
త్యనుషంగస్థితి ఱిచ్చపాటొసఁగ, నొయ్యారంబునం జంద్రికల్
దనుకంజూచె లతాంగి భూసురుఁ బ్రఫుల్లన్నేత్రపద్మంబులన్.

తొంగలిఱెప్పలం దొలఁగఁ ద్రోయుచుఁ బైపయి విస్తరిల్లు క
న్నుంగవ యాక్రమించుకొనునో ముఖచంద్రునటంచుఁ బోవనీ
కంగజుఁ శానవెట్టి కదియన్ గుఱివ్రాసెననంగ జాఱి సా
రంగమదంబు లేఁజెమటఁ గ్రమ్మె లలాటము డిగ్గి చెక్కులన్.

ఇట్లతని రూపరేఖావిలాసంబులకుం జొక్కి... యాత్మగతంబున,

ఎక్కడివాఁడొ యక్షతనయేందుజయంతవసంతకంతులం
జక్కఁదనంబునన్ గెలువఁజాలెడువాఁడు, మహీసురాన్వయం
బెక్కడ, యీ తనూవిభవ మెక్కడ! యేలనిబంటుగా మరుం
డక్కఁగొనంగరాదె యకటా! నను వీఁడు పరిగ్రహించినన్.

వదనప్రభూతలావణ్యాంబుసంభూత
    కమలంబు లన వీని కన్నులమరు
నిక్కి వీనులతోడ నెక్కసక్కెములాడు
    కరణి నున్నవి వీని ఘనభుజములు
సంకల్పసంభవాస్థానపీఠిక వోలె
    వెడఁదయై కనుపట్టు వీని యురము
ప్రతిఘటించుచిగుళ్లపై నెఱ్ఱవాఱిన
    రీతి నున్నవి వీని మృదుపదములు

నేరెటేటియసల్ తెచ్చి నీరజాప్తు
సానఁబట్టిన రాపొడి చల్లి, మెదిపి,
పదను సుధ నిడి చేసెనో పద్మభవుఁడు
వీనిఁ, గాకున్నఁ గలదె యీ మేనికాంతి!

అని చింతించుచు మీనకేతనధనుర్జ్యాముక్తనారాచదు
ర్దినసమ్మూర్ఛితమానసాంబురుహయై దీపించు పెందత్తఱం
బునఁ బేటెత్తిన లజ్జ నంఘ్రికటకంబుల్ మ్రోయ, నడ్డంబు ని
ల్చిన నయ్యచ్చరఁజూచి చేరఁజని పల్కెన్ వాఁడు విభ్రాంతుఁడై,

"ఎవ్వతె వీవు భీతహరిణేక్షణ! యొంటి జరించె దోటలే
కివ్వనభూమి? భూసురుఁడ, నేఁ బ్రవరాఖ్యుఁడఁ ద్రోవతప్పితిం

గ్రొవ్వున నిన్నగాగ్రమునకుం జనుదెంచి, పురంబుఁజేర నిం
కెవ్విధిఁగాంతుఁ, దెల్పఁగదవే తెరువెద్ది శుభంబు నీ కగున్,"

అని తన కథ నెఱిఁగించినఁ
దన కనుఁగవ మెఱుఁగు లుబ్బఁ దాటంకములుం
జనుఁగవయు నడుము వడఁకఁగ
వనిత సెలవివాఱ నవ్వి వానికి ననియెన్,

"ఇంతలు కన్నులుండఁ దెరువెవ్వరి వేఁడెదు భూసురేంద్ర! యే
కాంతమునందు నున్న జవరాండ్ర నెపంబిడి పల్కరించులా
గింతియకాక, నీవెఱుఁగవే మునువచ్చిన త్రోవచొప్పు? నీ
కింత భయంబు లే కడుగ నెల్లిదమైతిమి మాటలేటికిన్,

చిన్ని వెన్నెలకందు వెన్నుదన్ని సుధాబ్ధిఁ
బొడమినచెలువ తోఁబుట్టు మాకు
రహిపుట్ట జంత్రగాత్రముల రాల్ గరఁగించు
విమలగాంధర్వంబు విద్య మాకు
ననవిల్తుశాస్త్రంపు మినుకు లావర్తించు
పని వెన్నతోడఁ బెట్టినది మాకు
హయమేధరాజసూయము లనఁ బేర్పడ్డ
సవనతంత్రంబు లుంకువలు మాకుఁ

గనకనగసీమఁ, గల్పవృక్షముల నీడఁ
బచ్చరాచట్టుగమి రచ్చపట్టు మాకుఁ
బద్మసంభవవైకుంఠ భర్గసభలు
సాముగరిడీలు మాకు గోత్రామరేంద్ర!

పేరు వరూథిని, విప్రకు
మార! ఘృతాచీ తిలోత్తమాహరిణీహే
మారంభాశశిరేఖ లు
దారగుణాఢ్యలు మదీయలగు ప్రాణసఖుల్.

భూసుర! కైతవకుసుమశ
రాసన! మాయింటి విందవైతివి, గైకొ
మ్మా! సముదంచన్మణిభవ
నాసీనత సేదదేఱి యాతిథ్యంబున్.

కుందనమువంటి మేను మధ్యందినాత
పోష్మహతిఁ గందె, వడదాఁకె నొప్పులొలుకు
వదన, మస్మద్గృహంబు పావనముసేసి
బడలికలు వాసి చను'' మన్న బ్రాహ్మణుఁడు,

''అండజయాన! నీవొసఁగునట్టి సపర్యలు మాకు వచ్చె, నిం
దుండగరాదు పోవలయు నూరికి, నింటికి నిప్పుడేను రా
కుండనొకండు, వచ్చి మఱియొండునె? భక్తియచాలు, సత్క్రియా
కాండముఁ దీర్ప వేగ చనఁగావలయుం గరుణింపు నాపయిన్.

ఏనిఁక నిల్లుసేరుటకు నెద్దియుపాయము? మీ మహత్త్వముల్
మానిని! దివ్యముల్, మదిఁదలంచిన నెందును మీకసాధ్యముల్
గానము గానఁ దల్లిప్రజలన్ నను గూర్పు'' మటన్న లేఁతన
వ్వాననసీమఁ దోఁప ధవళాయతలోచన వాని కిట్లనున్:

'ఎక్కడియూరు కాల్నిలువ కింటికిఁ బోయెదనంచుఁ బల్కె దీ
వక్కట! మీకుటీరనిలయంబులకున్ సరిరాకపోయెనే

యిక్కడి రత్నకందరము, లిక్కడి నందనచందనోత్కరం
బిక్కడి గాంగసైకతము, లిక్కడి యీలవలీనికుంజముల్.

నిక్కము దాఁపనేల ధరణీసురనందన! యింక నీ పయిం
జిక్కె మనంబు నాకు, ననుఁ జిత్తజుబారికి నప్పగించెదో,
చొక్కి మరందమద్యముల చూఱలఁ బాటలపాడుతేంట్ల సొం
పెక్కినయట్టి పూవుఁబొదరిండ్లను గౌఁగిట గారవించెదో?"

అనుటయుఁ బ్రవరుం డిట్లను
"వనజేక్షణ! యిట్లు వలుక వరుసయె? వ్రతులై
దినములు గడపెడు విప్రులఁ
జనునే కామింప? మది విచారము వలదే!

వేలిమియున్ సురార్చనయు విప్రసపర్యయుఁ జిక్కె, భుక్తికిన్
వేళ యతిక్రమించె, జననీజనకుల్ కడు వృద్ధు లాఁకటన్
సోలుచుఁ జింతతో నెదురుసూచుచునుండుదు, రాహితాగ్ని నేఁ
డూలు సమస్తధర్మములుఁ దొయ్యలి! నేఁ డిలు సేరకుండినన్"

నావుడు విన్నఁబాటు వదనంబున నించుక దోఁపఁ బల్కె "నో
భావజరూప! యిట్టి యెలప్రాయము వైదికకర్మనిష్ఠలం
బోవఁగ, నింక భోగములఁబొందుట యెన్నఁడు? యజ్ఞకోటులం
బావను లౌటకున్ ఫలము మాకవుఁగిళ్ళ సుఖించుటేకదా!

సద్యోవినిర్భిన్నసారంగనాభికా
హృతమై పిసాళించు మృగమదంబు
కసటువోఁ బీఱెండఁ గరఁగి కజ్జలనంటి
గమగమ వలచు చొక్కపుజవాజి

పొరలెత్తి ఘనసారతరువులఁ దనుఁదాన
 తొరఁగిన పచ్చకప్పురపుసిరము
గొజ్జంగి పూఁబొదల్ గురియంగఁ బటికంపు
 దొనల నిండినయట్టి తుహినజలము

వివిధకుసుమకదంబంబు, దివిజతరుజ
మృదులవసనఫలాసవామేయరత్న
భూషణంబులు గల విందు, భోగపరుఁడ
వయి రమియింపుము ననుఁ గూడి యనుదినంబు.

ఎన్నిభవంబులంగలుగు నిక్షుశరాసనసాయకవ్యథా
ఖిన్నత వాడి వత్తలయి, కేలఁ గపోలములూఁది, చూపులన్
విన్నఁదనంబు తోఁపఁ గనువేఁదుఱునం బయిగాలి సోఁకినన్
వెన్నవలెం గరంగు నలివేణులఁ గౌఁగిఁటఁ జేర్చుభాగ్యముల్.

కుశలతయే వ్రతముల నగు
నశనాయాసమున నింద్రియనిరోధమునం
గృశుఁడవయి యాత్మ నలఁచుట
సశరీరస్వర్గసుఖము సమకొనియుండన్."

అనినఁ బ్రవరుండు "నీవన్న యర్థమెల్ల
నిజము కాముకుఁడైనవానికి, నకాముఁ
డిది గణించునె జలజాక్షి ! యెఱిఁగితేని
నగరమార్గంబుఁ జూపి పుణ్యమునఁ బొమ్ము."

అనిన నత్తెఱవ యక్కఱకటి పలుకుల కులికి, చంచలదృగంచల ప్రభ లతని ముఖాంబుజంబునం బొలయ, వలయమణిగణ

చ్ఛాయాకలాపంబు లుప్పరం బెగయఁ గొప్పు చక్కంజక్కుచు, గబ్బిగుబ్బలం జొబ్బిల్లు కుంకుమరసంబునం బంకిలంబులగు హార ముక్తాతారకంబుల నఖకోరకంబులన్ గీఱి తీరువడం జేయుచుఁ, బతితవనతరుకుసుమ కేసరంబులు రాల్చు నెపంబునం బయ్యెద విదల్చి చక్కసవరించుచు...నిట్లనియె.

''ఎందే డెందము గదళించు రహిచే నేకాగ్రతన్ నిర్వృతిం
జెందుం గుంభగతప్రదీపకళికాశ్రీ దోఁప, నెందెందుఁ బో
కెందే నింద్రియముల్ సుఖంబుఁగను నాయింపే పరబ్రహ్మ 'మా
నందో బ్రహ్మ'యటన్న ప్రాఁజదువు నంతర్బుద్ధి నూహింపుమా''

అనుచుఁ ద న్నొడఁబఱచు నయ్యమరకాంత
తత్తఱముఁ జూచి యాత్మ నతండు దనకు
సిగ్గు వెగటును బొడమ నిస్పృహతఁ దెలుపు
నొక్క చిఱునవ్వు నవ్వి యయ్యువిద కనియె.

''ఈ పాండిత్యము నీకుఁదక్క మఱి యెందేఁగంటిమే కామశా
స్త్రోపాధ్యాయినినా వచించెదవు మేలోహో ! త్రయీధర్మముల్
పాపంబుల్, రతిపుణ్యమంచు నిఁక నేలా తర్కముల్? మోక్షల
క్ష్మీప్రథ్యాగమసూత్రపంక్తికివె పో మీ సంప్రదాయార్థముల్.

తరుణీ ! రేపునుమాపు హవ్యములచేతం దృప్తుఁ డౌవహ్ని స
త్కరుణాదృష్టి నొసంగుసౌఖ్యము లెఱుంగన్ శక్యమే నీకు ? నా
కరణుల్ దర్భలు నగ్నులింద్రియములై న ట్లన్యముల్గా పొడల్
తిరమే ? చెప్పకు మిట్టితుచ్ఛసుఖముల్ మీసాలపైఁ దేనియల్''

అనుటయు మాటలేక హృదయాబ్జము జల్లని, మోము వెల్లనై
కనలుచు, నీరు దేఱు తెలిగన్నుల నాతనిఁ బుల్కుపుల్కనం

గను(గొని, మాటలం బొదువుగద్గదికం దలయూ(చి ''యక్కటా
వనిత తనంత(దా వలచివచ్చిన(జుల్కనగాదె యేరికిన్.

వెతలం బెట్టకు మింక న"న్ననుచు నీవీబంధ మూడన్, రయో
ద్ధతినూర్పుల్ నిగుడన్, వడిన్ విరులుచిందం, గొప్పవీడం, దనూ
లత తోడ్తో(బులకింప(గా, నను నయాలాపాతిదీనాస్యయై
రతిసంరంభము మీఱ నిర్జరవధూరత్నంబు పైపాటునన్,

ప్రాంచద్భూషణబాహుమూలరుచితో(జాలిండ్లపొంగార(, బై
యంచుల్ మోవ(గ(గౌ(గిలించి యధరం బాసింప 'హా! శ్రీహరీ'
యంచున్ బ్రాహ్మణు(డోరమోమిడి, తదీయాంసద్వయంబంటి పొ
మ్మంచుం ద్రోచె(, గలచునే సతులమాయల్ ధీరచిత్తంబులన్

త్రోపువడి నిలిచి ఘనల
జ్జాపరవశ యగుచు(గొప్ప సవరించి, యొడల్
దీపింప నతని(జూఱచుఱ(
గోపమునం జూచి క్రే(టుకొనుచుం బలికెన్,

''పాటున కింతు లోర్తురె కృపారహితాత్మక ! నీవు త్రోవ ని
చ్చోట భవన్నఖాంకురముసో(కె(గనుంగొను'' మంచు(జూపి, య
ప్పాటలగంధి వేదననెపం బిడి యేడ్చె(గలస్వనంబుతో
మీటిన విచ్చు గుబ్బచనుమిట్టల నశ్రులు చిందువంద(గన్.

ఈ విధమున సతికరుణము
గా వనరుహనేత్ర కన్ను(గవ ధవళరుచుల్
కావిగొన నేడ్చి వెండియు
నా విప్రకుమారు(జూచి యలమట(బల్కెన్.

"చేసితి జన్నముల్, దపము చేసితి నంటి, దయావిహీనతం
జేసిన పుణ్యముల్ ఫలముసెందునె? పుణ్యము లెన్ని యేనియుం
జేసినవానిసద్గతియె చేకుఱు భూతదయార్ద్రబుద్ధి కో
భూసురవర్య! యింత దలపోయవు నీ చదు వేల చెప్పుమా!

వెలివెట్టిరే బాడబులు పరాశరుఁ బట్టి
దాశకన్యాకేళి తప్పుఁజేసి,
కులములో వన్నె తక్కువయయ్యెనే గాధి
పట్టికి మేనకచుట్టఱికము,
ననుపుకాఁడై వేల్పునాగవాసముఁ గూడి
మహిమ గోల్పడియెనే మాందకర్ణి
స్వారాజ్య మేలంగనీరై రె సురలహ
ల్యాజారుఁడైన జంభాసురారి

వారికంటెను నీ మహత్త్వంబు ఘనమె
పవనపర్ణాంబుభక్షులై నవసి, యినుప
కచ్చడాల్ గట్టుకొను మునిముచ్చు లెల్లఁ
దామరసనేత్రలిండ్ల బందాలుగారె!"

అనిన నేమియు ననక యవ్వనజగంధి
మేన జవ్వాదిపస గదంబించు నొడలు
గడిగికొని, వార్చి ప్రవరుండు గార్హపత్య
వహ్ని నిట్లని పొగడె భావమునఁ దలఁచి.

దానజపాగ్నిహోత్రపరతంత్రుఁడనేని, భవత్పదాంబుజ
ధ్యానరతుండనేనిఁ, బరదారధనాదులఁ గోరనేని, స

న్మానముతోడ నన్ను సదనంబున నిల్పు, మినుండు పశ్చిమాం
భోనిధిలోనఁ గ్రుంకకయమున్న రయంబున హవ్యవాహనా !

అని సంస్తుతించిన నగ్ని దేవుం డమ్మహీదేవు దేహంబున సన్ని హితుండగుటయు నమ్మహాభాగుండు పావక ప్రసాదలబ్ధంబగు పవన జవంబున నిజమందిరంబున కరిగె.

(స్వారోచిష మనుచరిత్రము నుండి)



సత్యాసాంత్వనము

నంది తిమ్మన

అరదము నెక్కి కేతనపటాంచలచంచలమైనతాల్మితోఁ
దురగజవంబు మున్గడవఁద్రోచి కడంగెడుతత్తఱంబుతోఁ
దిరిగెడు బండికండ్లపగిదిన్ భ్రమియించుమనంబుతోడ నా
హరి సనుదెంచె సత్యసముదంచితకాంచనసౌధవీధికిన్.

వచ్చి యరదంబు డిగ్గి తద్ద్వారసీమ...
కమలనాభుండు కక్ష్యాంతరములు గడచి,
అలబలములేనినగ రెల్ల నరసిచూచి.

కనకపంజరశారికలకుఁ జక్కెర వెట్టి
    చదివింపరేలొకో సకియ లిపుడు
కరతాళగతుల మందిరమయూరంబుల
    నాడింపరేలొకో యతివ లిపుడు
క్రొవ్వాఁడిగోళ్ళఁ దంత్రులు మీటి వీణియ
    ల్వాలికింపరేలొకో భామ లిపుడు
కలికిరాయంచబోదల నెల్ల నెలయించి
    నడిపింపరేలొకో పడఁతు లిపుడు

ఇన్నిదినములవలె నుండ దేమి నేఁడు
చిన్నబోయిన దీమేడ చెన్ను దఱిఁగి
పద్మముఖితోడ నెవ్వరేఁ బారిజాత
పుష్పవృత్తాంత మెఱిఁగింపఁబోలునొక్కొ.

అని యనుమానించుచు నొ
య్యనఁ గోపగృహంబు సేరి, యా సత్రాజి
త్తనయ ముసుంగిడియుండఁగ
ననువుమెఱయఁ జొచ్చి, మాయ యచ్చుపడంగన్.

కొందఱ మంతనంబులను, గొందఱ జంకెనవాఁడిచూపులం
గొందఱఁ జేతిసన్నలఁ దగుల్పడఁజేయుచుఁ జేరబోయి, మ
ధ్యందినభానుమండలకరావళి హోవళి వాడియున్నతీ
పం దలపించు నమ్మగువఁ గన్గొని యెంతయు విస్మితాత్ముఁడై.

ఈ లలితాంగిచంద మొక యించుక చూచెదనంచు ధూర్తగో
పాలుఁడు తాలవృంత మొకభామిని సత్యపిఱుందనుండి మం
దాలసలీలమై విసర నాదటఁ గైకొని వీచెఁ దద్వపుః
కీలితపంచసాయకశిఖిం దరికొల్పుచునున్నకైవడిన్.

అంతటఁ బారిజాతకుసుమాగతనూతనదివ్యవాసనల్
వింతలుసేయఁ దావియిది విస్మయమంచు ముసుంగుద్రోచి య
క్కాంత గృహంబు నల్గడలు నారసి, సంభృతతాలవృంతునిం
గాంతునిఁ జూచి, బాష్పకణికాతరళీకృతలోచనాంతయై.

తలవాంచి మగుడ ముసుఁగిడెఁ
గొలుకుల డిగజాఱి జాలుకొనుబాష్పంబుల్
పలుచని చెక్కుల లవలీ
దళపతితమరందబిందుతతిఁ బురుడింపన్.

ఓర్వొకయింత లేని వికచోత్పలలోచన చిత్తవీధిఁ జ
ల్లార్పఁగ నీలనీరదశుభాంగుఁడు వే చనుదెంచెనంచుఁ గం

దర్పహుతాశనున్ వెలికిఁ దార్చుసఖుండునుబోలె వేఁడిని
ట్టూర్పు దళంబుగా నిగిడె నున్నమితావరణాంశుకాంతమై.

వనితకుచద్వయంబుపయి వ్రాసినకుంకుమపత్రభంగముల్
జనితనితాంతఘర్మకణజాలము చేతఁ గరంగి, మెల్లమె
ల్లన వెలిపట్టుపయ్యెదకెలంకుల జాఱుట యొప్పె మానసం
బున నెలకొన్న క్రోధరసము న్వెడవెట్టుచున్నకైవడిన్:

మానవతి యిట్లు మానని
మానక్రోధములచేఁ గుమారిలి, చింతా
ధీనగతి నుండ, మదిలో
నూనినప్రేమమున నంబుజోదరుఁ డనియెన్.

"ఇందునిభాస్య! మైతొడవు లేల ధరింపవు? సన్నగావు లీ
వెందును మానలేవు, తెలు పేటికిఁ గట్టితి? వీటికారుచుల్
కెందలిరాకుమోవి దులకింపఁగఁజేయకయున్కి యేమి? నీ
చందము వింతయయ్యెడు నిజంబుగ నా కెఱుఁగంగఁ జెప్పుమా?

పలుకులఁ దేనె లుట్టిపడఁ బల్కవు నేఁ డిదియేమి? క్రాలుగ
న్నుల నునుసిగ్గు నూల్కొనఁగనుంగొనవేల? యురఃస్థలంబుఁ జ
న్నుల నెదురొత్తి మక్కువ నసుం బిగికౌఁగిటఁ జేర్పవేటికే?
చిలుకలకొల్కి? యెవ్వ రెడసేసిరి, నీ కిటు లేల చింతిలన్?

మనముల మాటలం గ్రియల మన్నన లీ నొకనాఁడు నెట్టికా
మినులకు, గారవంబు మెఱమెచ్చులకై పచరింతుఁగాని, పా
యనియనురక్తి నీయెడల నగ్గలమై కనుపట్టు నాకు, నీ
పనిచినపంపు సేయుటయ ప్రాభవ మౌటది నీ వెఱుంగవే?

పడఁతీ! నీ మధురాధరామృతము నీ బాహాపరీరంభమున్
బడయన్ ధన్యుఁడఁగాకయుండిన, ననుం బాటించి యొక్కింత నీ
నిడువాలుంగడకంట జూడు'' మనుచున్ నిల్పోపమిం బైచెఱం
గొడియం, జేవిరిదమ్మి వ్రేయుటకునై యుంకించి జంకించినన్.

పాటలగంధి చిత్తమునఁ బాటిలు కోపభరంబుఁ దీర్ప నె
ప్పాటను బాటుగామి, మృదుపల్లవకోమలతత్పదద్వయీ
పాటలకాంతి మౌళిమణిపంక్తికి వన్నియవెట్ట నా జగ
న్నాటకసూత్రధారి యదునందనుఁ డర్మిలి మ్రొక్కె మ్రొక్కినన్

జలజాతాసనవాసవాదిసురపూజాభాజనంబై తన
ర్చు లతాంతాయుధుకన్నతండ్రిశిర మచ్చో వామపాదంబునం
దొలఁగంద్రోచెలతాంగి; యట్లయగునాథుల్ నేరముల్సేయఁబే
రలుకంజెందినయట్టికాంత లుచితవ్యాపారముల్ నేర్తురే !

కోపనపదహతికుహనా
గోపాలుఁడు గాంచి, మెయి గగుర్పొడువఁగ ను
ద్దీపితమన్మథరాజ్య
ప్రాపితుఁడై పలికెఁ గూర్మి బయలుపడంగన్.

''నను భవదీయదాసుని మనంబున నెయ్యపుఁగిన్కఁబూని తాఁ
చిన, యది నాకు మన్ననయ; చెల్వగు నీ పదపల్లవంబు మ
త్తనుపులకాగ్రకంటకవితానము నాటిన నొచ్చునంచు నే
ననియెద, నల్క మానవుగదా యికనైన నరాళకుంతలా !''

అన విని మానినీతిలక మప్పుడు మే యఱదోఁప నిక్కి, వీ
డినకచపంక్తిఁ బల్మఱు ముడి న్వెడదోఁపుచుఁ బైచెఱంగు గ్ర

క్కునఁ జనుదోయిఁ జేర్చుచు మొగంబున లేఁజెమరంకురింప, జం
కెననెఱిచూపుఁ జూచి పలికెం జలితాధరపల్లవాగ్రయై.

''ఈనయగారపుంబ్రియము లీపస లీమొగమిచ్చమాట లే
లా, నిను నమ్మియుండిన ఫలం బిదె తోడన కల్గె, నీకు నా
యానసుమీ ! ననుం జెనకి యాఁడిపెట్టిన, నవ్వువారలం
గాన, వెఱుంగునే పసులకాపరి భావజమర్మకర్మముల్.

ఇంకిటు నిన్ను నమ్మ నను నేమిటికిం గెరలించె ? దెంతయుం
బొంకముగాని యావలనిబొంకులు మాచవిగావు, రుక్మిణీ
పంకజపత్రనేత్రకును బ్రాణపదంబులుగాని వల్లవీ
కింకర ! చాలుఁజాలు నడకింపకు, నింపకు లేనికూరుముల్.

గట్టివచేతలుం బసలు గల్లదనంబులు నీవు పుట్టఁగాఁ
బుట్టిన, వెందులేనిపలుపోకలమాయలు నీకు వెన్నతోఁ
బెట్టినవౌ యెఱింగియును బేలతనంబున నిన్ను నమ్మి నా
గుట్టును దేజము న్మిగులఁ గోల్పడిపోయితి, నేమిసేయుదున్.

మునిపతి వచ్చి పూవొసఁగి మోదముతోడ భవత్ప్రియాంగన
న్వినుతియొనర్పఁగా వినినవీనుల మా చవిగానిమాటలన్
వినవలసెంగదా, యిపుడు నీ విట వచ్చుట పారిజాతవా
సనఁ బ్రకటించి నాకు నెకసక్కెము సేయనకాదె చెప్పుమా?

మానంబె తొడవు సతులకు,
మానమె ప్రాణాధికంబు, మాన మఖిలస
న్మానములకు మూలంబగు
మానరహితమయిన బ్రదుకు మానినికేలా?

తనదుకోడం(డలోనఁ బెద్దయుగ నన్ను
దేవకిదేవి మన్నించు, నీకు నాకుఁ
జనవులిచ్చుటఁజేసి, యాసాధ్విసేవ
సేయఁబోవంగ నా కింక సిగ్గుగాదె ?

ఉవిద యెవ్వతె నోఁచియున్నదో యీ శమం
    తకరత్న మింక నౌఁదల ధరింప?
ఈరైవతకశైలచారుకూటవిటంక
    కేలి కిం కెవ్వతె పాలుపడునొ?
ఎవ్వతె కబ్బునో ఈవసంతారామ
    కర్పూరకదళికాగారవసతి?
లీల నీమణిసౌధజాలకంబుల నిన్ను
    గూడి యెవ్వతె వార్ధి జూడఁగలదొ ?

అకట! నేఁ బెంపఁ బెరిఁగినశుకమయూర
శారికాబృంద మెవ్వతె జేరునొక్కొ?
నన్ను నాతోడిసవతులు నగకమున్న
పంత మలరంగ నిన్ను మెప్పింతుఁగాన.

నను నెవ్వతెగాఁ జూచితి?''
వని యంతర్బాష్పయగుచు నవనతముఖియై
ఘనతరగద్గదికాని
స్వనమున మఱి మాటలాడ శక్యముగామిన్.

ఈసునఁ బుట్టి డెందమున హెచ్చినశోకదవానలంబుచే
గాసిలి యేడ్చెఁ (బాణవిభుకట్టెదుటన్ లలితాంగి పంకజ

శ్రీసఖమైన మోముపయిఁ జేలచెఱంగిడి బాలపల్లవ
గ్రాసకషాయకంఠకలకంఠవధూకలకాకలీధ్వనిన్.

ఆరమణీలలామ మది నంటినకోపభరంబు నిల్పఁగా
నేరక నెవ్వగం బొగుల నీరజనాభుఁడు నిండుకౌఁగిటం
జేరిచి బుజ్జగించి, నునుజెక్కుల జాలుకొనంగజాఱు క
న్నీరు కరంబునం దుడిచి, నెయ్యముదియ్యము దోఁప నిట్లనున్:

"ఓలలితేంద్రనీలశకలోపమకైశిక ! యింతవంత నీ
కేల లతాంతమాత్రమున కేఁ గలుగన్ ? విను, నీకు దేవతా
కేళివనంబుఁ జొచ్చి, యనికిన్ బలసూదనుఁ డెత్తివచ్చినన్
దీలుపడంగఁ దోలి, యిటఁ దెచ్చెదఁ నిచ్చెదఁ బారిజాతమున్.

వామలోచన! నీకేళివనములోనఁ
జలువ వెదజల్లుచెంగల్వకొలనికెలన
సరసకర్పూరకదళికాతరులనడుమఁ
బెనటిచెట్టుగ నాటింతుఁ బెంపుగనుము."

అని పలుకు నంబుదశ్యా
మునిగర్జితమధురవాక్యముల సత్యామా
నిని నీపలతికవోలెం
గనుపట్టె సఖీమయూరికలు సెలరేగన్.

(పారిజాతాపహరణమునుండి)



కాళహస్తీశ్వరా!

ధూర్జటి

నీకున్ మాంసము వాంఛయేని కఱవా నీచేత లే ళ్ళుండఁగా
జోకైనట్టి కుఠార ముండ, ననలజ్యోతుండ, నీరుండఁగాఁ
బాకం బొప్ప ఘటించి, చేతిపునుకన్ భక్షింప, కాబోయచేఁ
జేకొం టెంగిలిమాంస మిట్లు దగునా! శ్రీకాళహస్తీశ్వరా!

పదునా ల్గేలె మహాయుగంబు లొక భూపాలుండు, చెల్లించె న
య్యుదయాస్తాచలసంధి నాజ్ఞ నొకఁ డాయుష్మంతుఁడై, వీరియ
భ్యుదయం బెవ్వరు చెప్పఁగా వినరొ? యల్పుల్మత్తులై యేల చ
చ్చెదరో రాజులమంచు నక్కటకటా శ్రీకాళహస్తీశ్వరా?

కాయల్గాచె వధూనఖాగ్రములచేఁ గాయంబు, వక్షోజముల్
రాయన్ రాపడె ఱొమ్ము, మన్మథవిహారక్లేశవిభ్రాంతిచేఁ
బ్రాయంబాయెను, బట్టకట్టెఁ దల, చెప్పన్ రోఁత సంసార మేఁ
జేయంజాల విరక్తుఁజేయఁగదవే శ్రీకాళహస్తీశ్వరా!

ఒకపూఁ టించుక కూడు తక్కువగునే నోర్వంగలేఁ, డెండ కో
పక నీడ న్వెదకున్, జలిం జడిసి కుంప ట్లెత్తికోఁజూచు, వా
నకు నిండ్లిండ్లును దూఱు నీతనువు, దీన న్వచ్చుసౌఖ్యంబు రో
సి కడాసింపరుగాక మర్త్యు లకటా శ్రీకాళహస్తీశ్వరా!

సంతోషించితిఁ జాలుఁజాలు రతిరాజద్వారసౌఖ్యంబులన్
శాంతింబొందితిఁ జాలుఁజాలు బహురాజద్వార సౌఖ్యంబులన్
శాంతింబొందెదఁ జూపు బ్రహ్మపదరాజద్వారసౌఖ్యంబు ని
శ్చింతన్ శాంతుఁడు నౌదు నీకరుణచే శ్రీకాళహస్తీశ్వరా !

(కాళహస్తీశ్వరశతకమునుండి)



విలుబుత్తూరు

శ్రీకృష్ణదేవరాయలు

శయపూజాంబుజముల్ ఘటిం దడఁబడన్, జన్దోయిలేఁగౌను పై
దయదప్పన్ బసపాడి, పాగడపుఁబాదం బొప్పఁ జెంగల్వడి
గ్గియనీ రచ్యుతమజ్జనార్థము కటిం గీలించి దివ్యప్రబం
ధయుగాస్యల్ ద్రవిడాంగనల్ నడుతు రుద్యానంపులోఁద్రోవలన్

కలయన్ నీలమయంపుఁ దల్లియొఱదాఁకం దేటనీ రొప్పు ర
ధ్యలకూపంబుల మీలఁ జూచి, వలభీవ్యాసంగితుంగద్రుశా
ఖలలో డాఁగి గుభాలనన్‌లకుముకుల్ క్రందై పడున్, లేచు ద్రుమ
చ్చలి, గేహేందిర ద్రావిడీపరిచితిన్ జెండాడుచందంబునన్,

వేవినమేడపై వలభివేణికఁ జంట వహించి విప్పఁగాఁ
బూవులు గోట మీటుతఱిఁ బోయెడు తేఁటులమ్రోఁత కామిశం
కావహమౌఁ గృతాభ్యసన లౌటను దంతపుమెట్లవెంబడి
జేవడి వీణె మీటుటలుఁ జిక్కెడలించుటలు న్సరింబడన్.

తలఁ బక్షచ్ఛటఁ గ్రుక్కి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర
స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకు లుషస్నాతప్రయాతద్విజా
వళిపిండీకృతశాటులన్ సవిఁ దదావాసంబుఁ జేర్పంగ రే
వుల డిగ్గన్, వెసఁబాఱువానిఁ గని నవ్వన్ శాలిగోప్యోఘముల్

గ్రీష్మము

నులివాడు నాఁచువల్పుల గొంతొగర్చి తేఁ
బొలవల్చుగాలి వేఁబోక యొదిఁగి

కడకు వెళ్ళఁగ నొక్కకడనుండి త్రొక్కుచు
నులుచలఁ జిఱుతగుల్లల నమలుచు
నెండ్రికా లిటికిన నెగసి యొక్కించుక
తొలఁగి శితత్రోటిఁ దూఁటి తినుచుఁ
దడియింకు నిలఁ జేమమడివోని తమ్మిగుం
పులను జీలుగల నెండలు గడపుచుఁ
దనరు బకపంక్తులకు జానుదఘ్నమయ్యెఁ
జెఱువుగమి, యుడుములన రేల్ దిరిగెఁ గుక్క-
వసికి బావులఁ బడుటకుఁ బసులయెరవు
టెఱలకు మొసళ్లు, మలుఁగుమీఁ న్బొఱియఁ దూఱె.
సెగ కుల్కు మఱుఁగు సొచ్చిన జవ్వనరవిజల
సరణి మల్లెలతోడి జడలు మెఱయ
వలిచన్నుకొమరు మ్రుచ్చిలిన దిమ్మనుతెఱం
గున ముంచు గరిగకాఁగుల మునుంగ
ధారలోఁ దోచు కన్దళుకులు వాసితో
త్పలపత్రపతనసంభ్రాంతి నొసఁగఁ
దెలిమోముపస మెచ్చి తలయూఁచు టెఱిఁగి మా
నక నవ్వునేర్పు డెందములఁ గరఁపఁ
దెఱవ లిటు నీరువోయు పందిరియ చేరి
యవలఁ గొఱగాక పిచ్చుగుంటై యనంగుఁ
డనువుగొనఁజొచ్చెఁ గల్లగు ట్టమర వారి
కధ్వగులు లాఁచి యిడు విడియముల పేర.
ఎసఁగు కట్టావిక్రియ నావి రెగయఁ బగటి
యెండయుడు కాఱకుండు భూమండలమునఁ

బొలిచె మాపటిపండువెన్నెల చకోర
పోతవితతికిఁ జాఁపట్టు వోసినట్టు.

పవలెల్ల దీర్ఘికాంబువు చల్లుపోరాట
 నలసి మృణాళికాజడ సులైన
బాహువుల్ తమదు కూర్పరముల కెదురుగా
 మలఁచి, మూఁపులఁ గరతలము లునిచి
ప్రాల్మాలి మిగుల నార్పమిఁ గమ్మక్రొమ్ముడిఁ
 దనిమొగ్గ విరవాదిదండ విరియ
ధౌతగంధామోదశీతల స్తనములు
 వాందఁ గౌఁగిళ్ళతోఁ బోరగిల్లి

నారికేళాసవపుఁదీపుటూరు పొలయ
పలిపె యొంటొల్లెతో నురఃస్థలులఁ గూర్కు
ప్రియల వేకువఁ దొడ లెచ్చరించి కలసి
రెలమి ధన్యులు దఱపివెన్నెలబయళ్ళ,

తరుణుల్ దల్లియొఱ న్గుచంబు లునుపం దచ్చైత్యముల్ దీమురై
పెరరేఁపం జనుదెంచెఁగాక రవిదీప్తిం గ్రుంకి పాతాళగ
హ్వారముం దూఱినవారి నీయదుకుఁ ద్రాళ్ళా తెచ్చునా, దీర్ఘత
చ్ఛిరకృష్టిం గనునట్టిశైత్య మలరించెన్ నూఁతులం దత్తఱిన్.

తారుణ్యాతిగచూతనూత్న ఫలయుక్తైలాభిఘారస్వన
ద్ధారాధూపితశుష్యదంబుహృతసూత్స్యచ్ఛేదపాకోద్గతో
ద్గారంపుంగన రార్చు భోగులకు సంధ్యావేళలం గేలికాం
తారాభ్యంతరవాలుకాస్థితహిమాంతర్నారికేళాంబువుల్.

తోఁటఁ బగ లుండి మల్లెలు దుఱిమి, కావు
లమర మాపైన నిక్షుయంత్రముల కొయ్యఁ
జేరుప్రజ వొల్చె భావివృష్టికిని గ్రుడ్డు
తో మధురిమేచ్చ డిగు నెఱ్ఱజీమ లనఁగ.



శక్తిమతీకోలాహలము

రామరాజభూషణుడు

రత్నభూషితయైన యారాజధాని
యతుల సురుతరముక్తాఫలాభిరామ
దామకం బనఁజాలి నిద్దంపుఁజవులఁ
బరగు శక్తిమతీనామభవ్యతటిని.

జీవన మెల్ల సత్కవినిషేవిత, మాశయ మెల్ల సచ్ఛతా
పావనతాగభీరతల పట్టు, ప్రచారము లెల్ల విశ్వధా
త్రీవలయత్రికాలఫలదేశికముల్, నవకంబు లెల్ల ము
క్తావళివిభ్రమాస్పదము లా నదిపెంపు నుతింప శక్యమే.

అనుకూలఖేలనాయత్తజీవనమైత్రి
నడరి నర్మద బోటియై భజింప
నూర్మికాకంకణద్యుతికలాపము దోఁప
బాహుద కైదండఁ బరిఢవింప
సముదితారావసంభ్రమసాంద్రయై సారె
సారె వేత్రవతి హెచ్చరిక దెల్ప
గంభీరరసగుంభసంభృతప్రౌఢిమ
తో సరస్వతి బల్కుఁదోడుగాఁగఁ

గులములోఁ బెద్దయు నమూల్యగుణమణిప్ర
కాండపరిపూర్ణయునుగాన గారవమున

నఖిలనదులును దనుగొల్వ ననుదినంబు
నలువకొలువున కేగు నన్నది యతీంద్ర.

ఆలీల నమ్మహానది
నాళీకజుఁ గొల్చి యొక్కనాఁడు ప్రియాళీ
కేళీసంభ్రమవినుతమ
రాళీగతు లడర మరలిరా నొకచోటన్.

సుమనోధివాసభాసురశిఖోన్నతివాఁడు
ఘనసారతిలకవాసనలవాఁడు
ఘనసంకుమదసాంద్రగండభాగమువాఁడు
నవపద్మరాగదంతములవాఁడు
కలితోపకంఠనక్షత్రమాలికవాఁడు
హరిచందనచ్ఛాయ నమరువాఁడు
తపనీయమేఖలాధాళధళ్యమువాఁడు
మణిపాదవలయధామంబువాఁడ

నర్ఘ్యరత్నావళీవిచిత్రాంబరాభి
రామశృంగారములవాఁడు, హైమగర్భ
గేహమున కేగువాఁడు, కోలాహలాఖ్యుఁ
డొక ధరాధీశుఁ డెదురయ్యె నువిద కపుడు.

అనుపమభాగ్యశాలి కచలాధిపమౌళికిఁ బుత్రుఁడై, జగ
జ్జనని కనుంగుదమ్ముఁడయి, శంకరు ముద్దుమఱందికుఱ్ఱయై
మను తన భాగధేయమహిమంబున మిన్నులు ముట్టివచ్చు ధ
న్యుని నతనిన్ భజించి నదియున్ వినయంబున నోరయైచసన్.

బాలకూర్మవిలాసపదములు కాంతరం
భాప్రతిబింబోరుభవ్యరుచులు
సరససైకతసారజఘనసౌభాగ్యంబు
నతనాభిరూపవనభ్రమంబు
బెడఁగారు దవుల యొప్పిదమును నామీఁదఁ
జనుజక్కవల నిక్కు చక్కదనము
కమలకోమలముఖకామనీయకము ను
త్పలమంజులాలోకవిలసనంబు

ఘనఘటానీలవేణియుఁ గల తరంగి
ణీరమణి నిత్యనిర్మలాకారకాంతి
ధార ధారున నెదిరినంతనె నగేంద్రు
గాఢతరధైర్య మువ్వెత్తుగా హరించె...

అలఘుశ్రీనిధి యానగేంద్రతనయుం డాసైకతశ్రోణియొ
ప్పులు ఔప్పార్పక చూచి చన్న మొదలుం బొంగారి పైపై దసం
బులు జృంభించు, భ్రమించునాశయము, కూర్ముల్మించ దీపించును
త్కలికాచాపలము ల్మనోనిబిడచింతాతన్మయత్వంబునన్.

అకటకట మంచుమలపట్టి యతనుతాప
వహ్నిపాలయ్యె ఝురబాష్పవారి యగుచు
నిత్యశుక్తిమతీధ్యాననిశ్చలాత్మఁ
డగుచు నంచితగహనరోమాంచుఁ డగుచు.

కులగిరిరాజనందనుఁడు కూరిమి నా భువనాభినందితం
దలఁపఁ, దలంపులోపలనె దర్పక కేతనవల్గనంబు, లం

చలయెలగోలు నంచల విశాలశిలీముఖతాడనంబు, లు
త్పలదళమండలాగ్రములు పైకొను నెట్టివొ తత్ప్రభావముల్...

రుచిరాజితమణిభూషా
రుచిరాజి వెలుంగ దివ్యరూపోజ్వలుఁడై
యచలాధీశ్వరుఁ డొకనాఁ
డచలామణిహార మగు మహానదిఁ జేరెన్.

చేరన్‌రా, నదియుం దటోద్గతఝరీసీమాదికోదగ్రసం
చారశ్రీ నెదురేగి, యూర్మిమయహ స్తన్య స్తరాజీవరా
జీరాజన్మణిభాజనంబుల రజశ్శీగంధకింజల్క రే
ఖార క్తాక్షతము ల్వహించి వరుసం గావించెఁ బూజావిధుల్.

గిరియును దదంతికోత్తుంగతరచిరత్న
రత్నతటపీఠి జెందె గౌరవమువఱల
వరలితవాహినీవై భవంబుఁ గాంచి
కాంచె బహుపద్మనిధిలాభకౌతుకంబు.

అప్పు డప్పుణ్యతరంగిణి నగాగ్రణితో నిట్లనియె:

''అతులశై వలవతీశతము లీనెడు మీకు
నాయిచ్చు విమలార్ఘ్యతోయ మెంత
ప్రాలేయనిలయసంభవము గాంచిన మీకుఁ
బన్నీట నొనరించు పాద్య మెంత
సరసమందారమంజరుల రంజిలు మీకుఁ
బెనచి పూదండ లర్పించు టెంత
గోరత్నదోహనమగులక్ష్మిగల మీకు
నుపదగా మణివర్గ మొసఁగు టెంత

అనఘ! యెవ్వారలైనఁ గొండంతవారి
కవనిఁ గొండంతపూజ సేయంగఁగలరె ?
భక్తి నే నిచ్చు నీపుష్పపత్రతోయ
మాత్రములు గైకొనుటెకాక గోత్రతిలక,''

అన విని గట్టురాకొమరుఁ డాననగహ్వరరోచమాననూ
తనతరదంతహీరరుచిధారలు వెల్వడ నొక్కలేఁతన
వ్వు నగి "నిజంబ పల్కితి వవున్ భువనాశయసన్నివేశవే
దిని సరసాగ్రగణ్యవుగదే'' యని యన్నదిఁబల్కె వెంబడిన్:
''పరమామోదముతో నశేషతటినీపద్మాస్యలం గూడి నీ
వరవిందోద్భవుఁ గొల్చి యేగుతఱి నీయచ్ఛాచ్ఛభావంబు, నీ
సరసత్వంబును, నీగభీరతయు, నీసర్వంకషప్రౌఢి, నీ
పరిపూర్ణత్వముఁగాంచి మెచ్చి మదిలో భావింతు నిన్నెప్పుడున్.
నావలనం బ్రియం బెఱిగి, న న్నొకమాఱును బల్కరింప కీ
వే వెస నోరఁజేసికొని యేగుదుగాని సరిల్లలామ! ని
న్నేవగఁ జేరవత్తు, మది కింపగు నీదునవోదితామృతం
బేవగఁ గ్రోలఁగాంతు నని యే నెపుడుం దలపోయుచుండుదున్.
చెప్పెడిదేమి నాకుఁగల జీవన మంతయు నీకుఁ గూర్చి, యె
ల్లప్పుడు నిన్నుఁ బాయక ప్రియాచరణం బొనరింపనేర్తు, నీ
చొప్పున కీవు నియ్యకొని చొక్కపుజక్కవగుబ్బలాఁడి! మేల్
దప్పక యంతరంగమునఁ దారిచి నన్ను నదీనుజేయవే.''
అన విని నగరాజు ఘన
ధ్వనిగరిమకుఁ గలఁగి ముకుళితకరాంబుజయై
వినయము నయంబు భయమును
మనమునఁ బెనగొనఁగ శుక్తిమతి యిట్లనియెన్:

‘‘నిలువెల్ల నీచాతినీచోపసరణంబు
ప్రకృతియెల్లను జాడ్యపరిణతంబు
పెంపెల్ల నియతగాంభీర్యమానవిహీన
మంతరంబెల్లఁ బంకావిలంబు
జీవనం బెల్ల నంచితబుద్బుదప్రాయ
ముదయ మెల్లను దుర్దినోన్ముఖంబు
గతు లెల్ల కుటిలప్రకారకారణము లు
త్సేకంబు లెల్ల భంగాకులములు

నిలుకడ హుళిక్కి, తావులు పొలసువల్చు
నిట్టి మాబోంట్లతోఁ జెల్మి యెట్లు పొసఁగు?
నచలితోత్తుంగధైర్యన, కలుషమతికి
ననఘగతికి, నభంగశీలునకు నీకు’’...

నా విని గట్టుఱేఁడు వదనంబున విన్నదనంబు దోఁప ‘‘నో
శైవలినీశిఖామణి! నిజంబు భవత్కమనీయ కాంతిధా
రావళిలో మునింగితి దయామతిఁ బ్రోవక సుళ్లబెట్టెదో,
నీ విఁక గ్రుచ్చియెత్తి ఘననిర్వృతిదెప్పలఁదేల్చెదో?’’ యనన్

వెలవెలఁబాఱి శుక్తిమతి వెండియుఁ గొండలఱేనిఁ బల్కు ‘‘న
గ్గలమగు పంచసాయకవికారమునన్ జనిగౌరవోన్నతుల్
దలఁపవుగాని మాదృశజడస్థితిఁ దెప్పలఁ దేలుచున్న మీ
కులగిరికోటిలోఁ గడు లఘుత్వముగాదె తలంచిచూడుమా.

మతి గ్రీడారతి కల్గెనేని సకలక్ష్మాపుణ్య దేశాళిఁ గాం
చి,తపస్ఫూర్తిమెయింగృశించి వనరాళిం జెందు మాబోంట్ల సు
ద్ధతిచేఁ గ్రమ్మఁగనేల ? నీకుఁ గఱవే తారుణ్యలావణ్యజృం
భితరంభాదినిలింపభామ ’’ లన భూభృన్మౌళి రాగాంధుఁడై,

''అతనుభూతి ఘటింపదయ్యెనే చదలేరు
సికదాల్చు నింధానచిత్రకునకు
వరవంశవైఖరి వదలెనే రవిసుతా
పతియైన దైతేయభంజనునకు
వసులాభసంపత్తి మసలెనే జాహ్నవిం
జేకొన్న శంతనుక్షితిపమణికిఁ
గమలోదయఖ్యాతి దెమలెనే నానాన
దీకాంతుఁడైన రత్నాకరునకు

వారి కేలాఘవము వచ్చె ! వనిత యెంత
మాఱుమసలెదు, వట్టినేమములు చాలు,
నేలు న''న్నని సతికమలాళిపట్టు
ప్రబలతర దీర్ఘభుజశాఖఁ బట్టుటయును.

వేణి చలింప, గంపితనవీనమృణాలభుజాగ్రకంకణ
శ్రేణి నటింప, లోలశఫరీనిబిరీసకటాక్షకాంతి వి
న్నాణముజూప, హంసకగణక్వణనంబులు మీఱ, సైకత
శ్రోణి వివర్తితాబ్జముఖశోభితయై కడు సంభ్రమించినన్.

నిలువెల్ల న్నిరపాయశంబరమయోన్మేషంబునం బొంగురాఁ
గల కూలంకషగాఢగర్వనిధులం గాంతానుకూల్యంబుచేఁ
దలమే నిల్పఁగఁ బ్రాతికూల్యపరుషోద్యత్ప్రౌఢిగా కంచు న
య్యలఘుం డాస్యము జేవురింప నిజరూపాటోపసంరంభియై.

...తమిగొలుపు వలపునం...బొడముడగ్గుత్తికఁ దడఁబడు నుడు
వులవడువునమొరయు సరయచంక్రమణచలదుపలఫలకమిళదలఘుతర
ఘుమఘుమార్భటి నికటతటవిటపివిటపచ్ఛటారటదపార కీర

కిన్నరమిధునాదులం జదల మెదలం జేయుచు,... అబ్బోటిపదం బులఁ బడినవడువున నడుగున వ్రాలి, యడ్డగించి, యలముకొని, చెంగల్వతావులు చెదర వేణి దెమలించుచు విశదాంశుకాంతస్థితి దొర లంగ నతివిపులపులినజఘనారోహంబుల నుత్పలపత్రంబులు నెఱపుచుం దనివిలేక...అమ్మొద్దరాలి నిరోధించు సమయంబున.

(వసుచరిత్రమునుండి)



కందుక క్రీడ

పింగళి సూరన

ద్వారకానగరబాహ్యప్రదేశంబున వాహ్యాళివిహారసారస్యంబునఁ దగిలియున్న ప్రద్యుమ్నుండు,

తన హృదయంబు వెంబడిన తప్పక ఘోటక మంతనంతనే
పనుపడ నిల్చి, ముందటికిఁ బాఱి, కెలంకులకుం దొలంగి, తా
వెనుకకు నేగుదెంచి, కడువేడ్క యొనర్పఁగ బంతియాడ నె
మ్మిని గనకంపుఁగోల నడిమింటనె త్రిమ్మరఁ దారికొట్టుచున్.

ఎగురగవైచి కొట్టు టది యెంత భరంబని బంతి యగ్రగా
మిగ వడిఁ బాఱవైచి, పుడమిం బడనీకయె దాని మీఱి చి
త్రగతి హయంబు దోలుచును గ్రమ్మఱ మీఁదికిఁ గొట్టియాడె విం
తగఁ దనచేతిరత్నమయదండము కాంతులు గాడిపాఱఁగన్.

వెండియు మండలగతులఁ దురంగంబుఁ దోలి యాడె నప్పుడు,

తొలుదొల్త నయ్యేకతురగంబు మండల
గతిచారియగుచు నిక్కంబ తోఁచె
నావెనుకను సరూపాశ్వాలి చెదరక
చక్రాకృతిని బర్వుసరణి తోఁచె
నంతట ననతిస్ఫుటావయవంబుగా
నెనసి యేకాంగవేష్టనత తోఁచెఁ
దుదఁ దద్విభూషణద్యుతిరాజిమాత్రంబు
కొఱవిత్రిప్పినరీతి మెఱసి తోఁచె

నంతకంతకు గతివేగ మగ్గలింప
రాఁగ 'వాగె యెచ్చరిక పరాకు జియ్యా!'
యను జనులు ఱిచ్చవడి తమపని మఱవఁగఁ
బరగు నమ్మేటినెఱరౌతు ప్రౌఢికతన.

నానావీధిగతిప్రభేదవిహృతిన్ సంతృప్తుఁడై కంతుఁ డిం
పూనన్ వాగె గుడించినన్, బురుషకప్రోన్నమ్రపూర్వాంగమై
కానంగాఁబడియెన్ మరుజ్జవన మాగంధర్వ మర్కాశ్వసం
తాన స్పర్ధను మిన్ను ప్రాఁకెడుక్రియన్ దా నెంతయుం జూడ్కికిన్

సముపలాలనయుతస్కంధాంతికాస్ఫాల
దమితతేజోమహౌద్ధత్యకంబు
దంతాళికానియంత్రణసమున్నామితా
కుంచితగ్రీవాసమంచితంబు
దందన్యమానశబ్దాయమానఖలీన
కషణజర్జరితసృక్వద్వయంబు
ఘనఘర్మడిండీరఖండపాండురితప
ల్యయనవర్థోగ్రిభయప్రాంతకంబు

నగు హయము డిగ్గెఁ బ్రద్యుమ్నుఁ డంకవన్నె
యొకటి సాహిణి యవ్వల నూఁది పట్టఁ
దనయనుఁగుచెలికాఁడు కైదండ నొసఁగఁ
బ్రజ సురాళించి మణులు వస్త్రములు వైవ.

(ప్రభావతీ ప్రద్యుమ్నమునుండి)



చిలుక విష్ణుసాయుజ్యమందుట
తెనాలి రామకృష్ణుడు

శుక మొకటి చంచుజితకిం
శుకమై, హరిహయశరాసనురుచిరవపుర౦
శుకమై, కుసుమాకరకిం
శుక మానందమున నందసుతుగుడిఁ బెరుఁగున్.

అలమి త్రిలోకముల్ గెలుచున త్తఱిఁ దేరువహించు తోడిచి
ల్కలు దగదొట్టి ముందఱికి లాగకయుండినఁ, దాన తద్భరం
బెలమి వహింపమెచ్చి మరుఁడిచ్చు మణీమయమాలికాత్రయిన్
గళమునఁ దాల్చుఁ జిత్రశుకనాథుఁడు రేఖలపేర నిచ్చలున్.

కీర మది యొక్క హరిపరి
చారిక చేరిక వసించుఁ జదివింపఁగ మే
పారసి యొసఁగ, భవనమా
ర్జారాదులవలనఁ దన్ను రక్షింపంగన్.

దేవాలయమునఁ గొన్ని, ని
జావాసమునందుఁ గొన్ని యహములు దగఁ బై
చే వదలక పాటించుచుఁ
బూవుంబలెఁ బువ్వుఁబోఁడి పులుఁగుం బ్రోచున్.

పసుపార్పుం దడియొత్తు నెంత సెకఁగంపం బాఁగి మైదువ్వు మున్
పసయున్ వెన్నయుమేపు, మేపు నొసఁగున్, వల్లించు శ్రీరామనా

మసుధామాధురి సాధురీతిఁ గుచకుంభస్థాయిగాఁ జేయుచున్
బిసపుష్పప్రియవాసరాగమములన్ బింబోష్ఠి రాచిల్కకున్.

కనకమణిపంజరంబుల సునిచియునిచి
చక్కెరయు నుక్కెఱయు సారెఁ గ్రుక్కి క్రుక్కి
ముఱపుఁబలుకులు పలుమాఱు గఱపి కఱపి
కలికి చిలుకలకొలికి రాచిలుకఁ బెనుచు.

కలహంసోపమయానఁ జక్రకుచఁ బ్రేంఖత్కంజరీటాక్షిఁ గో
కిలసారస్వర బర్హిబర్హ చికురం గీరప్రియాలాపఁ దా
య్యాలిఁ జాలన్ మరగెన్ శుకం బది గరీయఃప్రేమగావించుచున్
బులుఁగుంబొందున నందిపొందినగతిన్ బొత్తొత్తులన్ హత్తుచున్

ఆశుకద్విజరాజున కంతఁ గొంత
కాల మరుగంగ నొకనాఁడు కలిగె బంధ
మోక్ష మాకస్మికంబ, నిర్ముక్తికలిమి
యాశుకద్విజరాజున కద్భుతంబె ?

జనియించెనొక్కొ పచ్చనిమొల్కయనుబుద్ధి
గ్రుచ్చిన పచ్చలకొమరువలన
సమకూరెనొక్కొ దాడిమఫలోద్భవబీజ
మతి పద్మరాగసామగ్రివలనఁ
బొడకట్టెనొక్కొ జంబుఫలంబులను మనో
భ్రమ మింద్రనీలవిభ్రమమువలనఁ
దోతెంచెనొక్కొ మాధూకపుష్పములను
నాస హుర్మంజిముత్యములవలన

దాసి యిటువెట్టి పసుపాడఁ దలగిచనుడు
బరణిఁమూకుట నెలకొన్న బన్నసరముఁ
గఱచికొనిపోయెఁ జిల్క, ప్రగల్భవిటుఁడు
బాలికామానసము గొనుపగిది నపుడు.

బారాదిసొమ్ము లుండఁగ
హారమునే కొనుచుఁ జనియె నండజము ప్రియం
బారఁగ, ఫలకాముకులగు
వారలు గుణవత్ప్రసక్తి వదలవిడుతురే ?

ఆధవళకిరణముఖికి న
సాధుశుకాచరణ మపు డసహ్యంబయ్యెన్,
గోధుక్కృతిసతికి మనో
బాధకమగు కృష్ణధూర్తబాల్యముఁబోలెన్.

కటిఁ జేలార్ధము చుట్టి, చిక్కనది వేగం జుట్టి పాలిండ్లమీఁ
దట సంధించుచు, నార్ద్రదేహలత మాద్యద్వర్షధారావల
త్తటిదాకారముఁజూపఁ, దోపికొనుచున్ ధమ్మిల్లబంధంబు ముం
గిటికిన్ సుస్తని వచ్చె గోస్తనహరత్కీరగ్రహవ్యగ్రయై.

వర్షధారావశేషాన్వవాయయుక్తి
వాయువశమునఁ దెరలు మువ్వన్నెవిల్లు
వేడ్క వెన్నాడు శశివోలె వెలఁది చాప
లమున సర మాహరించు కీరముఁ దవులుచు.

గుహమాతృస్ఫటికాక్షసూత్రము సితేక్షుచ్ఛేదగుచ్ఛచ్ఛటా
స్పృహగైకొన్నశుకంబొ, యేమఱుతటిన్ జీరాడుపూవాఁగెతో

బహిరుడ్డీనత నొడ్డి నిల్చు రతిరాట్పట్టాశ్వమో నాఁగ న
మ్మహిళావిభ్రమకీర మొప్పు ముఖసీమాగామిముక్తాళియై.

ఈచందంబునఁ గందర్పస్యందనంబు వినిందితుండన మందమంద ప్రచారంబును, నవివేకియన శిథిలీకృత స్వపక్షంబును, నున్మత్తపోలికం జంచుచుంబిలలంతికావ్యాజంబున లాలఁ గ్రక్కుచు,... శశాంకశిలాసౌధవిటంకంబులను నుంకువగొన్నతటి శరన్నీరద వశంవదంబగు సునాశీర శరాసనశకలంబన మెలంగుచు, నంతరిక్ష మహోపక్షంబునకు నక్షామచంచూపుట ప్రవాళఖండ ప్రఖ్యాహిండ నంబునం దొరలి సఫలవిటపలక్ష్మి నావహించుచుఁ, బ్రమాద విగళితంబగు నగవిరోధికొలువువీవన యచ్చరల పచ్చలకడియంబు వడువున నిరాలంబనస్థలంబునఁ బలుమఱు చక్రచంక్రమణ చమత్కారంబుఁ జూపుచు,...అందంద జాతిపులుఁగులు మనుజగంధ ధురంధరం బగుటకు జగడంబు దిగిచినం గినిసి విస్ఫురతనూరహ దంతురకపోలాంతరంబును, విఘూర్ణన వికృత వీక్షణంబును నైక్షణంబు మణివలయ వలయితంబగు రతియువతి ముంజేతిరీతిం జెలువడరు మెడ నిగిడించి, మగుడంబడి కాకుప్రకార వికారస్వరంబుగ వాని నిరాకరించుచు, నప్పఱచుఁ జిలుక కలిగినయదివోలె నయ్యన్ను వెన్నాడం, బోటికత్తియ లుత్తుంగకుచోత్సంగ సంగత కురంగలాంఛన కళావలోకనంబున ముసిముసినగవు లొలయ "గోరువంక కానవచ్చెం గాని కీరంబు దూరంబయ్యెఁగదే" యని గర్వోక్తి వైదర్భిం గూడి యాడుచుం బాడుచుం, బంజరంబును జిలుకచాలుతెరయును జేరికచేసి యెలయింప నలయించుచు, నడిచెక్కు గ్రిక్కిరించుచు నొక్కయెడం గాలువొడిచి, ముక్కున నక్కంతహారతరళంబు నొక్కుచు, "జిక్కెం జిక్కె, నిక్కడ నిక్కడ, నక్కయక్క!" యని చేటికానికరంబు

పొలసినఁ బులుఁ గెఱింగి, మెఱుంగు మెఱసి తొలంగిన తెఱంగునఁ బోవంబోవ దూరంబగుచునుండు నెండమావులమాడ్కి, ప్రచుర రయంబున ఖచరపుర ప్రాసాదంబులు మోవం బూఁపున నెగసి, తిరిగి పెఱ తెరువునం బఱతెంచి, పాండురంగాయతనంబు మధ్య రంగంబు చొచ్చి, యచ్చటఁ దన యిచ్చ నుండుదడియంబుపై వ్రాల; నిచ్చట.

మదఘూర్ణదురుసంకుమదమలీమసకుచ
ద్వీపమహోద్ధతిఁ గౌనుదీఁగ నులియ
ఘనసారపుండ్రకగ్లౌబింబనికటఘ
ర్మహిమాప్తి మోముదామర చలింప
నాసికానూత్నగంధఫలి యూరుపుఁదావి
నధరదళతపదమత్తాళి విరియఁ
గింకిణీక్వణనశంకితగర్జితత్రస్త
కాంచిచంచలగతి యంచ జడియ

బంధనిర్ముక్తశుకసక్తభావయగుచు
నల పరాశరసుతుచంద మధిగమించు
మించునననబోఁడిచందంబు మేలుకనిన
వాఁడు తలపోయుకలలోనివార్త యయ్యె.

కక్కసపు వంకగోరులఁ ద్రొక్కిత్రొక్కి
కఱకుముక్కున నందంద కఱచికఱచి
పూస యొకటియుఁ బోఁగునఁ బొందనీక
చెరిపె ముత్యాలపేరు విచ్చికపుఁబులుఁగు.

బహువిధరచనోజ్జ్వలమగు
మహిళామణి మణిసరంబు మణు లన్నియు న
య్యహిశయనుసదనశరధికి
నహీనరత్నాకరత్వ మనుసంధించెన్.

శుకమున కొదవె నయత్న
ప్రకటితమణిరంగవల్లిషరిగల్పనకో
రకితసుకృతానుకృతి, దా
నికి మెచ్చెన్ బౌండరీకనిలయుం డాత్మన్.

(పాండురంగ మాహాత్మ్యమునుండి)



అశోకవనములో జానకి

ఆతుకూరి మొల్ల

పతిఁ బాసినట్టి యాపదకంటెఁ బలుమాఱు
    వివిధమాయలచేత వేఁగివేఁగి
వీరదానవకోటివికృత వేషంబులు
    కనుఁగొని చిత్తంబు క్రాఁగిక్రాఁగి
తన దిక్కు లేమికై తల్లడిల్లుచు నాత్మ
    లోపల మిక్కిలి లోఁగిలోఁగి
కర్ణకఠోరంబుగా నాడుమాటలఁ
    దొరగెడు కన్నీట దోఁగితోఁగి

రాముఁ దలఁచుకొంచు, రామునిఁ బేర్కొంచు
రామ! రామ! యనుచు రమణి వలుక
కపివరుండు సూచి, కామినీరత్నంబు
సీత యనుచుఁ బొంగెఁ జిత్తమందు.

నిడుదపెన్నెఱివేణి జడలుగా సవరించి
    మలినజీర్ణాంబరం బొలియఁగట్టి
భూమీరజంబు విభూతిపూఁతగఁ బూసి
    తనదివ్యమూర్తి జిత్తమున నిలిపి
నిరశనస్థితితోడ నిలిచి భూశయ్యను
    బవళించి నిదుర యేర్పడఁగ విడిచి
తారకబ్రహ్మమంత్రమ్ముఁ బఠింపుచుఁ
    గఠినరాక్షసదుర్మృగములలోన

అహితలంకామహాద్వీపగహనసీమ
తపము సేయుచునున్నాను దన్నుగూర్చి
నాకుఁ బ్రత్యక్షమగుమని నాథునకును
విన్నవింపుము సత్త్వసంపన్న ! నీవు.

(రామాయణమునుండి)

సుభద్రార్జునులు

చేమకూర వేంకటకవి

అన్నరుండంత శ్రీకృష్ణుఁ డున్ననగరి
సరసఁ గన్నియరాణివాసమున నమరు
కేళివనిలోన నవరత్నకీలితంపు
బవిరిటాకుల చిన్ని యుప్పరిగలోన.

మృగనాభితిలకంబు బుగబుగ ల్గల లలా
    టముపై మృదూర్ధ్వపుండ్రంబు దీర్చి
తపనీయకౌశేయధారేయ మగు కటీ
    రమునఁ గాషాయవస్త్రము ధరించి
శరణాగతాభయసందాయకంబైన
    దక్షిణపాణిఁ ద్రిదండ మూని
రణచండకోదండగుణకిణాంకంబైన
    డాకేల నునుగమండలువు దాల్చి

యుండెఁబో శాంతరస మెల్ల నుట్టిపడఁగ
నంగనలపొందు రోసి సన్యాసియగుట
కద యుచిత మెందు, నానవమదనమూర్తి
యంగనామణిఁ గోరి సన్యాసియయ్యె.

చేసె జప మతఁడు కడు వి
శ్వాసము చెలి చూపుబేడిసలపై నిగుడన్

చేసినయది జపమున్ మఱి
వేసినయది గాలమనుట వృథగాకుండన్.

వెలఁది కెమ్మోవిఁ గని జపావృత్తి మఱచెఁ
దరుణిలేఁగౌను గని హరిస్మరణ మఱచెఁ
గడమయననేల వేస మొక్కటియ తక్క
మఱచె నన్నియు నా కృత్రిమత్రిదండి.

ఈరీతి నుండ నొకనాఁ
డా రాజకుమారి యతని కాహార మిడన్
జేరెఁ దదారామంబునఁ
గూరిమినెచ్చెలులు వెంటఁ గొనితేరంగన్...

రమణిమొయ్యారములపైఁ బలాకుచేతఁ
జవి యెఱుంగఁడు, వడ్డించునవి యెఱుఁగఁడు
భోజనముచేసి లేచె నారాజసుతుఁడు
తృప్తి యేరీతి నుండెనో తెలియరాదు.

నిగనిగని చంద్రకాంతపు
జగతిపయిం గూరుచుండ, జవ్వని వెనుకన్
బగడపుఁగంబపుఁజాటున
మొగ మించుక గానిపింప మురువు నటింపన్.

"మీ రింద్రప్రస్థము గని
నారా? పాండవులఁ జూచినారా ? సుఖులై
వా రందఱు నొకచో ను
న్నారా ? వీరాగ్రగణ్యు నరు నెఱుఁగుదురా ?

తడవాయె భూప్రదక్షిణ
మడరింపఁగఁబోయి యా మహామహుఁడు, పదం
పడి పుణ్యస్థలముల నె
న్నఁడు మీ రందందు నరుగ నరుఁ గానరుగా ?''

అన విని ''సమస్తభూములు
గనినారము, తీర్థయాత్ర గావించునెడన్
గనుఁగొనినారము సంక్రం
దననందను''ననిన, ముద మెదం జెన్నొందన్,

''ఎచ్చటఁ గంటిరో విజయునిక్కవ నిక్కవమౌనె, రాఁడుగా
యిచ్చటి''కంచుఁ గోరికలు నీరికలెత్త రసోక్తిఁ బల్కఁగా
నాచ్చెములేని బీర మెద నూరఁగ నూఱఁగసాగె వెంటనే
పచ్చనివింటివాఁ డపుడు పైదలిపైఁ దలిరాకుగైదువుల్.

కోమలి యీగతిన్ మది దగుల్పడఁ బల్కిన నవ్వి, ''నిర్జర
గ్రామణిసూను మీరెచటఁ గంటిరొ యంటివి, కన్నమాత్రమే
యేమనిచెప్పవచ్చు, నొక యించుక భేదములేక యాయనే
మేమయి యున్నవారముసుమీ, వికచాంబుజపత్రలోచనా !

వేమాఱు గ్రుచ్చిగ్రు చ్చిపు
డేమీ వడిగెదవు, మన సొకించుక నీ కా
భూమీశుమీఁదఁ గలదో
తామరసదళాక్షి ! నాకు దాఁపక చెపుమా ?

ఆ కవ్వడి యతివేషము
జేకొనియున్నాఁడు, నీకుఁ జెంతనె యెన్నా

శ్చో కలదు వచ్చి, యింకను
నీ కీలక మించుకైన నీ వెఱుఁగవుగా ?

నీకై తపంబుఁజేసెద
నీకైవడి డాఁపనేల, యే నర్జునుఁడన్
లోకోత్తరశుభలగ్నం
బో కోమలి ! నేఁడు కోర్కెలొనఁగూర్పఁగదే !"

నావిని యావినీలకచ నవ్వుమొగం బటుకొంత వంచి, యెం
తే వెఱ నివ్వెఱన్ మునిఁగి, యీతనిఁ బార్థునిగా నొకింత మున్
భావమునం దలంచియును నమ్మక యమ్మకచెల్ల యూరకే
సేవలొనర్చుచుంటి నని సిగ్గున దిగ్గున లేచిపోవఁగన్.

"ఏల పోయెదు ? నిలునిలు బాల !" యనుచుఁ
జిఱునగవు నెమ్మొగమ్మునఁ జెంగలింపఁ
దమకమున లేచి, మరులేచి, తత్కరాంబు
జం బొడిసిపట్టె చేసాఁచి సవ్యసాచి.

ఆరీతిం జేపట్టి వ
రారోహన్ వేదిమీఁదికై రాఁదిగువన్
దూరము వెస నరుగక యొ
య్యారముగా నమ్రవదనయై యుండంగన్,

"చిలుకలకొలి కిది నాతోఁ
బలుకంగాఁ గొంతసిగ్గుపడియెడు ముంజే
చిలుకా ! నీతోనైనను
బలుకంగారాదె, పలుకు బంగారటవే ?"

అని కేళిశుకముఁ బలికిన
మన మలరం గలికి వలికె మాటలతియ్యం
దన మింతింతనగూడని
తన యధరసుధాసమగ్రతం దెలుపంగన్.

"మేరలా యివి మీయంతవారలకును?
బెద్ద లున్నా, రెఱిఁగి వారె పెండ్లి సేయఁ
గలరు, వేగిరపా టింత వలదటంచు
విన్నపముసేయరాదె యో చిన్ని చిలుక!"

అని యుచితరీతి వెలయఁగ నాడు నాతి
రసికముద్రకు మిగుల మానసము గరఁగఁ
బైపయిం బ్రేమ మగ్గలంబై పెరుంగ
నవ్వధూటి నొడంబడ నను గిరీటి.

"మీవా రెఱుఁగుట యెన్నఁడు?
కావించుట యెన్నఁ డింకఁ గల్యాణంబున్?
నీవేల జంపు నడపెదు
రావే! మారాడ కిందు రాకేందుముఖీ!

నేఁడు గాదుగదే ప్రేమ నీకునాకు
నాటియున్నది మదిఁ బిన్ననాఁటినుండి
ఇటుల నేకాంతసమయ మెన్నఁటికి దొరకు
నేల తప్పించుకొనియెదవే లతాంగి!"


అని యనేక ప్రకారంబుల మనోనురాగంబు తేటపడంబల్కినఁ, జిఱుచెమట గ్రమ్మ మొగంబు మకరందబిందుకందళితారవిందంబు చందంబునఁ దనర, నొక్కింత జాఱుపయ్యంట జక్కంజేర్చుచు,

నొక్కింత వదలువేనలి నలరింపుచుఁ, జక్కెరవిల్తుఁ డెక్కడ వెన్నాడునో యనుభయంబునంబోలె నించుక తిరిగిచూచుచు, నియ్యోళవు సకియలకుం జెప్పుకుమని రాచిల్కకుఁ బ్రియంబు జెప్పుచు, మగతేఁటి యంటియంటని ప్రసూనకలికపోలిక నరవిరి బాగుతో సోలి, కప్పురంపుటనంటుల నంటు ద్రాక్షపందిళ్ళ తెరువునఁ బూఁదేనెకాలువలు దాఁటి, చెంగలువబావులడగ్గఱ వట్టివ్రేళ్ళ చప్పరంబులనీడ వ్రీడాభరం బీడిచికొనిపోవ,

ఆ ఘనుని బాసి, మంజీ
రాఘోషము మెఱయ నరిగె నంతఃపురికిన్
వే ఘనజఘన తళుక్కన
మేఘము నెడబాసిపోవు మెఱపో యనఁగన్.

ఎటువంటి నేర్పరి నిశా
విటునల్లుఁడు! నడుమ నిల్చి, వెడసింగిణిచే
నటుచూ పిటు, నిటుచూ పటు
పటురయమున నేసె నాసుభద్రార్జునులన్.

(విజయవిలాసము నుండి)



మువ్వగోపాల

క్షేత్రయ్య

నాదనామక్రియ - త్రిపుట

అయ్యయ్యో, వెగటాయెనే!
పయ్యెదమీఁదఁజేరి పవ్వళించియుండేసామికి॥ పల్లవి

వెలఁది నామోము తెప్పవేయక కనుగొన
కలయ నిండుసంజచీకటి గ్రమ్మితే
కలికి! నీముద్దుమోము కానరాకయుండునని
తెలిపి ప్రొద్దుండగానే దీపము తెమ్మనేసామికి॥ అయ్యయ్యో.

ననబోడి! వినుమమ్మ, నాపై చాలప్రేమచే
దనదంతమున నాయధరము నొక్కి
మొనసి మాటాడితే మోవి విడువవలెనని
అనువ చేసైగ లాడుచుండే సామికి॥ అయ్యయ్యో.

మదిరాక్షి! వినుమమ్మ, మువ్వగోపాలుడు
నిదురించిన గౌఁగిలి వదలీనని
పదరి శయ్యమీఁద దుప్పటికొంగులు నాలుగు
ముదముతో గట్టిగా ముడిగొనుమనుసామికి॥ అయ్యయో.

కాంభోజి - ఝంపె

ఏమిసేయుదు, మోహమెటువలె దీరును?
భామినీమణిని ఎవ్వరు తోడితెచ్చేరు॥ పల్లవి

వెలయ నీదుముఖారవిందంబు లిఖియించి
అలరువాసనలు వ్రాయగనేరనైతి
కళలొల్కు నీమోవి గదిసి వ్రాసితిగాని
నెలత తేనియలుంచ నే నేరనైతి॥ ఏమిసేయుదు.

కలికి సొగసైన నీకనులు వ్రాసితిగాని
జెళుకుజూపులు వ్రాయు విత మెఱుగనైతి
గళముమరేఖలు దెలియగాను వ్రాసితిగాని
చెలగి కోకిలవంటి పలుకు వ్రాయగనైతి॥ ఏమిసేయుదు.

తరుణిరో ! నాగబంధమురీతి గలయుటలు
గరిమ వ్రాసితిగాని పరవశముచేత
పరగ మామువ్వగోపాల రారాయని
తిరుగ రతులకు బిలుచు తెలివి వ్రాయగనైతి॥ ఏమి...

(మువ్వగోపాలపదములనుండి)



రా మ నా మా మృ త ము

త్యా గ రా జు

ముఖారి—రూపక

ఎంతని నే వర్ణింతును శబరీభాగ్య-మెంతని। వే
దాంతలు వరకాంతలు జగ-మంత నిండియుండగ
ఎంతని నే వర్ణింతును.

కనులార సేవించి-కమ్మనిఫలముల నొసగి
తనువు పులకరించ పా-దయుగములకు మ్రొక్కి-
ఇనకులపతిసముఖంబున-పునరావృత్తిరహితపద
మును బొందిన త్యాగరా—జనుతురాలిపుణ్యంబును
ఎంతని నే వర్ణింతును.

కన్నడగౌళ-దేశాది

సొగసుజూడ తరమా ? నీసొగసుజూడ తరమా ?
నిగనిగమను సుకపోలయుగముచే మెఱయు మోము
సొగసు జూడతరమా ?

అమరార్చితపదయుగము—అభయప్రదకరయుగము
కమనీయతనునిందిత-కామ ! కామరిపునుత నీ—సొగసు...

వరబింబసమాధరము-వకుళసుమంబులయురము
కరధృతశరకోదండ-మరకతాంగ వరమైన-సొగసు...

చిఱునవ్వులు ముంగురులు-మఱి కన్నులతేటో!
వరత్యాగరాజ-వందనీయ ! యిటువంటి
సొగసుజూడ తరమా ? నీ...

(కృతులనుండి)